

యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల్లో మాట్లాడుతున్న ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

అట్టహాసంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలు

● ఒంగోలులో ప్రారంభం ● నగరంలో భారీ ర్యాలీ

ఒంగోలు విద్య, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్వర్ణోత్సవ మహాసభలు ఒంగోలులో ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముందుగా నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన సభలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తుందని చెప్పారు. డీఈవో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు బాధ్యతతో బోధన చేయాలన్నారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ తాను గతంలో ఉపాధ్యాయురాలిగా పనిచేశానని, ఆ వృత్తిలోనే అత్యున్నత గౌరవం పొందానని తెలిపారు. స్వర్ణోత్సవాల సందర్భంగా జిల్లాస్థాయిలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన ఉపాధ్యాయులకు జిల్లా శాఖ తరఫున బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు, సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, కె.శ్రీనివాసరావు, వీరారెడ్డి, జిల్లా నలుమూలల నుంచి యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుంటే కఠిన చర్యలు

కళాశాలల యాజమాన్యాలకు కలెక్టర్ అన్సారియా హెచ్చరిక

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఫీజు రీయింబర్స్‌మెంట్ అందలేదన్న కారణంతో జిల్లాలో ఏ విద్యార్థికైనా హాల్ టికెట్‌ను ఇవ్వకుంటే సంబంధిత కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. తరగతులు, ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకాకుండా నిరోధించడం తగదన్నారు. ఆమేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటనను విడుదల చేశారు. ఫీజు చెల్లించకపోవడం వల్ల కొంత మంది డిగ్రీ, ఇంటర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వడం లేదని, వారిని పరీక్షలకు రానివ్వడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎక్కడ ఇలా చేసినా ఆ కళాశాలను బ్లాక్ లిస్టులో పెడతామని స్పష్టం చేశారు. రీయింబర్స్‌మెంటుకు అర్హులైన విద్యార్థుల ఫీజును ప్రభుత్వం కళాశాలల అకౌంట్లలోకి జమ చేస్తుందన్నారు. ఈమేరకు జీవో కూడా జారీచేసిందని ఆమె స్పష్టం చేశారు.

జిల్లాలో మినీ గోకులాల (పశువుల షెడ్‌ల) పథకంలో ఆదిలోనే అక్రమాలు చోటుచేసుకున్నాయి. లబ్ధిదారుల్లో పెద్దఎత్తున బోగస్‌లు బయటపడుతున్నాయి. ఇప్పటికే పశువుల షెడ్లు ఉన్న పలువురు పోషకులు కొత్తగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా ప్రభుత్వ సబ్సిడీని కొట్టేసేందుకు ప్రయత్నించారు. వారికి పశుసంవర్ధక శాఖ అధికారులు సంపూర్ణంగా సహకరించారు. ప్రభుత్వ నిబంధనలను తోసిరాజని అనర్హులను లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. క్షేత్రస్థాయిలో పశువుల షెడ్ల నిర్మాణాల పర్యవేక్షణ బాధ్యత చూసే డ్వామా సిబ్బంది పరిశీలనలో బోగస్‌ల విషయం బహిర్గతమైంది. మొత్తం 1,137 యూనిట్లకు ఎంపిక చేసిన లబ్ధిదారుల్లో 250కిపైన బోగస్ అని తేలింది. అందుకు కొంత రాజకీయ ఒత్తిళ్లు కూడా కారణమయ్యాయి. ఈనేపథ్యంలో బోగస్ యూనిట్లను డ్వామా అధికారులు రద్దు చేశారు. వాటిని కొత్తవారికి కేటాయించాలని నిర్ణయించారు.

- జాబితాలో అనర్హులకు చోటు
- డ్వామా క్షేత్రస్థాయి సిబ్బంది పరిశీలనలో గుర్తింపు
- కళ్లకు గంతలు కట్టుకున్న పశుసంవర్ధక శాఖ అధికారులు
- జిల్లాలో 250 యూనిట్లు రద్దు
- అవన్నీ కొత్తవారికి మంజూరు



గోకులం షెడ్ (ఫైల్)

నిబంధనలు తూచ్!

మినీ గోకులం లబ్ధిదారుల్లో నాల్గో వంతు బోగస్

ఒంగోలు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం పశుపోషకులకు ఊతం ఇచ్చేలా సబ్సిడీతో మినీ గోకులాల పథకాన్ని ప్రకటించింది. గరిష్ఠంగా ఆరు గేదెలు ఉన్న పశుపోషకులకు షెడ్ నిర్మాణానికి రూ.2.30 లక్షలు యూనిట్ ధరగా నిర్ణయించింది. అందులో 10శాతం లబ్ధిదారుడు చెల్లిస్తే మిగిలిన 90శాతం ఉపాధి పథకం మెటీరియల్ కోటా నిధుల నుంచి మంజూరు చేసేలా ఉత్తర్వులు ఇచ్చింది. రెండు పశువులుండే షెడ్‌కు రూ.1.15లక్షలు, నాలుగు పశువులకు అయితే రూ.1.85వేలు యూనిట్ ధరగా నిర్ణయించింది. గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లకు 70శాతం సబ్సిడీతో 50 గొర్రెలు ఉండే షెడ్ కు రూ.2.30 లక్షలు, 100 కోళ్లు ఉండే షెడ్‌కు రూ.1.32లక్షలు యూనిట్ విలువగా ప్రకటించింది. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పశుసంవర్ధకశాఖ అధికారులకు కట్టబెట్టింది. నిర్మాణాల పర్యవేక్షణ బాధ్యతను డ్వామా సిబ్బందికి అప్పగించింది. జిల్లాకు 1,075 యూనిట్లను మంజూరు చేసింది. తీరప్రాంత మండలాలకు 50, ఇతర మండలాలకు 25 వంతున అధికారులు కేటాయించారు.

నిబంధనలు ఇవీ..

మినీ గోకులం కోసం వాటా ధనం పది శాతం చెల్లించేందుకు ముందుకు వచ్చిన పశుపోషకుల నుంచి ఆ మొత్తానికి డీడీని తీసుకొని అతను అర్హుడా? కాదా? అన్న విషయాన్ని పశుసంవర్ధక శాఖ అధికారులు పరిశీలించాలి. గతంలో పశువుల పాక నిర్మించుకొని ఉంటే అలాంటి వారిని ఎంపిక చేయకూడదు. పశువులు ఉన్నాయా? పాల ఉత్పత్తి జరుగుతున్నదా? అన్నది కూడా పరిశీలించాలి. ఆతర్వాత నిబంధనల ప్రకారం అర్హతలు ఉన్న వారిని మాత్రమే పశువుల షెడ్‌కు లబ్ధిదారుడిగా ఎంపిక చేయాలి. గొర్రెలు, మేకలు, కోళ్ల పెంచే వారికి కూడా ఇవే నిబంధనలు వర్తిస్తాయి.

పట్టించుకోని పశుసంవర్ధక శాఖ అధికారులు

జిల్లాలోని పశుసంవర్ధక శాఖ అధికారులు గోకులం పథకం లబ్ధిదారుల ఎంపికలో గుడ్డిగా వ్యవహరించారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, ప్రామాణికాలను పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మరికొన్ని చోట్ల స్థానిక అధికార పార్టీ నాయకులు చెప్పిన వ్యక్తుల పేర్లను చేర్చేశారు. దీంతో భారీగా బోగస్ లబ్ధిదారుల పేర్లు జాబితాలో చేరాయి. పశుసంవర్ధక శాఖ అధికారులు ఎంపిక చేసి ఇచ్చిన జాబితా ప్రకారం డ్వామా అధికారులు వాటిని మంజూరు చేశారు. నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించాలని ఉన్నతస్థాయి నుంచి ఒత్తిడి వస్తుండటంతో క్షేత్రస్థాయిలోని డ్వామా సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్తున్నారు. వెంటనే పనులను ప్రారంభించాలని కోరుతున్నారు. అయినప్పటికీ కొందరు ముందుకు రావడం లేదు. విషయం ఏమిటని వారు ఆరా తీయగా.. పశుసంవర్ధక శాఖ అధికారులు ఎంపిక చేసిన వారిలో దాదాపు నాల్గోవంతుకు షెడ్లు ఇప్పటికే పశువుల షెడ్లు నిర్మించుకున్న వారిగా తేలింది.

ఇప్పటికే షెడ్డు ఉన్న వారికీ మంజూరు

డ్వామా అధికారులు ఎంత కోరినా దాదాపు 250 మంది వరకూ లబ్ధిదారులు షెడ్ల నిర్మాణాలకు ఆసక్తి చూపలేదు. అందుకు కారణాన్ని పరిశీలిస్తే వారందరికీ ఇప్పటికే షెడ్లు ఉండటమేనని తేలింది. ఎంపిక సమయంలో నిబంధనలను, ప్రామాణికాలను పశుసంవర్ధక శాఖ అధికారులు పట్టించుకోకుండా స్థానిక నేతలు సూచించిన వారి పేర్లను జాబితాలో చేర్చారు. కొన్నిచోట్ల షెడ్‌లు ఉన్నవారు కూడా తమకు లేదని చెప్పి ఏదో ఒక స్థలం చూపించి దరఖాస్తు చేశారు. ప్రస్తుతం డ్వామా సిబ్బంది ఒత్తిడితోపాటు సదరు నిర్మాణ స్థలం జియో ట్యాగింగ్, ఫొటోలు తీయడం తప్పనిసరి చేయడంతో అసలు విషయం బయటకు వస్తోంది. ఒంగోలు రూరల్ మండలానికి 50 యూనిట్లు మంజూరు చేస్తే 30 వరకూ ఇలాంటి బోగస్‌లు ఉన్నట్లు డ్వామా సిబ్బంది గుర్తించారు. యరజర్లలోనే 25 యూనిట్లు మంజూరు చేస్తే 10 బోగస్‌లు ఉన్నాయి. ముక్తినూతలపాడు, చేజర్ల, చింతాయగారిపాలెం, ఉలిచి, గుండాయపాలెం ఇలా అన్ని గ్రామాల్లోనూ అనర్హులకు షెడ్లు మంజూరు చేసినట్లు ప్రాథమికంగా తేలింది. ఇలాంటి పరిస్థితే ఇతర ప్రాంతాల్లోనూ ఉంది. మొత్తంమీద 250కి పైగా బోగస్ లబ్ధిదారులు ఉన్నట్లు గుర్తించి వాటిని డ్వామా అధికారులు రద్దు చేశారు. దీనిపై డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ ఆంధ్రజ్యోతికి వివరణ ఇస్తూ ఇప్పటికే షెడ్లు ఉన్న వారి పేర్లు లబ్ధిదారుల జాబితాలో ఉన్న మాట వాస్తవమేన్నారు. తమ సిబ్బంది వారిని గుర్తించి ఇచ్చిన నివేదిక ఆధారంగా రద్దు చేస్తున్నామన్నారు. ఆ స్థానంలో కొత్తవారిని ఎంపిక చేసి నిర్ణీత గడువు లోపు నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

1,137 యూనిట్లు మంజూరు

జిల్లాకు ప్రభుత్వం 1,075 యూనిట్లు మంజూరు చేయగా రెండున్నర వేలకు పైగా దరఖాస్తులు అధికారులకు అందాయి. అందులో ఆయా మండలాలకు కేటాయించిన వాటికి అనుగుణంగా లబ్ధిదారులను ఎంపిక చేశారు. అనంతరం పది నుంచి 20శాతం అదనంగా మంజూరు చేయాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. అలా ఇప్పటి వరకు 1,137 యూనిట్లను మంజూరు చేశారు. మరో రెండు, మూడు మండలాలకు సంబంధించి మంజూరు ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంది. షెడ్ల నిర్మాణంపై డ్వామా అధికారులు ప్రత్యేక దృష్టి సారించడంతో పక్షంరోజుల నుంచి పనులు ఊపందుకున్నాయి.

విజన్-2029 ప్రణాళిక రెడీ



రూ.4.27 లక్షల తలసరి ఆదాయం

రూ.1.14 లక్షల కోట్ల స్థూల ఉత్పత్తి

వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాలుగా విభజన

పాడి పరిశ్రమ, మైనింగ్ ద్వారా అధిక రాబడికి అంచనా

లక్ష్యం సాధించేందుకు పలు ప్రతిపాదనలు

ఒంగోలు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రానున్న ఐదేళ్లలో జిల్లాలో స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయం రెండూ ప్రస్తుతం ఉన్న దాని కన్నా రెట్టింపునకుపైన వృద్ధి కానున్నాయి. అందుకు సంబంధించి విజన్-2029 పేరుతో జిల్లా యంత్రాంగం కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. 2029 నాటికి జిల్లాలో స్థూల ఉత్పత్తి రూ.1.14 లక్షల కోట్లు, తలసరి ఆదాయం రూ.4.27 లక్షలుగా అంచనా వేసింది. ప్రధానంగా వ్యవసాయ అనుబంధ, పారిశ్రామిక, సేవా రంగాలుగా ఆయా అంశాలను విభజించి ప్రస్తుతం వాటి ద్వారా వస్తున్న రాబడిని పరిగణనలోకి తీసుకొంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2047 నాటికి వందేళ్లు పూర్తి కానుండటంతో వికసిత్ భారత్ పేరుతో విజన్-2047 డాక్యుమెంట్‌ను కేంద్ర ప్రభుత్వం రూపొందించగా స్వర్ణాంధ్ర - 2047 పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కూడా సిద్ధం చేసింది. జిల్లా, మండల స్థాయిలో ఐదేళ్ల కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనకు టీడీపీ కూటమి ప్రభుత్వం ఆదేశించింది. ఆయా రంగాల వారీ రాబడి, మౌలిక సదుపాయాలు, ఇతరత్రా అంశాలకు సంబంధించి 2023-24ను బేస్ ఇయర్‌గా తీసుకొని 2024-25 నుంచి 2028-29 వరకు ఐదేళ్లపాటు ఆయారంగాలలో ఏటా 15శాతం వృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించింది. అందుకు అనుగుణంగా ప్రణాళికలను జిల్లా యంత్రాంగం రూపొందించింది.

రంగాల వారీ అంచనాలు ఇవీ..

2028-29 నాటికి స్థూల రాబడి రూ.1,14,712 కోట్లు అంచనా వేస్తుండగా అందులో వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారా రూ.38,183(33.90శాతం) కోట్లు. పారిశ్రామిక రంగం ద్వారా 35,870 (34.27శాతం) కోట్లు, సేవా రంగం ద్వారా రూ.40,654 (35.44శాతం) కోట్ల రాబడి అంచనా వేశారు. అంటే ఇప్పటి వరకు జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాల ద్వారా అధిక శాతం రాబడి ఉంటుండగా భవిష్యత్‌లో సేవా రంగం విస్తరించి తద్వారా అధిక శాతం రావచ్చని భావిస్తున్నారు. మొత్తంగా ఈ మూడు రంగాల్లో దాదాపు 20 అనుబంధ విభాగాలు ఉండగా అన్నింటిలోనూ ప్రస్తుతం అత్యధికంగా పాడి పరిశ్రమ, పశు సంపద ద్వారా సుమారు రూ.9096 కోట్ల (18.07శాతం) రాబడి ఉండగా 2028-29 నాటికి అది రూ. 20,939 కోట్లకు చేరనుంది. అలాగే ప్రస్తుతం వ్యవసాయ పంటల ద్వారా దాదాపు 13.67శాతంతో రూ.6,885 కోట్లు ఉండగా ఐదేళ్లలో అది రూ.12,215 కోట్లకు పెరగనుంది. పారిశ్రామికరంగంలో ప్రధానంగా ప్రస్తుతం 16.53శాతంతో రూ.8,325 కోట్ల మేర మైనింగ్ రాబడి ఉండగా రానున్న ఐదేళ్లలో అది రూ.19,655 కోట్లకు చేరనుంది. అదే సయయంలో సేవా రంగంలో ప్రస్తుతం అత్యధికంగా 8.58శాతంతో రూ. 4,321 కోట్ల రాబడి రియల్ ఎస్టేట్, ఇతర వ్యక్తిగత ఆస్తులకు సంబంధించి ఉండగా ఐదేళ్లలో అది రూ 11,555 కోట్లకు చేరనుంది. తద్వారా రానున్న రోజుల్లో జిల్లాలో స్థూల ఉత్పత్తి పెరుగుదల, రాబడుల్లో పాడిపరిశ్రమ, మైనింగ్, రియల్ ఎస్టేట్ వంటి రంగాలు కీలకం కానున్నాయి. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధి కూడా ప్రధాన భూమిక పోషించనుంది.

రాబడి పెంపునకు ప్రతిపాదనలు

ఆయా రంగాలలో ఐదేళ్లలో ఈ అంచనాలను చేరుకొనేందుకు తీసుకోవాల్సిన చర్యలను ప్రణాళికలో సూచించారు. వ్యవసాయ అనుబంధ రంగాలను పరిశీలిస్తే.. సాగులో అపరాల విస్తీర్ణం పెంపు, నీటి పారుదల సౌకర్యాల విస్తరణ, విస్తారంగా మైక్రో ఇరిగేషన్ ద్వారా ఉద్యాన పంటల సాగు, పాడిపరిశ్రమ మరింత పెంపులో భాగంగా పాల ఉత్పత్తి అధికంగా ఇచ్చే పశువులు, పశుగ్రాసం పెంపు చర్యలు సూచించారు. పారిశ్రామిక రంగానికి సంబంధించి విస్తారంగా ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో పరిశ్రమల స్థాపన, గ్రానైట్ ఆధారిత పరిశ్రమల పెంపు, కార్మికుల్లో నైపుణ్యం పెంపు, జిల్లాలో అత్యధికంగా ఉన్న జాతీయ రహదారుల ఆధారంగా ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు ప్రతిపాదించారు. సేవా, ఇతర రంగాల్లో ప్రధానంగా పర్యాటకానికి ప్రాధాన్యం ఇచ్చారు. అందులో దేవాలయాల అభివృద్ధి, తీర ప్రాంతంలో రిసార్టులు, బీచ్‌ల అభివృద్ధి, నదులు, అడవుల ఆధారంగా పర్యాటక రంగ వృద్ధిని సూచించారు. సహజన వనరుల అభివృద్ధి ద్వారా విద్య, వైద్యం, తాగునీరు, మహిళల ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పన మెరుగుపర్చడం ద్వారా ప్రజల తలసరి ఆదాయాన్ని పెంచాలని ప్రణాళికలో పేర్కొన్నారు.

తలసరి ఆదాయం, స్థూల ఉత్పత్తి రెట్టింపు

జిల్లాలో 2022-23 నాటికి 24.50 లక్షల మంది జనాభా ఉన్నట్లు అంచనా. వివిధ రంగాల ద్వారా సుమారు రూ.50,350 కోట్ల స్థూల రాబడి, రూ.1,97,354 లక్షల తలసరి ఆదాయంగా అంచనా వేసిన అధికారులు ఐదేళ్ల కార్యాచరణ ప్రణాళిక ద్వారా స్థూల రాబడిని 1,14,712 కోట్లకు పెరిగేలా చూడాలని ప్రతిపాదించారు. అప్పటికి జిల్లా జనాభా సుమారు 24.90 లక్షలకు చేరుకుంటుందని భావించి తలసరి ఆదాయం రూ.4,27,409గా అంచనా వేశారు. ప్రస్తుతం స్థూల రాబడి రూ.50,350 కోట్లు, వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారా రూ.18,641 (37.02 శాతం) కోట్లు, పారిశ్రామిక రంగం ద్వారా రూ.15,218 (30.22శాతం) కోట్లు, సేవా రంగం ద్వారా 16,491 (32.75శాతం) కోట్లుగా ఉంది.

మల్లవరంలోని శ్రీప్రసన్నవేంకటేశ్వర స్వామి ఆలయం (వ్యూ)



చూడాలంతా.. శ్రీవారి ము'చెట్లు'!

మల్లవరం ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం చుట్టూ ఆకర్షణగా నిలుస్తున్న శ్రీవారి వనం

7లో



నారాయణుడికి పుష్పాభిషేకం

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సీఎస్‌పురం మండలంలోని మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయంలో మహాపుష్పయాగం ఆదివారం కన్నుల పండువలా సాగింది. ఈ సందర్భంగా స్వామివారికి వివిధ రకాల పూలతో అభిషేకం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై తిలకించి తరించారు. ఏటా కార్తీక మాసం మూడు, నాలుగు ఆదివారాల్లో ఒక రోజు ఈ యాగం నిర్వహిస్తారు. - సీఎస్‌పురం(పామూరు), ఆంధ్రజ్యోతి

చీమకుర్తిలో షిర్డీసాయి మందిరం ధ్వంసం

● కేసు నమోదు


ధ్వంసమైన సాయి మందిరం

చీమకుర్తి, నవంబరు 24: చీమకుర్తిలో ఎంఎస్ఆర్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో గత ఇరవైఏళ్లుగా పూజలు జరుగుతున్న షిర్డీసాయి మందిరాన్ని ఆదివారం ధ్వంసం చేశారు. మందిరంలో ఉన్న సాయి, వినాయక, అమ్మవారి ప్రతిమలను తొలగించారు. దీంతో కళాశాల ప్రిన్సిపాల్ వీవీ.శివారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు మేరకు.. ద్వారకామయి ఎడ్యుకేషనల్ సొసైటీ తరపున ఎంఎస్ఆర్ జూనియర్ కళాశాలను చీమకుర్తిలోని రెడ్డిబజారులో వీవీ.శివారెడ్డి 2000సంవత్సవరంలో ఏర్పాటు చేశారు. ఈ కళాశాలను పట్టణానికి చెందిన సుధాకరరెడ్డికి చెందిన స్థలంలో లీజుకు తీసుకుని నిర్వహిస్తూ ఉన్నారు. 2004లో కళాశాలకు ముందు లీజుస్థలంలో సాయిమందిరాన్ని ఏర్పాటు చేయగా అప్పటి నుంచి పూజలు నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే కాలానుగుణంగా లీజును రెన్యువల్ చేసుకుంటుండగా తాజాగా 2020లో చేసుకున్న రెన్యువల్ ప్రకారం గడువు 2030వరకూ ఉంది. కాగా ఆదివారం లీజుకు ఇచ్చిన స్థలం యజమాని సుధాకరరెడ్డి మందిరాన్ని ధ్వంసం చేసినట్లు ప్రిన్సిపాల్ శివారెడ్డి ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కృష్ణయ్య కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

టంగుటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై నాగమల్లీశ్వరరావు యువతను కోరారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మీ వ్యక్తిగత ఫొటోలు ప్రధానంగా మహిళలు సోషల్ మీడియాలో షేర్ చేయవద్దని సూచించారు. ఆన్‌లైన్ స్నేహాలను, తెలియనివారి వద్ద నుండి వచ్చే లింక్‌లను క్లిక్ చేయవద్దని కోరారు. పోలీసులు, సీబీఐ/ఈడీ అని ఎవరైనా కాల్ చేసి వీడియో కాల్‌లో అరెస్ట్ చేస్తామని అన్నారంటే నమ్మవద్దని, దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ సంప్రదించాలని పేర్కొన్నారు. అలాగే మీరు లాటరీ గెలిచారని, గిఫ్ట్ హాంపర్ వచ్చిందని, కాల్ చేసి జీఎస్టీ లేదా ట్యాక్స్ చెల్లించాలని చెప్తారని, వాటినీ నమ్మవద్దని తెలిపారు. ఎవరైనా స్విగ్గీ లేదా జొమోటో నుంచి కాల్ చేసి అడ్రస్ కన్ఫామ్ చేయడం కోసం లింకునొక్కమంటే నొక్కవద్దని, ఒక వేళ అలా చేస్తే మీఫోన్ హ్యాక్ అయ్యే అవకాశం ఉందని ఎస్సై హెచ్చరించారు. ప్రధానంగా మహిళలు, యువత జాగ్రత్తగా ఉండాలని నాగమల్లీశ్వరరావు వివరించారు.

14 మద్యం సీసాల స్వాధీనం


పట్టుకున్న మద్యం బాటిళ్లతో ఎస్ఐ అజయ్‌బాబు

సంతనూతలపాడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకపాడు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఆదివారం ఎస్ఐ వి.అజయ్‌బాబు దాడిచేసి 14 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

9మంది జూదరుల అరెస్టు

మద్దులూరు గ్రామశివారులో ఆదివారం పేకాట ఆడుతున్న సమాచారం అందుకున్న ఎస్ఐ అజయ్‌బాబు తన సిబ్బందితో దాడి చేసి 9మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.8390 నగదును స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు శ్రీనివాసరావు, భాస్కరరావు, పవన్ పాల్గొన్నారు.

పాకలలో 8 మద్యం బాటిళ్లు పట్టివేత

సింగరాయకొండ: సింగరాయకొండ నుంచి అక్రమంగా మద్యం బాటిళ్లు తరలిస్తున్న పాకల గ్రామానికి చెందిన కందుకూరి సుబ్బారావును ఎస్సై మహేంద్ర ఆదివారం పాకలరోడ్డు వద్ద అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న 8 మద్యం క్వార్టర్ బాటిళ్లను సీజ్‌చేశారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అక్రమంగా మద్యం రవాణా చేసినా, గ్రామాల్లో బెల్ట్‌దుకాణాలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టీడీపీ నేత రామారావు ఆకస్మిక మృతి

మర్రిపూడి, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు, మర్రిపూడి సహకార సంఘం మాజీ అధ్యక్షుడు జాగర్లమూడి రామారావు (63) ఆదివారం గుండెపోటుతో మరణించారు. ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో గుండెపరీక్షలు చేయించుకునేందుకు వెళ్లిన ఆయన పరీక్షలు చేయించుకుని వైద్యసాయం పొందుతుండగా మధ్యాహ్నం 11 గంటల సమయంలో వైద్యశాలలోనే మృతిచెందారు. రామారావు భౌతికకాయాన్ని స్వగ్రామం వేమవరానికి ఆదివారం సాయంత్రం తరలించారు. రామారావు గడచిన 30 సంవత్సరాలుగా మండల రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారు. టీడీపీ ఆవిర్భావం తర్వాత పార్టీలో చేరి గ్రామ రాజకీయాల్లో క్రియాశీలకంగా పనిచేశారు. తర్వాత స్థానిక పరిస్థితులకు అనుగుణంగా కాంగ్రెస్‌పార్టీలో చేరి, ఎన్నికల్లో గెలిచి మర్రిపూడి సొసైటీ అధ్యక్షుడిగా పనిచేశారు. జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. గత శాసన సభ ఎన్నికల్లో మాగుంట శ్రీనివాసులురెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. గత శాసనసభ ఎన్నికల్లో టీడీపీకి వేమవరంలో అత్యధిక మెజార్టీ రావడంలో జాగర్లమూడి కీలకపాత్ర పోషించారు. రామారావు భార్య జ్యోతి సమగ్ర శిక్షలో పర్యవేక్షకురాలిగా ఒంగోలులో పనిచేస్తున్నారు. కొడుకు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా, కుమార్తె ఎంబీబీఎస్ పూర్తి చేశారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న మంత్రి స్వామి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మండలంలోని నాయకులు, ప్రజా ప్రతినిధులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. సోమవారం అంత్యక్రియలు వేమవరంలో నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

శివస్వాముల సింగరకొండ పాదయాత్ర


పాదయాత్రను ప్రారంభిస్తున్న స్వాములు

మద్దిపాడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు నుంచి శివస్వాములు ఆదివారం సింగరకొండ ఆంజనేయస్వామి దేవాలయానికి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా అక్కడి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పొదిలి గణేష్, విఘ్నేష్, యశ్వంత్, తాటికొండ శ్రీనివాస్, అశోక్, పవన్, అచ్యుతరావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పెద్దకొత్తపల్లిలో పడిపూజ

మద్దిపాడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పెద్దకొత్తపల్లి శివాలయం ఆవరణలో అయ్యప్పస్వామి అఖండ పడిపూజోత్సవం సోమవారం రాత్రి నిర్వహిస్తున్నట్లు తిరుమలశెట్టి సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అయ్యప్ప, భవానీ, శివ, ఆంజనేయ స్వాములు పాల్గొనాలని ఆయన కోరారు.

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న పుల్లారావు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పేరుతో ప్రజలపై విధించిన ట్రూఅప్ చార్జీల భారాన్ని ప్రభుత్వం ఉపసహరించుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఒంగోలు నగరాభివృద్ధి కమిటీ, పౌర సంఘాల సమైక్య ఆధ్వర్యంలో ఆదివారం విద్యుత్ స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ చార్జీలు అనే అంశంపై నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి మారెళ్ళ సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు ఏవీపుల్లారావు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలపై 11820 కోట్ల భారం పడుతుందన్నారు. పౌర సంఘాల సమైక్య కన్వీనర్ రమేష్, మారెళ్ళ సుబ్బారావు, ఓగరాల రాధాకృష్ణమూర్తి, దేవతా శ్రీరాములు, చీకటి శ్రీనివాసరావు, దామా శ్రీనివాసులు, టి.భక్తసింగ్‌రాజు, కె.విశ్వసేన్, అంజి రెడ్డి, ఎ.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మానవతావాది సీఎం చంద్రబాబు

మంత్రి స్వామి

30 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత


చెక్కును అందజేస్తున్న మంత్రి స్వామి

కొండపి/టంగుటూరు, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఆదుకునే మానవతావాది సీఎం చంద్రబాబునాయుడని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం టి.నాయుడుపాలెంలోని తన స్వగృహంలో నియోజకవర్గంలోని కొండపి, టంగుటూరు, సింగరాయకొండ, పొన్నలూరు మండలాలతోపాటు కందుకూరు, అద్దంకి మండలాలకు చెందిన 30 మంది బాధితులకు రూ.38,78,482 విలువైన చెక్కులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. 2014-19 మధ్య కాలంలో కూడా నియోజకవర్గంలోని వందలాది మందికి సీఎంఆర్ఎఫ్ సాయం చంద్రబాబు అందించారని గుర్తు చేసుకున్నారు. అనారోగ్యానికి గురైన పేదలను ఆదుకోవడంలో చంద్రబాబు ముందుంటారన్నారు. బాధితులు సీఎం చంద్రబాబుకు, మంత్రి స్వామికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, పెదకండ్లగుంట మాజీ సర్పంచ్ తానికొండ వెంకటేశ్వర్లు ఆయా మండలాల్లోని నాయకులు పాల్గొన్నారు.

సాంస్కృతిక రంగానికి ప్రభుత్వ ప్రోత్సాహం

● ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

● పలువురికి పురస్కారాల ప్రదానం


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు కల్చరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సాంస్కృతిక రంగానికి ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో కళామిత్ర మండలి 18వ వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సంస్థ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు, నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ తెలుగు భాష వికాసానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆ దిశగా ఎన్నో సంవత్సరాలుగా కృషిచేస్తున్న కళామిత్ర మండలి నిర్వాహకులను అభినందించారు. నగరంలో సాంస్కృతిక సంఘాలకు, కార్యక్రమాలకు తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న) మాట్లాడుతూ గతంలో సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు ఎంతో ప్రోత్సాహం ఉండేదని, అయితే నేడు అది తగ్గిపోవటంతో కార్యక్రమాల నిర్వహణ సైతం వెనకబడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ కవి కె.శివారెడ్డి మాట్లాడుతూ రచయితలకు సామాజిక బాధ్యత ఉండాలన్నారు. అనంతరం ఆయనకు నూనె వెంకాయమ్మ, వెంకటరత్నం జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. తేళ్ల అరుణ ప్రసంగిస్తూ ప్రతి సంవత్సరం దేశంలోని ప్రముఖ కవులను నగరానికి రప్పించి వారిని ఘనంగా సత్కరిస్తున్న మండలి అధ్యక్షుడు అంకమ్మరావు కృషిని అభినందించారు. సమాజంలో సమస్యలను ఎత్తిచూపటంలో కవులు, రచయితలు ఎప్పుడూ ముందుంటారని, అటువంటి వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత అటు ప్రభుత్వం మీద, ఇటు సమాజంపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీరవల్లి సుబ్బారావు, గుత్తికొండ సుబ్బారావు, జీవీ.పూర్ణచందు, డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, డాక్టర్ డి.ధాత్రికుమారి, బెల్లంకొండ విజయలక్ష్మి, బీరం అరుణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు ఆధ్వర్యంలో పలువురు సాహితీవేత్తలను జాతీయ స్థాయి సాహిత్య పురస్కారాలతో ఘనంగా సత్కరించారు.

ఉపాధ్యాయుడు రాంబాబు సేవలు ప్రశంసనీయం

● మంత్రి స్వామి, మారిటైం బోర్డు చైర్మన్ సత్య


రాంబాబును సత్కరిస్తున్న మంత్రి స్వామి, మారిటైంబోర్డు చైర్మన్ సత్య

సింగరాయకొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు, పనిచేసిన ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంపుదలచేయడానికి, నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయుడు అర్రిబోయిన రాంబాబు కృషి చేశారని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. స్థానిక రైల్వేస్టేషన్‌రోడ్డులోని బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రాంబాబుకు ఆత్మీయ అభినందన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి స్వామి పాల్గొని మాట్లాడారు. సమాజంలో గురువుల పట్ల విద్యార్థులకు ప్రత్యేక గౌరవం ఉంటుందని చెప్పారు. సమాజానికి ఉత్తమ పౌరులను అందించే గురుతర బాధ్యత గురువుల మీదే ఉందన్నారు. విద్యార్థులకు విద్యతోపాటు క్రీడల్లోనూ, ఇతర రంగాలలో రాణించే విధంగా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ ఉపాధ్యాయుడు రాంబాబు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుగా అవార్డును తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం అవార్డు గ్రహీతను స్వామి, సత్య ఇరువురు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కత్తి శ్రీనివాసరావు, జిల్లా పరీక్షల విభాగం సెక్రటరీ మర్రిబోయిన శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, టీడీపీ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులు, డాక్టర్ స్వర్ణ వెంకటేశ్వరరావు, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సు కోరేవారు రెడ్డి కులస్థులు

● ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

● ఘనంగా వనభోజనాలు



సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి

మద్దిపాడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సును, తోటి వారి క్షేమాన్ని కోరే వారు రెడ్డి కులస్థులని దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీ చెవిరెడ్డి భాస్కరరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మల్లవరం రిజర్వాయర్ వద్ద రెడ్డి జనాభ్యుదయ సంఘం కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ రెడ్డి జనాభ్యుదయ సంఘం చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు ఒంగోలులో హాస్టల్ వసతి కల్పించటం హర్షణీయమని చెప్పారు. జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ రెడ్డి కులస్థుల అభ్యుదయానికి అన్ని విధాల అండగా ఉంటున్న రెడ్డి జనాభ్యుదయ సంఘం మరింత ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్యప్రదర్శన, మహిళల ఆటల పోటీలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. సంఘ అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, కార్యదర్శి లింగారాం కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బన్నీ, వెంకటేశ్వరరెడ్డి, సంఘ ట్రెజరర్ కొత్త శీనారెడ్డి, వెంకటరెడ్డి, గౌరవసలహాదారులు రామసుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, కార్యనిర్వాహక సభ్యుడు జి.చంద్రారెడ్డి, ఆర్.సుధాకర్‌రెడ్డి, వనమా సుబ్బారెడ్డి, నార్నె వెంకటరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడి పూజోత్సవం


ఒంగోలు సీతారాంపురంలో జరిగిన పూజలో పాల్గొన్న భక్తులు


అన్నంగిలో జరిగిన పడిపూజకు హాజరైన ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఒంగోలు కల్చరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం సీతారాంపురంలో ఆదివారం రాత్రి ఏర్పాటుచేసిన అయ్యప్ప పడిపూజోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అరటి బోదెలతో అయ్యప్పస్వామి, వినాయకుడు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్లకు మందిరాలను నిర్మించి ప్రత్యేక పూజ, అభిషేకం చేశారు. అదేవిధంగా నగరానికి చెందిన అయ్యప్పస్వాములు, భవానీ, శివస్వాములు పెద్దసంఖ్యలో హాజరై భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అయ్యప్పస్వామి భక్తబృందం ఆధ్వర్యంలో స్వాములకు భిక్ష జరిగింది.

అన్నంగిలో..

మద్దిపాడు: మద్దిపాడు మండలం అన్నంగి గ్రామంలో టీడీపీ నాయకుడు రాయపాటి శ్రీనివాసరావు ఆదివారం అయ్యప్ప పడిపూజ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ హాజరై స్వామివారికి పూజలు నిర్వహించారు. పడిభజనలో అధిక సంఖ్యలో స్వాములు పలు భక్తి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, గ్రామ అధ్యక్షులు నారిపెద్ది అనిల్, నాయకులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, మండవ గోపి తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధంతోనే మానవతా విలువల సమాజం

● రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్

● ఘనంగా బౌద్ధ ధర్మ దీక్ష ఉత్సవం



సభలో ప్రసంగిస్తున్న విజయ్‌కుమార్

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేశానికి నేడు బౌద్ధధర్మం అవసరం ఎంతో ఉందని, సమాజంలో మానవతా విలువలు, మంచి దానితోనే సాధ్యపడుతుందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని అంబేడ్కర్ భవనంలో 68వ బౌద్ధ ధర్మ దీక్ష ఉత్సవం ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ఇ.మహేష్ అధ్యక్షతన ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా మాజీ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షులు వై.హరిబాబు హాజరయ్యారు. ముందుగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ బౌద్ధ మతం లేకపోతే దేశంలో అసమానతలు విచ్ఛిన్నమై సమాజమే శిథిలావస్థకు చేరుకునే ప్రమాదం ఉందన్నారు. బుద్ధిజం ద్వారానే మనిషికి ప్రజ్ఞ, శీల, కరుణ అనేవి వస్తాయని తెలిపారు. బీసీకే రాష్ట్ర అధ్యక్షులు ఎన్‌జే.విద్యాసాగర్ మాట్లాడుతూ నిజమైన సమాజాభివృద్ధి కావాలంటే బౌద్ధం చాలా అవసరమని పేర్కొన్నారు. ముందుగా మిరియాలపాలెం నుంచి అంబేడ్కర్ భవనం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వీవీ.దుర్గారావు, జాతీయ కార్యదర్శి వై.కొండలరావు, జాతీయ సభ్యులు ఇ.నాగేశ్వరరావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పిల్లి రాంబాబు, జిల్లా కో ఆర్డినేటర్ బి.రాజేష్, కె.అనీల్, కె.రామకృష్ణ, వైసిద్ధార్థ, అంబేద్కరిస్టులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం పలువురు బౌద్ధ దీక్షను స్వీకరించారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం

చీమకుర్తి, నవంబరు24(ఆంధ్రజ్యోతి): మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం చీమకుర్తిలో ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా సంఘ జిల్లా కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వర్లు వ్యవహరించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా షేక్ అక్బర్, చలువాది శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడిగా మన్నం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షునిగా జి.వెంకటేశ్వర్లు, కోశాధికారిగా పర్వతం వెంకటేశ్వర్లు, సహాధ్యక్షులరాలిగా శివపార్వతి, జిల్లా కౌన్సిలర్లుగా లక్ష్మీరాజ్యం, మన్నం సుబ్బారావు, మల్లికార్జున, రాజేంద్రప్రసాద్, వద్ది శ్రీనివాసరావు, బొందెల ఆంజనేయులు, మహిళా కార్యదర్శిగా తుమ్మా శ్రీదేవి, మండల కార్యదర్శులుగా పర్వతం భాస్కరరావు, బొడ్డు బ్రహ్మయ్య, సురేష్, రాఘవ, కిషోర్‌కుమార్ తదితరులను ఎన్నుకున్నారు.

మర్రిపూడి మండల కమిటీ

మర్రిపూడి: యూటీఎఫ్ మర్రిపూడి మండల కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా చిట్టెం లింగయ్య, ప్రధాన కార్యదర్శిగా చేతల కోటేశ్వరరావును సభ్యులు ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కె. రమేష్‌బాబు, సహఅధ్యక్షుడిగా బి.ఆంజనేయులు, కోశాధికారిగా భాస్కరరావు, కుటుంబ సంక్షేమ కార్యదర్శిగా రాజాల గురవయ్య, జిల్లా కౌన్సిలర్‌లుగా జి.శ్రీనివాసరావు, జి.తేజోవతి, ఎం.ప్రసాదరావు ఎంపికయ్యారు.

రేపు మాజీ ఎంపీ సుబ్బరామరెడ్డి జయంతి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ మాగుంట సుబ్బరామరెడ్డి జయంతి వేడుకలు మంగళవారం ఒంగోలులో ఘనంగా నిర్వహించేందుకు మాగుంట కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఆరోజు ఉదయం 9.15 గంటలకు సింగరాయకొండ వద్ద ఉన్న పెరల్ డిస్టలరీలో సుబ్బరామరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తారు. 10.30 గంటలకు స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో సుబ్బరామరెడ్డి చిత్రపటానికి, అనంతరం నెల్లూరుబస్టాండు, రైల్వే స్టేషన్ రోడ్డు, అద్దంకి బస్టాండు సెంటర్‌లో ఉన్న సుబ్బరామరెడ్డి కాంశ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. సుబ్బరామరెడ్డి మనమడు మాగుంట సుబ్బరాంబాబు హాజరవుతారు. ఆయా కార్యక్రమాల్లో అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మాగుంట కుటుంబసభ్యులు కోరారు.

సామ్రాజ్యవాదాన్ని అంతమొందించాలి

● జనసాహితీ రాష్ట్ర అధ్యక్షుడు దివికుమార్


మాట్లాడుతున్న దివికుమార్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆసియా దేశాలలో కొనసాగుతున్న సామ్రాజ్యవాదాన్ని అంతం చేసేందుకు ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడమే మార్గమని జన సాహితీ రాష్ట్ర అధ్యక్షుడు దివికుమార్ పేర్కొన్నారు. ఒంగోలులోని హైదరీ క్లబ్ సమావేశపు హాలులో ఆదివారం జరిగిన మేల్కొన్న ఆసియా- స్టాలిన్ గ్రాడ్, దీర్ఘకవితల తెలుగు అనువాద పుస్తక పరిచయ సభలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో నేడు సామ్రాజ్యవాద వ్యతిరేక సాహిత్యాన్ని సృష్టించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జీవీ.కృష్ణయ్య మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడి వెనుక అమెరికా సామ్రాజ్యవాదులు ఉన్నారని ఆరోపించారు. జిల్లా నాయకుడు డీవీ అధ్యక్షత జరిగిన సభలో ఏసుదాసు, ఖాదర్ బాషా, యోహానరెడ్డి, సత్యనారాయణ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన ఓటర్ల జాబితా సవరణపై ప్రత్యేక డ్రైవ్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా రెండో రోజైన ఆదివారం కూడా జిల్లావ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బూత్‌లెవల్ అధికారులు అందుబాటులో ఉన్నారు. కొత్తగా ఓటు నమోదుతో పాటు ఓటర్లజాబితాలో చేర్పులు, మార్పుల కోసం బీఎల్వోలు అన్ని దరఖాస్తులను స్వీకరించారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఆయా రాజకీయ పార్టీల నాయకులు కూడా ఓట్ల నమోదుతో పాటు చేర్పులు, మార్పుల కోసం దరఖాస్తులను అందజేశారు.

హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలి


సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

మద్దిపాడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విశ్వహిందూ పరిషత్ ప్రతినిధి నట్టే శ్రీనివాసరావు కోరారు. ఆదివారం మద్దిపాడులోని రామాలయంలో విశ్వహిందూ పరిషత్ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ సంప్రదాయాలు, కట్టుబాట్లను యువత మర్చిపోతున్నారని, అలాంటి వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. మద్దిపాటి రమేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజంలో జరుగుతున్న రుగ్మతలపై అవగాహన పొంది హిందూ ధర్మాన్ని సంరక్షించుకోవాలని పేర్కొన్నారు. ఉండవల్లి సుధాకర్‌బాబు మాట్లాడుతూ హైందవ సమాజం ఏకతాటిపై నడవాలని కోరారు. కార్యక్రమంలో మద్దిపాటి గోపయ్య, కనమర్లపూడి శివకుమార్, బి.వెంకటేశ్వర్లు, ఈమని సుబ్బారావు, సభ్యులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్రీడల్లో ఉపాధ్యాయుడి ప్రతిభ


బహుమతిని అందుకుంటున్న ప్రభాకర్‌రావు

సింగరాయకొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా ఒంగోలులో జిల్లా స్థాయి ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 100, 400 మీటర్ల పరుగుపందెంలో పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని పెదగొల్లపాలెం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు జె.ప్రభాకరరావు ప్రథమ స్థానంలో నిలిచారు. ఆదివారం ఒంగోలులో నిర్వహించిన స్వర్ణోత్సవ సభలో గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి కొల్లూరి వెంకయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేశవరాజు, ఆనంద్‌కుమార్, పలువురు ఉపాధ్యాయులు ప్రభాకరరావుకి అభినందనలు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

నాగులుప్పలపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయని ఎన్‌సీసీ అధికారి సన్నెబోయిన వెంకటప్పయ్య పేర్కొన్నారు. ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా ఆదివారం బి.నిడమానూరు జడ్పీ హైస్కూలులో కేక్ కట్ చేశారు. ఎన్‌సీసీ క్యాడెట్లతో కలిసి వెంకటప్పయ్య మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లాల్‌సాహెబ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపటి మహాధర్నాను విజయవంతం చేయాలి

● పలు కార్మిక సంఘాల పిలుపు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ, ఇతర రంగాల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న స్థానిక కలెక్టరేట్ జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ రైతు కూలీ సంఘం, ఏఐఎఫ్‌టీయూ (న్యూ) ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలులో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్.లలితకుమారి, పరిటాల కోటేశ్వరరావు, జి.వెంకట్రావు, కె.కోటేశ్వరరావు, ఇండ్ల విజయసారథి, వార్తకోట సుబ్బారావు, పరిటాల సుబ్బారావు, పోకూరి శాంతకుమారి, దాసరి రేణుక పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

రాష్ట్రంలో బిల్డింగ్ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఎస్‌డీ.హుస్సేన్ డిమాండ్ చేశారు. స్థానిక మస్తాన్‌దర్గా సెంటరు వద్ద ఆయన మాట్లాడుతూ 26న జరిగే మహాధర్నాకు తరలిరావాలని కోరారు. తంబి శ్రీనివాసులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు మండలంలో..

నాగులుప్పలపాడు: ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా అఖిలపక్ష సంయుక్త కిసాన్‌మోర్చా, రైతు సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 26న ఒంగోలులో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని ఆయా సంఘాల నాయకులు కోరారు. ఆదివారం అమ్మనబ్రోలు, చీర్వానుప్పలపాడు తదితర గ్రామాల్లో కిసాన్‌మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు ప్రచారం నిర్వహించారు. మహాధర్నాలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జె.జయంతిబాబు, ఎస్‌కే.మాబు, చుండూరి శ్రీరామమూర్తి, తూబాటి శ్రీకాంత్, రావెళ్ల వెంకట్రావు పాల్గొన్నారు.

చూడాలంతా.. శ్రీవారి ము'చెట్లు'!

మల్లవరం ప్రసన్న వేంకటేశ్వర ఆలయం చుట్టూ ఆకర్షణీయంగా శ్రీవారి వనం

- వంద రకాల అరుదైన మొక్కలు సేకరించిన నిర్వాహకులు
- ఐదేళ్లుగా సంరక్షణ
- ఆకర్షణీయంగా మారిన చెట్లు
- వనమంతా ఆధ్యాత్మిక పరిమళాలు

స్వాతి నక్షత్రం వారికి తెల్లమద్ది చెట్టుతో మేలు



ఈ చెట్టునే అర్జున వృక్షం అని కూడా అంటారు. ఇటీవల ఈ చెట్టును గ్రామాల్లో కూడా పెంచుతున్నారు. దీని బెరడు నుంచి తీసిన కషాయం హృద్రోగ బాధల నుంచి ఉపశమనం కల్పిస్తుందని ఆయుర్వేద వైద్యం చెబుతోంది. ఈ చెట్టు విశిష్టతను గుర్తించి ఆచార వ్యవహారాల్లో భాగం చేశారు. స్వాతి నక్షత్రంవారు చెట్టు ప్రదక్షిణ చేస్తే విద్యాభివృద్ధి కలుగుతుందని భక్తుల విశ్వాసం.

ఆయుర్వేద వైద్యానికి జువ్వి చెట్టు



జువ్విచెట్టు పాలు, ఆకులు, చిగుళ్లు పలు వ్యాధుల నుంచి ఉపశమనం కలిగిస్తాయని ఆయుర్వేద వైద్యం చెబుతోంది. ఈ బెరడుతో పళ్లపొడి తయారు చేసుకోవచ్చు. చిగుళ్ల వ్యాధులను తగ్గిస్తుంది. జువ్వి చిగురులు తింటే రక్తం శుభ్రపడుతుంది. జువ్వి పండ్లను ఆయుర్వేదంలో కూడా వినియోగిస్తారు. ఉత్తర నక్షత్రంవారికి ఈ చెట్టు మేలు చేస్తుందని భక్తుల విశ్వాసం. ఇక్కడి నక్షత్రవనంలో ఈ చెట్టు ఆకర్షణీయంగా ఉంది.



మోదుగు చెట్టు



చుట్టూ చెట్లతో కూడిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం

ప్రభుత్వం సహకరిస్తే మరిన్ని చెట్లు పెంచుతాం



అపరాల వ్యాపారిగా నేను ఎంత బిజీగా ఉన్నా, మొక్కల పెంపకంపై సమయాన్ని, ధనాన్ని వెచ్చిస్తూనే ఉన్నాను. శ్రీవారి వనంతోపాటు మా స్వగ్రామం నాగులుప్పలపాడు మండలం ఈదుమూడిలో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి పెట్టాను. ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాను. ప్రభుత్వం సహకరిస్తే మల్లవరం క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తాం. గుండ్లకమ్మ ప్రాజెక్టు చెంత, పర్యాటక శాఖ వనాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టిసారించాలి.

- కాపూరి వాసు, శ్రీవారి వనం కమిటీ సభ్యుడు

మరిన్ని సేవలందిస్తాం



దాతల సహకారంతో ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. మరిన్ని సేవలందించడానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. వన సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ కొనసాగుతూనే ఉంటుంది. కొన్ని మొక్కలు తెచ్చి ఏడాది, రెండేళ్లు పెంచిన తర్వాత కూడా చనిపోతుంటాయి. అప్పుడు బాధగా ఉంటుంది. అయినప్పటికీ మొక్కలు తీసుకురావడం, వాటిని సంరక్షించడం మా లక్ష్యంలో భాగంగా కొనసాగుతోంది.

- మార్నేని కృష్ణారావు, శ్రీవారి వనం కమిటీ సభ్యుడు

అద్భుతం.. వేంకటేశ్వరుని దర్శనం



మల్లవరంలోని ప్రసన్న వేంకటేశ్వరుని దర్శనం కూడా అద్భుతమనే చెప్పాలి. ఆలయం ముందు గరుడాయవారు, హనుమంతుని విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. క్షేత్రంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి మూలవిరాట్ దర్శనం, పక్కనే పదిమంది ఆల్వార్ల విగ్రహాలు, ఎదురుగా హనుమంతుని ఆలయం ప్రత్యేకంగా ఉన్నాయి. ఆలయం వెంబడే కల్యాణ మండపం, పద్మావతి అమ్మవారి ఆలయం, ఇతర ఉపాలయాలు, వినాయకుడి గుడి ఉన్నాయి. దీంతో ఈ క్షేత్రానికి పుణ్యక్షేత్రంగా గుర్తింపు వచ్చింది.

'రింగురింగు బిల్ల రూపాయి దండ... దండ కాదురా తామర మొగ్గ... మొగ్గ కాదుర 'మోదుగు నీడ'' అంటూ మోదుగు చెట్టు ప్రత్యేకతపై చిన్నతనంలో చదువుకున్నాం. రైతులైతే పొలాల్లో మోదుగు చెట్టు ఉంటే ఆ ఆకుల్లో అన్నం తింటుంటారు. అలాంటి వైవిధ్యమైన చెట్లు పదుల సంఖ్యలో ఒకేచోట చూసే అవకాశం వస్తే... పైగా వాటి గురించి వివరణాత్మక సమాచారంతో చూపే సౌలభ్యం ఉంటే అది అద్భుతమే కదూ! మద్దిపాడు మండలం మల్లవరం క్షేత్రంలోని శ్రీవారి వనాన్ని సందర్శిస్తే ఆ చెట్ల ప్రత్యేకతను చూడొచ్చు.

మద్దిపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రానికి సమీపంలో అటు పర్యాటకానికి ఇటు అధ్యాత్మికతకు కేంద్రంగా భాసిల్లుతున్న మల్లవరం ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఎంతో గుర్తింపు ఉంది. ఓ వైపు గుండ్లకమ్మ జలశయం కనువిందు చేస్తుంటే మరోవైపు ప్రసన్న వేంకటేశ్వరుడు.. భక్తుల కొంగుబంగారంగా వెలుగొందుతున్నాడు. 13వ శతాబ్దం నాటి పురాతన క్షేత్రంగా ఈ ప్రాంతానికి గుర్తింపు ఉంది. నాటి నుంచి ఈ క్షేత్రం ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతోంది. ఇంతటి విశిష్టత ఉన్న ఈ క్షేత్రంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన శ్రీవారి వనం కూడా ఒకింత ప్రత్యేకమైనదనే చెప్పాలి. దీనిలో భాగంగా నక్షత్ర వనం, రాశి వనం ఏర్పాటు చేశారు.

రాశికొక మొక్క..

హిందూ ఆచార వ్యవహారాల్లో మొక్కలను, చెట్లను పూజించడం పరిపాటి. దీనిలో భాగంగా ఒక్కో రాశివారు ఒక్కో చెట్టును పూజించడం, ఒక్కో నక్షత్రం వారు ఒక్కో చెట్టు చుట్టూ ప్రదక్షిణ చేస్తే మంచి జరుగుతుందని భక్తులు విశ్వసిస్తారు. ఆయుర్వేదపరంగా విశిష్ట గుర్తింపు ఉన్న ఆయా చెట్ల చుట్టూ ప్రదక్షిణలు చేయడం ద్వారా శారీరక, మానసిక రుగ్మతలు తొలగిపోతాయని అక్కడికొచ్చే భక్తుల నమ్మకం. అయితే ఈ అరుదైన మొక్కలను సేకరించడం ఒక సవాల్ అయితే వాటిని నాటి సంరక్షించడం కత్తిమీదసామే. అయినప్పటికీ మల్లవరంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం చెంత శ్రీవారి వనం నిర్వాహకులు వ్యయప్రయాసల కోర్చి ప్రత్యేకంగా ఒక్కో రాశివారికి ఒక్కో మొక్క చొప్పున, వివిధ జన్మనక్షత్రాలు ఉన్న వారికి ఉపయుక్తంగా ఉండేలా వివిధ రకాల మొక్కలు శ్రీవారి వనంలో నాలుగేళ్ల క్రితం నాటారు. అవి ఇప్పుడు చెట్లుగా ఎదిగాయి. వాటి నుంచి వచ్చే పరిమళాలు అక్కడికొచ్చే భక్తులకు ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. ఆధ్యాత్మిక సుగంధాలను వెదజల్లుతున్నాయి. ఒక కొత్త ప్రపంచంలోకి వచ్చిన అనుభూతిని కలిగిస్తున్నాయి.

అరుదైన చెట్లకు నెలవు

ప్రసన్న వెంకటేశ్వరుడి కొండ చుట్టూ ఉన్న శ్రీవారం వనంలో వంద రకాల అరుదైన చెట్లున్నాయి. వీటి కోసం కడియంతో పాటు దేశంలోని వివిధ నర్సరీలను సందర్శించి అక్కడి నుంచి మొక్కలు తీసుకొచ్చి నాటి పెంచారు. డ్రిప్ ద్వారా నీటిని అందించి వీటిని సంరక్షిస్తున్నారు. ప్రస్తుతం అవి ఓ మోస్తారు చెట్లుగా ఎదిగాయి. చిన్నపిల్లలకే కాదు పెద్దలకు కూడా ఈ చెట్టు పలానా చెట్టా..? అని తెలుసుకొనేలా చెట్టు పక్కనే బోర్డులు ఏర్పాటు చేశారు. విద్యార్థులకైతే ఈ క్షేత్ర పర్యటన పరిశీలనాత్మక గ్రంథం లాంటింది. ఈ వనంలో మోదుగు, తెల్లమద్ది, పారిజాతం, అత్తి, బాదం, జువ్వి, సంపంగి, మేడి, సిందూరం, ఎర్రచందనం, వేగేశ, గుమ్మడి టేకు, పొగడ, వంటి దాదాపు వంద రకాల చెట్లు ఉన్నాయి. నీడనిచ్చే చెట్టు నిద్రగన్నేరు, ఇతర క్రోటాన్ మొక్కలు, నూరువరహాలు వంటివి అనేకం ఇక్కడ ప్రత్యేకంగా నిలుస్తున్నాయి.



శ్రీవారి వనంలో అరుదైన చెట్లు

పురుడు పోసుకుందిలా..

మండలంలోని మల్లవరం గ్రామానికి మారినేని కృష్ణారావు, ఒంగోలుకు చెందిన అపరాల వ్యాపారి కాపూరి వాసు సారథ్యంలో ఏర్పాటైన కమిటీ ఐదేళ్ల క్రితం ఈ క్షేత్రంలో వనం అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. నిధులు వెచ్చించి వివిధ మొక్కలు సేకరించి సంరక్షిస్తున్నారు. క్షేత్రంలో కల్యాణకట్ట, ఇతర నిర్మాణాలు కూడా వీరి సారథ్యంలోనే నిర్మించారు. ఈ క్షేత్రం అభివృద్ధి కోసం కమిటీ ఇంచుమించు రూ.కోటి ఖర్చు చేసింది.



కమ్మవారి కార్తీక వన మహోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్

కమ్మ సంఘం సేవలు ప్రశంసనీయం

- దామచర్ల జనార్దన్ • ఘనంగా కార్తీక వనమహోత్సవం

ఒంగోలు కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా రంగంలో కమ్మవారి సేవాసంఘం సేవలు ప్రశంసనీయమని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ అన్నారు. ఆదివారం ఒంగోలు హైవే వెంకట్రాజుపాలెం దగ్గర జిల్లా కమ్మవారి సేవాసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్తీక వన మహోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత కులానికి సేవలు అందిస్తూనే సమాజంలోని ఇతర కులాలను కూడా గౌరవించాలని ఆయన అన్నారు. సంఘం ముద్రించిన 2025 సంవత్సర కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. సంఘ అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు మొదలు నేటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వరకు ప్రపంచ వ్యాపితంగా ఎంతోమంది కమ్మ ప్రముఖులు అంచెలంచలుగా ఎదిగారన్నారు. 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ కమ్మ కుల ప్రముఖుల చరిత్రను భావితరాలు స్మరించుకోవాలని వారిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ కమ్మవారి సేవా సంఘానికి తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. సంఘ గౌరవాధ్యక్షుడు చిడిపోతు వెంకటేశ్వర్లు కోటి రూపాయల విలువైన స్థలాన్ని సంఘ భవన నిర్మాణానికి విరాళంగా అందజేశారు. నంద్యాల కమ్మ నాయకులు మధుసూదనరావు నేషనల్ హైవే పక్కనే సంఘ భవనానికి ఒక ఎకరం స్థలాన్ని ఇస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ చెంచు గరటయ్య, గుండపనేని అచ్యుత్ కుమార్, చుండూరి రవిబాబు, నిడమానూరు నాగేశ్వరరావు, గోరంట్ల రవికుమార్, ప్రతిభ విద్యాసంస్థల డైరెక్టర్ నల్లూరి జయప్రకాష్, సంఘ ప్రధాన కార్యదర్శి ఆలా హనుమంతరావు, కాట్రగడ్డ రఘుపతిరావు, అబ్బూరి నవీన్‌కుమార్, గార్లపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమంలో ఆకట్టుకున్న నృత్యం

వివాహ ఆహ్వానం.. జర జాగ్రత్త!

- ఫోన్లను హ్యాక్ చేస్తున్న సైబర్ నేరగాళ్లు • ఏపీకే ఫైల్స్‌ను ఓపెన్ చేయకండి : ఎస్పీ

ఒంగోలు (క్రైం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆండ్రాయిడ్ ఫోన్ ఎప్పుడు హ్యాక్ అవుతుందో, సైబర్ నేరగాళ్లు ఎలా ప్రవేశిస్తారో అనే భయం జనాన్ని వెంటాడుతోంది. తెలియకుండా ఫోన్లు హ్యాక్ అవుతున్నాయని ఆందోళనకు గురౌతున్నారు. పెండ్లి కార్డును వాట్స్‌ప్‌లో ఓపెన్ చేయడానికి ఆలోచించాల్సి వస్తోంది. సైబర్ నేరగాళ్లు సీజనల్‌గా చొరబడటమే ఇందుకు కారణం. అందుకే జర భద్రం అటు పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. సైబర్ నేరగాళ్లు ఇటీవల జిల్లాలో పీఎం కిసాన్ పేరుతో ఏపీకే ఫైల్స్ పంపించి అనేకమంది ఫోన్లను హ్యాక్ చేసి నగదు లాగేశారు. అంతటితో ఆగితే పర్వలేదు. పోయింది డబ్బే కదా అని అనుకోవచ్చు. ఫోన్‌లో ఉన్న వ్యక్తిగత సమాచారం తీసుకొని పరువుపోయే విధంగా సైబర్ నేరగాళ్ల చర్యలు ఉండే అవకాశం ఉంది. అందుకే ఏదైయినా అనుమానం వచ్చిన వాట్సప్ మెసేజ్‌ల పట్ల, ఏపీకే ఫైళ్ల పట్ల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, లేకుంటే ఫోన్‌లో నగదుతోపాటు వ్యక్తిగత సమాచారం లాగేసుకుంటున్నారు. వెడ్డింగ్ ఇన్విటేషన్ పేరుతో సైబర్ నేరగాళ్ల చొరబాట్లకు సిద్ధమయ్యారని పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.



పోలీసుల ప్రచార పోస్టర్

• స్కాముల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి. తెలియని నంబర్లు నుంచి వివాహ ఆహ్వానాలు వస్తే ఓపెన్ చేయొద్దు. ఓపెన్ చేసే సమయంలో కాషన్ అనే అలర్ట్ వచ్చినప్పుడు అలాంటి ఫైళ్లను ఓపెన్ చేయకూడదు. ఏపీకే ఫైళ్లు ఎట్టి పరిస్థితుల్లో తెరవకూడదు. ఒకవేళ సైబర్ నేరగాళ్లు మీ ఫోన్‌ను హ్యాక్ చేస్తే వెంటనే 1930 నంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేయాలి.

- ఏఆర్ దామోదర్, ఎస్పీ



కబడ్డీ జట్లతో ఉపాధ్యాయులు

జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

ఒంగోలు(రూరల్) నవంబరు 24, (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని మినీ స్టేడియంలో ఆదివారం జిల్లా స్త్రీ, పురుష కబడ్డీ క్రీడాకారుల ఎంపికలు జరిగాయి. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ చాటిన క్రీడాకారులను వ్యాయామ ఉపాధ్యాయులు, అంతర్జాతీయ క్రీడాకారులు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా కబడ్డీ అసోషియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు మాట్లాడుతూ పురుషులకు ఈనెల 25వ తేదీ నుంచి చినగంజాంలో పూర్తిస్థాయిలో శిక్షణ ఇస్తామని చెప్పారు. మహిళా క్రీడాకారులకు పాకల హైస్కూల్లో శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో అసోషియోషన్ కార్యదర్శి వై.పూర్ణచంద్రరావు, సీనియర్ గౌరవాధ్యక్షుడు శిరిగిరి రంగారావు, ట్రెజరర్ దాసరి రమేష్‌బాబు, ఉపాధ్యక్షుడు అరికట్ల సుమతి, ఈదర వెంకట సురేష్‌బాబు, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారులు అన్ను వేణుగోపాల్, ఎస్.అర్జునరావు, ఎం.గిరిబాబు, కోఆర్డినేటర్ వై.శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే..

- **పురుషుల విభాగంలో** : పి.బాలకృష్ణ, కె.వెంకటరెడ్డి, కె.హరిప్రసాదురెడ్డి, జి.లక్ష్మారెడ్డి, జి.ల క్ష్మణ్, ఎ.సుబ్బారెడ్డి, బి.బ్రహ్మారెడ్డి, జి.శ్రీనివాసరెడ్డి, ఎస్.మణిరెడ్డి, జి.రామకృష్ణారెడ్డి, జి.మల్లికార్జునరెడ్డి, ఎ.మంత్రునాయక్, బి.అయ్యప్ప, జి.సమరా, కె.సాయిరామ్, వి.బ్రహ్మారెడ్డి
- **మహిళా విభాగంలో** : వి.అర్చన, కె.భూమిక, కె.నందిని, కె.సౌమ్య, కె.విజయలక్ష్మి, డి.భవాని, ఎం.సుప్రజ, వి.శ్రీపూర్వ, కె.నిరీక్ష, ఎం.కీర్తిరెడ్డి, వి.రోహిణి, జె.కళ్యాణి, వై.గాయిత్రి, సీహెచ్.సింధు, హేమలత, జి.నాగలత, ఎం.నాగ హైమావతి ఎంపికయ్యారు.



కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గం

కబడ్డీ అసోసియేషన్ ఎన్నిక

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. మార్కాపురంలోని డ్వాక్రా కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.పద్మజ ఆధ్వర్యంలో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా దొడ్డా దుర్గేష్‌రెడ్డి, చైర్మన్‌గా మస్నెం శ్రీకాంత్, కార్యదర్శిగా చెరుకూరి పుల్లయ్య, సహాయ కార్యదర్శిగా గాజులపల్లి సతీష్‌బాబు, ఉపాధ్యక్షులుగా సిద్ధం శివరాంప్రసాద్, ఎం.కోటేశ్వరరావు, పి.వెంకయ్య నాయుడు ఎన్నికయ్యారు.

రంజీ ట్రోఫీకి దోర్నాల యువకుడు

పెద్ద దోర్నాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : 2024-25 రంజీ ట్రోఫీకి దోర్నాల మండలం చిన్న దోర్నాల గ్రామానికి చెందిన యువకుడు గొల్మారు మనీష్‌రెడ్డి ఎంపికయ్యాడు. ఐపీఎల్ పోటీకి అర్హత సాధించాడు. మనీష్‌రెడ్డి కుటుంబం చాలా ఏళ్లగా విశాఖలో నివాసం ఉంటోంది. తండ్రి ఉమామహేశ్వరరెడ్డి మెకానిల్ ఇంజినీరింగ్ చదివినా కాంట్రాక్టు పనులు చేస్తుండేవారు. తల్లి హరితారెడ్డి ఏపీ టూరిజం జోనల్ అధికారిగా పనిచేసినట్లు బంధువులు తెలిపారు.



మనీష్ రెడ్డి (ఫైల్)

సగర సంఘం అభివృద్ధికి సహకరిస్తా

• ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి



సగరసంఘం వనభోజన కార్యక్రమంలో మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరుటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సగర సంఘం అభివృద్ధికి తన సహకారం ఎప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఆదివారం నగర పంచాయతీ పరిధిలోని చట్రెడ్డిపల్లె సమీపంలో శ్రీభగీరథస్వామి ఆలయ ఆవరణలో సగర సంఘం వనభోజన మహోత్సవాన్ని ఏర్పాటు చేసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి పెద్ద పీట వేసిందని, అన్ని రంగాలలో వారిని ముందుకు తీసుకు పోవాలన్నదే ముఖ్యమంత్రి చంద్రాబాబు లక్ష్యమని తెలిపారు. సగర సంఘంకు అన్ని విధాలుగా తాను సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముత్తుములకు శుభాకాంక్షల వెల్లువ

గిద్దలూరు టౌన్ : పీఏసీ సభ్యులుగా నియమితులైన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి కూటమి నేతలతో, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని బీజేపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ పార్టీ అధ్యక్షులు అపిశెట్టి ఉదయ్‌శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు భవనాశి వెంకట రామాంజనేయులు, రాష్ట్ర కిసాన్‌మోర్చ్ కార్యవర్గ సభ్యులు పిడతల రమేష్‌రెడ్డి, జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి డి.బాదుల్లా, జిల్లా మైనారిటీ అధ్యక్షులు షేక్ ఖాదర్‌వలి, షఫి, జిల్లా ఓబీసీ కార్యవర్గ సభ్యులు వీరచక్రం, పట్టణ ఉపాధ్యక్షులు కొప్పరపు నాగేశ్వరరావు, పట్టణ ఓబీసీ మోర్చా అధ్యక్షులు కొప్పుల నరసింహులు, యువ నాయకులు కె.కృష్ణ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

యోగి వేమన రెడ్ల సంఘం వనభోజనాల్లో పాల్గొన్న ముత్తుముల

కంభం: కార్తీకమాసం సందర్భంగా యోగివేమన రెడ్లసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వనభోజన కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అర్ధవీడు మండలం నాగులవరం కొండపై నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి యోగివేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ వనభోజనం నిర్వహించడం ఐక్యతను, ఆధ్యాత్మికతను పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో సంఘం కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

బేస్తవారపేట : నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు తాగునీటి సౌకర్యం కోసం ఇంటింటి కొళాయి ఏర్పాటుకు తనవంతుగా కృషి చేస్తానని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. తాను ఈ విషయంపై అసెంబ్లీలో కూడా చర్చించినట్లు తెలిపారు. సంబంధిత పంచాయత్‌రాజ్‌శాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. ఆదివారం బేస్తవారపేటలో ఏర్పాటు చేసిన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన కార్తీక వనభోజనాలకు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పూనూరు భూపాల్‌రెడ్డి, ఇండ్లా రామిరెడ్డి, ఇండ్లా శేఖర్‌రెడ్డి, బాలిరెడ్డి, నర్రా బసిరెడ్డి, పూనూరు జగన్మోహన్‌రెడ్డి, అన్నెం ఇంద్రాసేనారెడ్డి, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు సోరెడ్డి మోహన్‌రెడ్డి, గురువారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కుసుమ హరనాథుల కల్యాణం

గిద్దలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస పూజోత్సవాలలో భాగంగా ఆదివారం కుసుమ హరనాథుల లీలాకల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళ భక్తులు పెద్దఎత్తున హాజరై కళ్యాణ మహోత్సవాన్ని తిలకించి పూజలు చేశారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి కుసుమ హరనాథుల కళ్యాణంలో పాల్గొని పూజలు చేశారు. కళ్యాణం అనంతరం ఆర్యవైశ్య కుటుంబాలకు కార్తీక వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షులు నటుకుల శ్రీనివాసులు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నవంబరు 26ను రాజ్యాంగ ఆమోద దినోత్సవంగా ప్రకటించాలి

కంభం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నవంబరు 26ను డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగ ఆమోద దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా కార్యదర్శి ఎన్.జయరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం కంభం ఎంఆర్‌పీఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. భారతదేశం 1949 నవంబరు 26న అంబేద్కర్ రాజ్యాంగాన్ని ఆమోదించిందన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజును గణతంత్రదినోత్సవంగా దేశమంతా ఉత్సవాలు నిర్వహిస్తోందన్నారు. 2016 నరేంద్రమోదీ ప్రభుత్వం అంబేద్కర్ రాజ్యాంగ ఆమోద దినోత్సవంగా గుర్తించి దేశవ్యాప్తంగా నిర్వహించాలని సూచించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం 26న రాజ్యాంగ దినోత్సవాన్ని జరపాలని కోరారు.


దీక్షధారులకు అన్నప్రసాద వితరణ



అంజుమన్ కమిటీ ప్రతినిధులను సన్మానిస్తున్న దేవస్థాన కమిటీ

గిద్దలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వివిధ మాలలు ధరించి దీక్షలు తీసుకున్న వారికి అంజు మన్ కమిటీ అన్న ప్రసాదాన్ని అందించింది. స్థానిక అభయాంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం భవాని, అయ్యప్ప, శివ, తదితర స్వాముల మాలదారులకు సున్ని అంజుమన్ కమిటీ అన్న ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులను దేవస్థాన కమిటీ ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో సున్ని అంజుమన్ కమిటీ చైర్మన్ దూదేకుల హజరత్, వీరబ్రహ్మేంద్రస్వామి శిష్యుడు సిద్దయ్య స్వామి వారి 9వ తరం మనుమడు కలగట్ల సిద్దయోగి స్వామి, ప్రభుత్వ ఖాజీ షేక్ నాయబ్‌రసూల్, కమిటీ ప్రతినిధులు నాయబ్‌ఖాజా, ఖాశింవలి పాల్గొన్నారు.

వృద్ధురాలికి దీనావస్థ



దీనావస్థలో ఉన్న వృద్ధురాలు

ఎర్రగొండపాలెం రూరల్ నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : 'ఆ వృద్ధ మహిళ ఎవరో తెలియదు. రెండు రోజుల క్రితం ఆమెను ఎర్రగొండపాలెంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల సమీపంలోని ఆంజనేయ స్వామి దేవాలయం పక్కన గుర్తు తెలియని వ్యక్తులు (కుటుంబ సభ్యులు) విడిచిపెట్టారు. ఆ వృద్ధురాలు నడవలేని, మాట్లాడలేని పరిస్థితిల్లో ఉంది. సొంతగా చేతితో ఏదైనా వస్తువు అందించినా తీసుకొని తినలేని పరిస్థితి. అంతటి దీనావస్థలో ఉన్న ఆ మాతృమూర్తిని మానవత్వం మరచి నిర్ధయగా వదిలేసి వెళ్ళారు. వృద్ధురాలిని గమనించిన ఆలయ అర్చకులు, భక్తులు ఆమెకు ప్రసాదం, ఆహారం అందిస్తున్నారు. అయినప్పటికీ, సరిగా తినలేని పరిస్థితి ఆమెది. నడిచే పరిస్థితి లేదు. అసలే చలికాలం కావడంతో చలికి వణుకుతూ ఉంది. స్థానికులు ఆమె వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నం చేసినా ఉపయోగం లేకుండా ఉంది. ఆమె దుస్థితిపై నాగేశ్వరరావు అనే ఉపాధ్యాయుడు సోషల్ మీడియా వేదికగా ఫోటోతో షేర్ చేశారు. దీంతో ఓ స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు అనాథశరణాలయాన్ని చేర్చే ఏర్పాట్లు చేస్తున్నారు.

కొనసాగిన ఆక్రమణల తొలగింపు

• వన్ వేను పరిశీలించి సూచనలు చేసిన డీఎస్పీ నాగరాజు
• గాంధీ పార్కు వద్ద వైసీపీ నేతల ఆందోళన
• చైర్మన్ చిర్లంచర్ల చొరవతో సద్దుమణిగిన వివాదం

మార్కాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆక్రమణల తొలగింపు ప్రక్రియ ఆదివారం కొనసాగింది. ప్రధానంగా రాజాజీవీధి, రథంబజర్, తూర్పు వీధి ప్రాంతాల్లో మురుగు కాలువలపై ఆక్రమణలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. కొన్నిచోట్ల భవనాల యజమానులే స్వచ్ఛందంగా తొలగించుకున్నారు.



వన్‌వేను పరిశీలిస్తున్న డీఎస్పీ నాగరాజు

స్థానిక అయ్యప్పస్వామి దేవస్థానం వెనుకవైపు ఇప్పటికే ఉన్న ఆక్రమణలు తొలగించగా శనివారం రాత్రి ఎవరికీ తెలియకుండా ఓ మహిళ షెడ్ నిర్మించింది. విషయం తెలుసుకున్న మున్సిపల్, పోలీసులు అధికారులు పరిశీ లించి తాత్కాలిక నిర్మాణాన్ని వెంటనే తొలగించారు. అదేవిధంగా అయ్యప్పస్వామి గుడి నుంచి చెన్నకేశవ స్వామి దేవస్థానానికి వెళ్లే బజార్‌లో కూడా యజమానులు త్వరితగతిన ఆక్రమణలు తొలగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, సీఐ సుబ్బారావులు సూచించారు.

గాంధీపార్కు వద్ద ఉద్రిక్తత

స్థానిక గడియార స్తంభం వద్ద గాంధీ పార్కులోని తూర్పువైపు గోడపై వున్న ఇనుప గ్రిల్స్ తొలగించారు. దీంతో పార్కును నిర్వహిస్తున్న వైస్ సంస్థ ప్రతినిధులతో కలిసి 4వ వార్డు కౌన్సిలర్ చెప్పల్లి కనకదుర్గ అక్కడకు చేరుకున్నారు. తాము కొన్ని దశాబ్దాలుగా పార్కును నిర్వహిస్తున్నందున అందులోకి తోపుడుబండ్ల వారిని రానివ్వమని పనులు నిలిపివేశారు. ఈ విషయం తెలుసుకున్న కమిషనర్ నారాయణరావు, సీఐ సుబ్బారావులు సిబ్బందితో కలిసి అక్కడకు వెళ్లారు. కొద్దిసేపు అధికారులు, కౌన్సిలర్ కనకదుర్గకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో అక్కడకు చేరుకున్న మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ ఇరువురితో మాట్లాడారు. పార్కు ప్రాధాన్యతను వివరించి కొన్ని నాలుగు అడుగుల మేర మాత్రమే లోపలికి అనుమతించేందుకు ఒప్పందం చేశారు. తొలుత కౌన్సిలర్ కనకదుర్గ ససేమిరా అన్నా అందరూ సర్దిచెప్పడంతో ఒప్పందానికి అంగీకరించారు.

వన్‌వేలో ఆటంకాలు లేకుండా చూడాలి: డీఎస్పీ

మార్కాపురం పట్టణం భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న వన్‌వేలో వాహనాలు తిరిగేందుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని మున్సిపల్ అధికారులకు డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు తెలిపారు. వన్‌వే ప్రాంతాన్ని సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న కమిషనర్ నారాయణరావు, ఈవో శ్రీనివాసరెడ్డి, ఆర్‌టీసీ డీఎం నరసింహులుతో మాట్లాడారు. ప్రధానంగా ట్రాఫిక్ నియంత్రణ కోసం చేస్తున్న ఈ ప్రయత్నంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే విజయవంతం అవుతుందని అన్నారు. ముఖ్యంగా తూర్పువీధి జువ్విచెట్టు నుంచి విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్దకు వాహనాలు తిరిగేందుకు ఇంకా కొన్ని ఇబ్బందులు ఉన్నట్లు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ఆక్రమణలను త్వరితగతిన తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట సీఐ సుబ్బారావు, టూ టౌన్ ఎస్సై రాజమోహనరావు, రూరల్ ఎస్సై అంకమ్మరావు, సిబ్బంది పాల్గొన్నారు.



గాంధీపార్కు వద్ద సమస్యపై సమన్వయ పరుస్తున్న సీఐ

స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయాలి

ఉపాధ్యాయ సంఘ నాయకుల వినతి

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని ఆదివారం కలిసి ఉపాధ్యాయ సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు పట్టణ పరిధిలోని పూల సుబ్బయ్య కాలనీ, ఎస్‌బీసీ కాలనీ, ఏకలవ్య కాలనీలలోని యూపీ పాఠశాలలు ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడయ్యి ఆరేళ్ల అయిందని, ఇంత వరకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు కాలేదని తెలిపారు. ఈ పాఠశాలల్లో వరుసగా 416, 190, 230 మంది విద్యార్థులు చదువుతున్నారని, జవహర్ నగర్‌లోని ప్రాథమిక పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయి 20 సంవత్సరాలు అయిందని తెలిపారు. ఇందులో కూడా 236 మంది విద్యార్థులు చదువుతున్నారని వివ రించారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులందరికీ స్కూల్ అసిస్టెంట్‌లు మాత్రమే బోధించా లని ఎస్‌జీటీలు బోధించటం నిబం ధనలకు విరుద్ధం అన్నారు. మండ లంలోని పెద్దయాచవరం, గొబ్బూరులలో అప్‌గ్రేడ్ అయిన మొదటి సంవత్సరమే ఆయా పాఠశాలలకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేశారని తెలిపారు. మార్కాపురం లోని పాఠశాలలకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయాలని, లేదంటే హైస్కూల్, యూపీ స్కూల్‌లో ఉన్న ఎస్‌జీటీ పోస్టులను స్కూల్ అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ గౌరవ మంత్రి నారా లోకేశ్‌కు తయారు చేసిన వినతి పత్రాలను ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఓ.వీరారెడ్డి, జిల్లా మున్సిపల్ ఉపాధ్యాయుల కన్వీనర్ ఎస్‌ఎస్‌ఎల్ రవికుమార్, జిల్లా కౌన్సిలర్ పి.విజయలక్ష్మీ, మార్కాపురం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి కె.శేషయోగయ్య, కార్యకర్తలు పి.అంకమ్మ, ఎస్.ఏలియా, టీపీఎస్ మల్లీశ్వరి, కె.లక్ష్మీదేవి, వై.లక్ష్మీ, వి.అల్లూరయ్య, పి.సురేష్, డి.నాగ ఫణీంద్ర పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ



మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ అని మార్కాపురం సీఐ టి.సుబ్బారావు అన్నారు. స్థానిక కమలా హైస్కూల్‌లో ఎన్‌సీసీ దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ముందుగా సీఐ సుబ్బారావు జెండా వందనం నిర్వహించారు. ఎన్‌సీసీ విద్యార్థుల నుంచి కవాతుతో గౌరవవందనం స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులందరూ ఎన్‌సీసీలో పాల్గొని తమవంతు దేశసేవ చేయాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ పెనుగొండ పవన్‌కుమార్ మాట్లాడుతూ.. ఎన్‌సీసీలో చేరితే ఉద్యోగ అవకాశాలు కూడా ఉంటాయన్నారు. చిన్ననాటి నుంచే ఎన్‌సీసీ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వరూప్ రంజన్, కమలా కాన్సెప్ట్ పాఠశాల ప్రిన్సిపాల్ పుల్లయ్య, ఎన్‌సీసీ ఏఎన్‌వో శ్రీకాంత్, పీఈటీలు రజినీస్, హరిలాల్ నాయక్‌లు పాల్గొన్నారు.

పొదిలిలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్ ప్రారంభం

పొదిలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అత్యాధునిక గుండె మల్టీ సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను అందిస్తున్న ఆస్టర్ రమేష్ హాస్పిటల్ సూపర్ స్పెషాలిటీ క్లినిక్‌ను ఆదివారం పొదిలి పట్టణంలో ప్రారంభించారు. ఈ క్లినిక్‌లో ఆధునిక వైద్యపరికరాలతో వైద్యసేవలు అందిస్తున్నట్లు చీఫ్ ఆపరేటింగ్ ఆపరేటర్ డాక్టర్ నల్లూరి నితిన్ అన్నారు. జిల్లాలో మారుమూల ప్రాంతాలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోనికి తెస్తున్నట్లు తెలిపారు. గ్రూప్ మార్కెటింగ్ హెడ్ డాక్టర్ కార్తీక్ చౌదరి మాట్లాడుతూ పొదిలిలో ఏర్పాటు చేసిన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సందీప్, డాక్టర్ భారతి, డాక్టర్ యు.శ్రీనివాసులు, డాక్టర్ ప్రతిమ, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ ఎంబి.జహంగీర్ సుల్తాన్, డాక్టర్ శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక వనభోజనాలు



వనభోజన కార్యక్రమంలో పూజలు చేస్తున్న దంపతులు

కంభం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కంభం, అర్ధవీడు మండలాల్లో ఆదివారం కార్తీక వనభోజనాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కాశి విశ్వనాథ కోటేశ్వరస్వామి దేవస్థానం వద్ద ఆదివారం ఉదయం రుద్ర హోమం, నవగ్రహ హోమం, సుదర్శన హోమం, లక్ష్మీగణపతి హోమాలలో భక్తులు పాల్గొన్నారు. కంభం చెరువుకట్టపై కంభం, గిద్దలూరుకు చెందిన కాకతీయ సేవాసమితి (కమ్మ) ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాల్లో పాల్గొన్నారు. అధ్యక్షులు రావూరి వెంకట సుబ్బయ్య అధ్యక్షతన జరి గిన సమావేశంలో పలువురు వక్తలు ప్రసంగిం చారు. ప్రకాశం జిల్లా కాక తీయ సేవాసమితి కార్యదర్శి ముప్పవరపు వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన రెసిడెన్షియల్ పాఠశాలలో సమితి సభ్యుల పిల్లలకు ఉచితవిద్య అందజేస్తామన్నారు. మార్కాపురం కార్యదర్శి కూచిపూడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందచేస్తున్నట్లు తెలిపారు. రావూరి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఐక్యంగా ముందుకు పోవాలన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

మార్కాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్కీ షాపింగ్‌మాల్ వద్ద షార్ట్ సర్క్యూట్‌తో ఓ కారు తగలబడ్డ సంఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు పల్నాడు జిల్లా వినుకొండ నుంచి వెంకటనారాయణ అనే వ్యక్తి కుటుంబంతో కలిసి కారులో మార్కాపురం వస్తున్నారు. ఈ క్రమంలో లక్కీ షాపింగ్‌మాల్ సమీపంలోకి వచ్చేసరికి తొలుత కారు ఇంజన్ లోంచి పొగలు వచ్చాయి. దీంతో వెంకట నారాయణ వెంటనే అప్రమత్తమై కుటుంబంతో సహా కారులోంచి దిగిపోయారు. అటుగా వెళ్తున్న బ్లూకోల్ట్స్ సిబ్బంది గమనించి ఫైర్ ఆఫీస్‌కు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న ఫైర్ సిబ్బంది అప్పటికే ఇంజన్‌లో పొగతోపాటు వస్తున్న మంటలను అదుపు చేశారు. సమీపంలోని ప్రజలు కూడా మంటలను అదుపు చేసేందుకు తోడ్పడ్డారు. అక్కడేవున్న పలువురు మెకానిక్‌లు పరిస్థితిని గమనించి కారులో షార్ట్‌సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగాయని తెలిపారు. కారు ఇంజన్ పేలి ఏమైనా ప్రమాదం సంభవిస్తుందేమోనని ఆ ప్రాంతంలోని ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు.

దివ్యాంగులకు స్వెటర్ల పంపిణీ

గిద్దలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపల్లి రోడ్డులోని ప్రత్యేక పాఠశాలకు చెందిన దివ్యాంగ విద్యార్థులకు కొమరోలులోని వీరబ్రహ్మేంద్ర స్వామి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కె.పి.గురువయ్య స్వెటర్లు అందజేశారు. దివ్యాంగులకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ హబీబ్‌ఖాన్, యోగా గురువు నారాయణరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మార్కాండేశ్వరస్వామి ఆలయంలో నారాయణరెడ్డి విశేష పూజలు



విశేషపూజలు చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలోని జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదివారం పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని జగద్గురు ఆదిశంకరాచార్య దశాబ్ది మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని దాతలు సమకూర్చిన మకరతోరణానికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున, వెంకటరెడ్డి, ఆలంపల్లి శ్రీనివాసులు, బ్రాహ్మణ సంఘ నాయకులు గోపాలుని హరిహరరావు, సోమయాజుల రామకృష్ణ, హరి, భారతుల శ్రీనివాసశాస్త్రీ, పురాణం సుబ్రహ్మణ్యం, సోమయాజుల సుబ్బశాస్త్రీ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

మార్కాపురం : ఇందిరమ్మ-1, 2 కాలనీలలో త్వరలో నీరు, విద్యుత్, రోడ్లు, మురుగు కాలువలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని లబ్ధిదారులు గృహాలు నిర్మించుకోవాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక ఇందిరమ్మ-1, 2 కాలనీలను హౌసింగ్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదివారం పరిశీలించారు. తొలుత చెన్నరాయునిపల్లి సమీపంలోని ఇందిరమ్మ-2 కాలనీ వద్ద మధ్యలోనే నిలిచిపోయిన వందలాది గృహాలను పరిశీలించారు. అక్కడ నిర్మాణంలో ఉన్న గృహాలను చూసి యజమానులతో మాట్లాడారు. అనంతరం ఇందిరమ్మ-1 కాలనీ వద్దకు చేరుకుని అక్కడ నివాసముం టున్న వారితో మాట్లాడారు. రెండుచోట్ల మౌలిక వసతుల లేకపోవడంతో పడుతున్న ఇబ్బందుల గురించి ఎమ్మెల్యే నారాయణరెడ్డికి కాలనీవాసులు గోడు వెళ్లబోసుకున్నారు. ప్రధానంగా నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. సాగర్ నీరు ఇస్తామన్న గత ప్రభుత్వ పాలకులు కనీసం బోరు నీరు కూడా ఇవ్వలేని దైన్యస్థితిని వారు వివరించారు. సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే కందుల అక్కడేవున్న హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్‌తో మాట్లాడారు. రెండు కాలనీల్లో మౌలిక వసతుల కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచిం చారు. తాను ముఖ్యమంత్రి చంద్రబాబు, మున్సిపల్ శాఖామంత్రి నారాయణల దృష్టికి సమస్యను తీసుకెళ్లి నిధులు రాబట్టేందుకు ప్రయత్నిస్తానన్నారు. అంతేకాక గతంలో మధ్యలో నిలిచిపోయిన గృహాల లబ్ధిదారులకు ప్రస్తుత హౌసింగ్ స్కీమ్ మేరకు రూ.2 లక్షల మేర బిల్లులు వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. పట్టణంలోని 2 వేలమందికిపైగా రెండు కాలనీల్లో గృహాలు మంజూరైనా నివాసముంటోంది కేవలం రెండు వందలలోపు కుటుంబాలు మాత్రమే అని తెలిపారు. ప్రస్తుతానికి యుద్ధప్రాతిపదికన వీధిదీపాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ నారాయణరావును ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ పవన్‌కుమార్, బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు, టీడీపీ నాయకులు తాళ్లపల్లి సత్యనారాయణ, కందుల రామిరెడ్డి, షేక్ మౌలాలి, కనిగిరి బాలవెంకటరమణ, మాలపాటి వెంకటరెడ్డి, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

తర్లుపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్ తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరుకావాలన్నారు.

240 మందికి వైద్య పరీక్షలు

కంభం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కంభం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గుంటూరు వికాస్ ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ శిబిరంలో 240 మందికి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. గుండె వైద్యనిపుణులు కనుమూరి సుధాకర్, వాస్కులర్ వైద్యులు నాగులపాటి సురేంద్ర, ఆర్థోపెడిక్ సర్జన్ కొమ్మినేని పవన్, నెఫ్రాలజి వైద్యురాలు జొన్నలగడ్డ నిహారిక రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సీఈవో ఎస్.నరసింహమూర్తి, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

గిద్దలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, మైనారిటీ విద్యార్థులు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని స్థానిక సహాయ సాంఘీకశాఖ అధికారిణి ఎన్.అమ్మాజీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెన్యువల్, కొత్త ఉపకార వేతనాల దరఖాస్తులను ఈ నెల 30వ తేదీ లోపు రిజిష్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అనంతరం గ్రామ, పట్టణ సచివాలయాలలో సంక్షేమ విద్య సహాయకుల లాగిన్‌లో వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలన్నారు. అర్హులైన విద్యార్థులందరూ వినియోగించుకోవాలన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో మార్కాపురం పట్టణ శాఖ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికయ్యింది. యూటీఎఫ్ పట్టణ శాఖ గౌరవ అధ్యక్షులుగా తాటిపర్తి సత్యనారాయణరెడ్డి, అధ్యక్షులుగా సిద్దాబత్తుని విష్ణుమూర్తి, ప్రధాన కార్యదర్శిగా మార్తాల శ్రీనివాసరెడ్డి, కోశాధికారిగా డి.నాగఫణీంద్రబాబు, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, బేబీరాణి, జిల్లా కన్వీనర్‌లుగా రవికుమార్, శేషయోగయ్య, లక్ష్మీదేవి, గౌరవ సలహాదారులుగా పాపబత్తిని అంకమ్మ, దగ్గుపాటి కొండయ్య, సీపీఎస్ కన్వీనర్‌గా అల్లూరయ్య, కుటుంబ సంక్షేమ పథకం కన్వీనర్‌గా శ్రీనివాస్‌నాయక్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు వొద్దుల వీరారెడ్డి, కృష్ణమూర్తి, శ్రీరాములు, పి.ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

కోడిపందెం స్థావరంపై దాడి

కొనకనమిట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాగుమడుగు గ్రామంలో కోడిపందెం స్థావరాలపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. 6 కోళ్లను, 16 మందిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.., గ్రామంలో జోరుగా కోడిపందేలు ఆడుతున్నారనే సమాచారంతో కోడిపందేల స్థావరంపై పోలీసులు దాడిచేశారు. ఈదాడిలో 6 కోళ్లు, ఏడు ద్విచక్రవాహనాలు, 16 వ్యక్తులను ఆదుపులోకి తీసుకొన్నారు. వారివద్ద నుండి రూ.41,850 నగదు, స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు. వీరిని సోమవారం కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం

కొనకనమిట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మునగపాడు గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి నుండి 23 మద్యం సీసాలను చేసుకున్నట్లు ఎస్‌ఐ రాజ్‌కుమార్ ఆదివారం తెలిపారు. అక్రమంగా మద్యం అమ్ముతున్నారనే సమాచారంతో ఆదివారం మునగపాడు గ్రామం నుండి సమాచారం వచ్చింది. దీంతో అక్రమంగా మద్యం బెల్టు షాపు నడుపుతున్న మద్యందుకాణంపై దాడిచేసి 23 క్వార్టర్ల మద్యం సీసాలను సీజ్ చేసి ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నలుగురు జూదరుల అరెస్ట్

తర్లుపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగెళ్ల ముడుపులో పేకాట స్థావరంపై తర్లుపాడు ఎస్‌ఐ బ్రహ్మనాయుడు మెరుపు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్దనున్న రూ.1950 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. రైటర్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అనుచిత పోస్టు పెట్టిన వ్యక్తి అరెస్టు

కంభం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై సోషల్‌మీడియాలో అనుచిత పోస్టుపెట్టిన కంభానికి చెందిన వైసీపీ కార్యకర్త శివారెడ్డి అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు కంభం ఎస్సై నరసింహారావు తెలిపారు. ముఖ్యమంత్రిపై శివారెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు చేశారని కంభం మండల టీడీపీ నాయకులు చేసిన ఫిర్యాదు చేయడంతో మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు పెడితే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సోమవరప్పాడు పరిధిలోని గుంటిగంగ సన్నిధిలోగల గుంటి గంగాభవానీకి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని భక్తులతో పాటు దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గంగమ్మతల్లికి పొంగళ్లు పెట్టి చల్లంగా కరుణించమని వేడుకున్నారు. ఆలయ బ్రాహ్మణ అర్చకులు ఎన్.కామేశ్వరశర్మ పూజారులు ప్రకాశ్‌పంతులు, విజయలక్ష్మి అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో పి.కార్తీక్, ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ

దొనకొండ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక సేవా కార్యక్రమాలు ఎన్‌సీసీతోనే సాధ్యమని స్థానిక విశ్వభారతి విద్యాలయం చైర్మన్ మల్లెల రామిరెడ్డి పేర్కొన్నారు. ఎన్‌సీసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో ఆదివారం ఎన్‌సీసీ విద్యార్థులచే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ యువతలో దేశభక్తిని ఎన్‌సీసీ పెంపొందిస్తుందన్నారు. అనంతరం ఎన్‌సీసీ విద్యార్థులు మార్చ్‌పాస్ట్ నిర్వహించారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని నినదించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజాత, ఏవో పీవీ శేఖర్, ఎన్‌సీసీ శిక్షణ ఉపాధ్యాయుడు జిలానీ, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ సభను జయప్రదం చేయాలి

దొనకొండ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈనెల 26న సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగే ర్యాలీ, బహిరంగసభను జయప్రదం చేయాలని ఆసంఘం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య పిలుపునిచ్చారు. బహిరంగ సభ విజయవంతం నిమిత్తం దొనకొండలోని అనేక ప్రాంతాల్లో కార్మికులతో ఆదివారం సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా అంజయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు కుందుర్తి నర్సింహులు, మామిళ్ళపల్లి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ ఆలయంలో రుద్రాభిషేకం

ముండ్లమూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని పోలేరమ్మ దేవాలయంలో కార్తీక మాసం సందర్భంగా మహన్యాస పూర్వక రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. ముందుగా గణపతి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులతో పాటు ప్రధాన అర్చకులు దుర్భాకుల చక్రపాణి, చంద్రశేఖర్, మురళి తదితరులు పాల్గొన్నారు. అలాగే, పసుపుగల్లులోని పోలేరమ్మ, శంకరాపురంలోని అద్దంకి నాంచారమ్మ, ఈదరలోని అష్ట పద్మాల అంకాలమ్మ, నూజెండ్లపల్లిలోని పోలేరమ్మ, బొప్పూడివారిపాలెంలోని పోలేరమ్మ అమ్మవారి దేవాలయాల్లో కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చర్చి కమిటీ ఎంపికలో వివాదం

కనిగిరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక దుర్గం చర్చి ఎంపిక విషయంలో ఆదివారం ఇరువర్గాల మధ్య వివాదం బైండోవర్ కేసులకు దారితీసింది. గత వారం చర్చి నూతన కమిటీ ఎంపిక జరిగింది. అయితే, ఆ ఎంపికలో పాదర్‌ను బెదిరించి పోటీ చేపట్టకుండా కమిటీ ఏర్పాటుచేశారు. మెజార్టీ సభ్యుల ఆమోదం లేకుండా ఎంపిక చేశారని, ఇప్పటివరకు కమిటీలో ఉన్నవారు అభ్యంతరం వ్యక్తం చేస్తూ వాదనకు దిగారు. గొడవ పెద్దది కావడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. సర్దిచెప్పినా వినకపోవడంతో ఇరువర్గాలపై పోలీసులు బైండోవర్ కేసు నమోదు చేశారు.

తారు రోడ్డు వేశారు.. మార్జిన్‌లు మరిచారు!

ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు



లింగాలపాడు వద్ద ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్



మాధవరం వద్ద ఎత్తుగా వేసిన తారురోడ్డు

తాళ్లూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తారురోడ్డు వేసి మార్జిన్‌లు వదిలేయడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. తాళ్లూరు-తూర్పుగంగవరం ఆర్‌అండ్‌బీ మార్గంలో రోడ్డు మరమ్మతుల పేరిట తారు రోడ్డు వేశారు. కొత్తపాలెం, మాధవరం, లింగాలపాడు గ్రామాల వద్ద రోడ్డును గతంలో కంటే ఎత్తు పెంచారు. ఇది సింగిల్ రోడ్డు కావటంతో ఎత్తు వేయడంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే మార్జిన్ దిగాలంటే ఇబ్బందికరంగా ఉంది.

రోడ్డు పనులు చేపట్టి ఇరవై రోజులు కావస్తున్నా పూర్తిచేయకుండా అర్ధంతరంగా వదిలి వేశారు. దీంతో ద్విచక్రవాహనదారుల పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది. కార్లు, ఆటోలు ఆమార్గంలో ఎదురుగా వస్తున్న వాహనాలకు సైడ్ ఇచ్చేందుకు రోడ్డు కిందకు దిగుతున్నాయి. దీంతో వాహనాల అడుగుభాగం రోడ్డుకు తగులుతూ దెబ్బతింటున్నాయి.

మార్జిన్‌ల్లో మట్టితోలి రోడ్డుకు సమాంతరంగా చేయాలి. అయితే, కాంట్రాక్టర్ ఎత్తులేపిన రోడ్డు పక్కన మట్టి తోలటంలో జాప్యం చేస్తున్నారు. ఈమార్గంలో ప్రయాణించాలంటే ఏప్రమాదం సంభవిస్తుందోనని వాహనదారులు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్డు పనులు పూర్తిస్థాయిలో చేపట్టలేదు. పలుచోట్ల దెబ్బతిన్న రోడ్డును బాగు చేయాల్సి ఉంది. ఇప్పటికైనా సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుమార్జిన్‌లో మట్టి తోలి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వచ్చే ఏడాదికల్లా కాపు సంక్షేమ భవనాన్ని ప్రారంభిస్తాం!

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



కాపు వనభోజన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది కాపు వనభోజన మహోత్సవ కార్యక్రమానికి ముందే కాపు సంక్షేమ భవనం నిర్మించి ప్రారంభిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మండల పరిధిలోని నందనమారెళ్ల గ్రామ బాలార్కకోటేశ్వర స్వామి సన్నిధిలో కార్తీకమాసం పురస్కరించుకుని కాపు వన భోజన మహోత్సవం ప్రముఖ వైద్యులు, నియోజకవర్గ కాపు సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఆర్.రామయ్యనాయుడు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాపులకు ఇచ్చిన వాగ్దానం మేరకు కనిగిరి పట్టణానికి సమీపంలోనే అందరికీ అనుకూలంగా ఉండే విధంగా కాపు సంక్షేమ భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. వచ్చే కార్తీకమాసం వనభోజనాల సమయానికి ప్రారంభోత్సవం చేసుకుందామని హామీ ఇచ్చారు. కాపు సంఘం అధ్యక్షుడు డాక్టర్ రామయ్యనాయుడు మాట్లాడుతూ కాపుల సమస్యల పరిష్కారం కోసం అందరూ ఐకమత్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డిని, మున్సిపల్ చైర్మన్ గఫార్‌ను ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పిడుగు బాబూరావు, డాక్టర్ టి.ఆదిలక్ష్మి, శ్రావణి వెంకటేశ్వర్లు, వాకా సత్యనారాయణ, కదిరి రమణయ్య, ముండ్లమూరి మాలకొండయ్య, ముండ్లమూరి మాధవరావు, బొట్టు శ్రీను, పసులేటి అరుణోదర్, కొట్టే ప్రసాద్, కదిరి ప్రసాద్, కొంకణాల రామ్మోహన్, ఉప్పలపాటి హరిబాబు, నరసయ్య, పాలపర్తి వెంకటేశ్వర్లు, గుత్తి రాజా, కొండిశెట్టి వెంకటరమణయ్య, మాదాసు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సంస్కృతిని పెంపొందించడంలో

కాకతీయులు కీలకపాత్ర

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



కార్తీక వనభోజనాల్లో పాల్గొన్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు

దర్శి నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తెలుగు సంస్కృతిని పెంపొందించి కాపాడటంలో కాకతీయులు ఎంతో కృషి చేశారని టీడీపీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. దర్శి పట్టణ సమీపంలోని ఎన్‌ఏపీ చెరువు వద్ద గల సాయిబాబా ఆలయ ఆవరణలో ఆదివారం కాకతీయ కమ్మసేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనభోజనాల ఉత్సవాల్లో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమపార్జన కోసం కమ్మ సామాజికవర్గానికి చెందిన ఎంతోమంది మహనీయులు వీరోచితంగా పోరాడారన్నారు. తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా ఇనుమడింపజేసిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. అందరూ సమిష్టిగా ముందుకు సాగి అభివృద్ధిపథంలో నడవాలని సూచించారు. అన్నివర్గాల ప్రజలతో సంఘీభావంతో మెలగుతూ అవసరమైన సహకారం అందిస్తూ కలిసిమెలసి జీవించాలని సూచించారు. కార్యక్రమంలో కమ్మసేవా సంఘం అధ్యక్షుడు దిరిశాల రామకృష్ణ, ప్రధానకార్యదర్శి మానికొండ రాంబాబు, కోశాధికారి చిట్టే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి



తాళ్లూరు: తూర్పుగంగవరం పోలింగ్ కేంద్రంలో ఓటర్ల నమోదును పరిశీలిస్తున్న ఆర్‌వో లోకేశ్వరరావు

తాళ్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని దర్శి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావు తెలిపారు. దర్శి నియోజకవర్గంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా జరుగుతున్న ఓటర్ల నమోదు ప్రక్రియను ఆదివారం ఆయన పరిశీలించారు. తూర్పుగంగవరం పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌వోలు అందుబాటులో వుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నారన్నారు. 2025 జనవరిలో ప్రచురితం కాబోయే ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ లిస్టును అందుబాటులో ఉంచాలన్నారు. కొత్త ఓటర్ల నమోదు, మృతుల ఓట్ల తొలగింపు, మార్పులు, చేర్పులపై తగు జాగ్రత్తలు చేపట్టాలని బీఎల్‌వోలకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె. సంజీవరావు, డిప్యూటీ తహసీల్దార్ జేవి రాజు, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల సమ్మరీ రివిజన్..

దర్శి నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఓటర్ల సమ్మరీ రివిజన్ కార్యక్రమాన్ని అధికారులు, సిబ్బంది పారదర్శకంగా నిర్వహించాలని నియోజకవర్గ ఎలక్ట్రోల్ అధికారి ఎంవీవీఎస్ లోకేశ్వరరావు సూచించారు. దర్శి నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించిన ఓటర్ల సమ్మరీ రివిజన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు ఈసందర్భంగా పలు కేంద్రాల్లో రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ఓటర్ల చేర్పులు, మార్పులు తొలగింపుల ప్రక్రియలో ఎవరైనా అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బూత్‌లెవల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం లాంటిది..

ముండ్లమూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓటు హక్కు అనేది వజ్రాయుధంతో సమానమని ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్ అన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు తప్పనిసరిగా ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలన్నారు. ఆదివారం మండలంలోని పోలవరంలో ఓటు నమోదును ఆయన పరిశీలించారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌వోలు ఓటు హక్కు నమోదుకు దరఖాస్తులు స్వీకరించినట్టు తహసీల్దార్ తెలిపారు.

కార్యక్రమంలో వీఆర్‌వో తేజ, దేవకాంత్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

సర్వేలన్నింటినీ త్వరితగతిన పూర్తిచేయాలి

ముండ్లమూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలన్నింటినీ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో ఆర్.జనార్దన్ అన్నారు. ఆదివారం ముండ్లమూరులో చేపట్టిన ఇళ్ల మ్యాపింగ్ సర్వేను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో సర్వే వేగవంతం చేయాలన్నారు. ఇకనుంచి ఏ ప్రభుత్వ పథకమైనా పొందాలంటే తప్పనిసరిగా సర్వే చేసి ఉండాలన్నారు. ఇళ్ల మ్యాపింగ్ సర్వే చేయటం వల్ల నాలుగు దిక్కుల కొలతలు కొలచి పన్ను నిర్ధారించటం జరుగుతుందన్నారు. ప్రధానంగా ఆ ఇంటిలో లబ్ధిదారులు పింఛన్ పొందాలంటే సర్వే చేసి ఉండాలన్నారు. ప్రభుత్వ పథకాల కోసం ప్రభుత్వం సర్వే చేపట్టిందని చెప్పారు.

మండలంలో జమ్మలమడయ, నూజెండ్లపల్లి, నాయుడుపాలెం గ్రామాల్లో సర్వే పూర్తిగా వెనుకబడి ఉందని ఎమ్మెల్యే జనార్దన్ పేర్కొన్నారు. సంబంధిత కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు చెప్పారు. సోమవారం సాయంత్రానికి కల్లా ప్రతి కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ 50 శాతం మేర సర్వే చేసి ఉండాలన్నారు. నిర్లక్ష్యం వహించే కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అమరేశ్వరి, జూనియర్ అసిస్టెంట్ ఆంత రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు కలిసికట్టుగా ముందుకుసాగాలి

» మాజీ మంత్రి శిద్దా రాఘవరావు



ఆర్యవైశ్యుల కార్తీక వన సమారాధనలో మాట్లాడుతున్న మాజీ మంత్రి రాఘవరావు

ముండ్లమూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులందరూ కలిసికట్టుగా ఉండాలని మాజీ మంత్రి శిద్దా రాఘవరావు అన్నారు. మండలంలోని పులిపాడు శివాలయం వద్ద ఆదివారం జరిగిన కార్తీక వన మహోత్సవంలో శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా రాఘవరావు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల్లో ఎవరికీ ఏ సమస్య వచ్చినా అందరూ కలసికట్టుగా ఉంటే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కార్తీక మాసం సందర్భంగా ఆర్యవైశ్యులందరూ ఒకచోట చేరి వారి సమస్యలను చర్చించుకోవటం, పండుగను ఒక ఉత్సవంలా జరుపుకోవటం మంచి పరిణామమన్నారు. ముందుగా శివాలయంలో పూజలు నిర్వహించి కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం రాఘవరావు దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కోట హనుమంతరావు, సూరె సుబ్బారావు, బొగ్గరం సుబ్బారావు, భూమా సుబ్బారావు, రాము, కొత్తమాసు సాయికుమార్, అచ్యుత ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా!

పామూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆర్య వైశ్యులకు ఏ కష్టం వచ్చిన తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అనుమునిగిరి క్షేత్రంలో జరిగిన ఆర్యవైశ్య కార్తీక మాస వనభోజన మహోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ఏదైన సమస్య వస్తే పార్టీలకతీతంగా ఏకం కావాలని సూచించారు. సమిష్టిగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు.

ఆర్యవైశ్య మహిళలు మారేడు నేరేడు చెట్లకు పసుపు కుంకుమాలతో పూజలు నిర్వహించారు. పలుసాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

గంధ మహోత్సవానికి ఆహ్వానం

పామూరు పట్టణంలోని సీఎస్‌పురం రోడ్డులోగల శ్రీహజరత్ మహబూబ్‌సుభాని స్వామివారి గంధ మహోత్సవ కార్యక్రమానికి పామూరు దర్గా కమిటీ సభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డిని ఆహ్వానించారు. ఆదివారం కనిగిరిలోని అమరావతి గ్రౌండ్ క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిశారు. ఈనెల 28న జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. దాతల సహకారంతో గత 45 సంవత్సరాలుగా దర్గా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

కార్యక్రమంలో షేక్ ఖాజారహంతుల్లా, ఖైరహీముల్లా, ఖాజీ ఖాదర్‌బాషా, హజీగోస్, చాంద్ బాషా, మీరామొహిద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

మిట్టపాలెంలో మహాపుష్పయాగం





నారాయణస్వామి దేవస్థానంలో మహాపుష్పయాగంలో పాల్గొన్న భక్తులు, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం నిర్వహించిన మహాపుష్పయాగం పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పాల్గొన్నారు. కార్తీక మాసం సందర్భంగా దేవస్థాన ఆధ్వర్యంలో నిర్వహించిన పుష్పయాగం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉగ్ర పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవస్థాన కమిటీ సభ్యులతో మాట్లాడారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా సచివాలయ ప్రాంగణం

తాళ్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం సచివాలయ ప్రాంగణంలో అపరిశుభ్రత నెలకొంది. పిచ్చి చెట్లు, జిల్లేడు, తుమ్మ చెట్లు, గడ్డి ఏపుగా పెరిగింది. ఈ ప్రాంగణంలో గ్రామ సచివాలయం, హెల్త్ క్లీనిక్ కేంద్రం, రైతుసేవా కేంద్రాలు ఉన్నాయి. సచివాలయ భవనాలకు సమీపాన పొలాలు ఉన్నాయి. పనుల నిమిత్తం వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. పిచ్చి చెట్లు ఉండటంతో విషపురుగుల వల్ల ప్రమాదం జరుగుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ప్రాంగణం చిల్ల చెట్లు తొలగించి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



ఉత్తమ ఉపాధ్యాయుడిగా సన్మానం పొందుతున్న సురేష్

దర్శి నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొతకమూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న యు.సురేష్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సురేష్ అందించిన ఉత్తమ బోధనలు గుర్తించి ప్రభుత్వం ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఆదివారం విజయనగరంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘునాథశర్మ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. సురేష్ గతంలో కానిస్టేబుల్‌గా పది సంవత్సరాలు పనిచేశారు. ఆతర్వాత బోధనారంగంపై మక్కువతో ఉపాధ్యాయుడిగా ఎంపికై విశేష సేవలందిస్తున్నారు. ఆయనకు రాష్ట్రస్థాయి అవార్డు లభించటంతో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

కనిగిరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సహకారంతో ఆదివారం కనిగిరిలో నిర్వహించిన ఉచిత మోకాళ్ళ కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఈ శిబిరానికి వృద్ధులు, మోకాళ్ళ కీళ్ళ బాధితులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన వృద్ధులను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పేరుపేరున పలకరించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ శివయ్య, డాక్టర్ శ్రీనివాస రెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి వంద మంది హాజరుకాగా, వారిలో 46 మందికి శస్త్ర చికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించారు.

110 మందికి రక్తనాళ పరీక్షలు

పామూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సూర్యచంద్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఏషియన్ వాస్కులర్ హాస్పిటల్ తరుపున పద్మావతి గెస్ట్ హౌస్‌లో ఆదివారం 110 మందికి రక్తనాళ పరీక్షలు నిర్వహించినట్లు సేవాసంస్థ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ డీవీ మనోహర్ తెలిపారు. ఈ వైద్యశిబిరంలో రక్తనాళ సమస్యలు ఉన్నవారిని 35 మందిని గుర్తించారు. వీరికి హైదరాబాద్‌లో లేజర్ చికిత్స చేస్తారని తెలిపారు. వైద్యశిబిరంలో డాక్టర్లు సుమాచారి, డాక్టర్ సాయి, సిబ్బంది సతీష్, లోకేష్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

నాగరప్పమ్మతల్లి కొలుపుల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటప్రసాద్

పామూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలంకూరు గ్రామ పంచాయతి గరికిపాటిపల్లి గ్రామంలో వెలసియున్న శ్రీనాగరప్పమ్మ తల్లి, ఎల్లమ్మతల్లి తిరుణాళ్ల శనివారం రాత్రి వైభవంగా జరిగింది. ఈ వేడుకల్లో అనంతపురం టౌన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్థులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యారవ శ్రీను, యర్రసింగ్ మునలయ్య, నెలకుర్తి వెంకటేశ్వర్లు, గరికిపాటి తిరుపతిరావు, మెడపల్లి మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సగం గ్రామాలకు ఇన్‌చార్జ్ వీఆర్‌వోలే దిక్కు

ముండ్లమూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు రెగ్యులర్ వీఆర్‌వోలు లేకపోవటంతో ఇన్‌చార్జ్‌ల మీదనే ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది. ఇటీవల జరిగిన బదిలీల్లో పలువురు ఇతర మండలాలకు వెళ్లారు. వారిస్థానంలో కొత్తవారిని నియమించక పోవటంతో రెవెన్యూపరమైన పనులు స్తంభించిపోతున్నాయి. మండలానికి రావడానికి బాపట్ల జిల్లా నుంచి ఏడుగురు వీఆర్‌వోలు దరఖాస్తు చేసుకున్నారు. వీరిని ప్రకాశం జిల్లాకు పంపటానికి జిల్లావేరనే కారణంతో నిలిపివేశారు. దీంతో ఆయా గ్రామాల్లో ఇన్‌చార్జ్‌లను నియమించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రస్తుతం ఉన్న వీఆర్‌వోలకు రెండు మూడు గ్రామాలు అప్పగించడంతో పనులు చేయలేకపోతున్నారు. ఇదిలాఉంటే ఆయా గ్రామాల ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అందుబాటులో వారు ఉండకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. ముండ్లమూరు, మారెళ్ళ, పోలవరం, పెద ఉల్లగల్లు, కెల్లంపల్లి, నూజెండ్లపల్లి, నాయుడుపాలెం రెవెన్యూ గ్రామాలకు రెగ్యులర్ వీఆర్‌వోల నియామకం జరగలేదు. ఈదర వీఆర్‌వో దయానందంను ముండ్లమూరుకు ఇన్‌చార్జ్ వీఆర్‌వోగా నియమించారు. పసుపుగల్లు వీఆర్‌వో బి.గురవయ్యను మారెళ్ళకు, ఉమామహేశ్వర అగ్రహారం వీఆర్‌వో బ్రహ్మతేజను పోలవరంకు, వేముల వీఆర్‌వో పెద్దన్నను పెద ఉల్లగల్లుకు, శంకరాపురం వీఆర్‌వో సుజాతను నూజెండ్లపల్లికి, సింగనపాలెం వీఆర్‌వో రాఘవరెడ్డిని నాయుడుపాలెంకు ఇన్‌చార్జ్ వీఆర్‌వోలుగా నియమించారు. మండలం విస్తీర్ణం పెద్దది కావటం, రెవెన్యూపరమైన సమస్యలు అధికంగా ఉండటంతో పుల్‌టైమ్ వీఆర్‌వోలు లేకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెవెన్యూపరమైన చిన్నపనికి సైతం రోజుల తరబడి తిరగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





రేపల్లె మండలం రుద్రవరంలో తుప్పు పట్టి అధ్వాన్నంగా తయారైన టిడ్కో భవన సముదాయం

ఆంధ్రజ్యోతి ఫోకస్

ఇల్లు.. ఇస్తారా?

"పట్టణ పేదల ఇంటి కష్టాలను తీర్చేందుకు గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కోసం ఆధునిక టెక్నాలజీతో టిడ్కో ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు. అప్పట్లోనే చాలావరకు నిర్మాణాలు పూర్తి చేసుకోగా.. కొన్ని దగ్గర్ల గృహ ప్రవేశాలు కూడా జరిగాయి. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతోనే టిడ్కో పనులను నిలిపివేసింది. అంతకు ముందు పూర్తి అయిన ఇళ్లను కూడా పంపిణీ చేయలేదు. దీంతో అవి శిథిలావస్థకు చేరుకుంటున్నా.. తమకు ఇళ్లు పంపిణీ చేయాలని లబ్ధిదారులు ఆందోళనలు చేసినా వైసీపీ పాలకులు ఎన్నికల ముందు వరకు స్పందించలేదు. ఎన్నికల సమయంలో హడావుడిగా పంపిణీ చేపట్టారు. అయితే కొన్నిదగ్గర్ల సక్రమంగా వసతులు కల్పించలేదు. మరికొన్ని దగ్గర్ల పనులు పూర్తిగా జరగలేదు. దీంతో చాలామందికి ఇంటి కాగితాలు చేతికి వచ్చినా ఇళ్లలో చేరలేదు. చేరినవారు అక్కడి సమస్యలతో సహజీవనం చేస్తున్నారు. అయితే మళ్లీ టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో తమ ఇంటి కల నెరవేరుతుందని టిడ్కోలబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు."

- కలగానే టిడ్కో గృహయోగం
- ఐదేళ్లు పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- ఎన్నికలకు ముందు హడావుడిగా పంపిణీ
- సౌకర్యాలు లేక ఇళ్లలో లబ్ధిదారుల అవస్థలు

(ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్)

గత టీడీపీ ప్రభుత్వం పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 33,264 మంది పట్టణ పేదల కోసం ఆయా మున్సిపాలిటీల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టిన విషయం తెలిసిందే. వీటిలో గత ప్రభుత్వం 25,228 గృహాల నిర్మాణాల్ని పూర్తి చేసింది. 8,036 గృహాల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. ఆధునిక పరిజ్ఞానంతో పేదల కోసం నాటి ప్రభుత్వం ఇళ్లను నిర్మించింది. అద్దె ఇంటి కష్టాలు తప్పుతాయి.. సొంతింట్లో సంతోషంగా ఉండవచ్చని లబ్ధిదారులు ఆశిస్తున్న తరుణంలో ప్రభుత్వం మారింది. వైసీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్ల పనులను నిలిపివేసింది. మౌళిక వసతుల పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించడంలో కాలయాపన చేసింది. ఇళ్లు ఇవ్వండి మహాప్రభో అని లబ్ధిదారులు వేడుకున్నా.. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తూ రంగులు వేయడంతో సరిపెట్టారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గత ఏడాది చివర్లో వైసీపీ ప్రభుత్వం హడావు డిగా కొన్ని ప్రాంతాల్లో లబ్ధిదారులకు ఇళ్లను అందజేసింది. అయితే అక్కడ మౌలిక వసతులు, సౌకర్యాలు, సరైన రక్షణ చర్యలు లేవు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం టిడ్కో ఇళ్ల ప్రాంగణాల్లోని సమస్యలు పరిష్కరించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఇళ్లు ఇస్తే తమ అద్దెంటి కష్టాలు తీరుతాయని ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినా కొన్ని మున్సిపాలిటీల్లో టిడ్కో ఇళ్ల ప్రాంగణాల్లో మౌలిక వసతుల కల్పనపై ఇప్పటికీ అధికారులు మౌనంగానే ఉన్నారు. అక్కడ తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ, రోడ్లు తదితర మౌలిక వసతులు ఎప్పటికి కల్పిస్తారో.. తమకు ఎప్పటికి ఇళ్లు అందుతాయోనని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. అనేక ప్రాంతాల్లో టిడ్కో ఇళ్లు బూజుపట్టగా, టిడ్కో ఇళ్ల ప్రాంగణాలు పిచ్చిచెట్లతో అడవులను తలపిస్తు న్నాయి. నిర్మాణంలో ఉన్న ప్రాంతాల్లో అయితే ఇనుప చువ్వలు తుప్పు పట్టిపోయాయి.

సౌకర్యాలు అంతంతే..

చిలకలూరిపేట: సరైన సౌకర్యాలు లేని కారణంగా చిలకలూరిపేటలోని టిడ్కో గృహాలలో 50 శాతం పైగా కుటుంబాలు నివాసానికి ఆసక్తి చూపడం లేదు. మొదటి దశలో నిర్మించిన 4,612 గృహాల్లో సుమారు 2 వేల మందే నివాసం ఉంటున్నారు. పట్టణానికి నాలుగున్నర కిలోమీటర్ల దూరంలోని చెరువు రోడ్డులోని టిడ్కో సముదాయానికి సరైన రవాణా సౌకర్యం లేదు. పాఠశాల, అంగన్‌వాడీ, హెల్త్ సెంటర్ కూడా అందుబాటులో లేదు. మురుగునీరు పారుదల వ్యవస్థ లేదు. ఇటీవల మంత్రి నారాయణ, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు టిడ్కో సముదాయాన్ని సందర్శించగా సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు.



చిలకలూరిపేటలో నిర్మించిన టిడ్కో గృహాలు

ఎదురుచూపులు

అద్దంకి: వైసీపీ పాలకుల నిర్లక్ష్యానికి ఐదున్నరేళ్లుగా టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు ఎదురు చూపులే మిగిలాయి. అద్దంకిలో 863 ప్లాట్లతో శింగరకొండ సమీపంలో టిడ్కో అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు జరిగాయి. వైసీపీ అధికారంలోకి రాగానే టిడ్కో ఇళ్ల పనులను అర్ధాంతరంగా నిలిపివేసింది. దీంతో గత ఐదున్నరేళ్లుగా ఎలాంటి పనులు జరగలేదు. 2024లో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని ప్రకటించడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. నిలిచిపోయిన పనులను పూర్తి చేయడంపై ప్రజాప్రతినిధులు, అధికారులు కసరత్తు ప్రారంభించారు. టిడ్కో ఇళ్ల వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ కూడా మంజూరు అయింది.



అద్దంకిలో అర్ధాంతరంగా ఆగిపోయిన టిడ్కో గృహ సముదాయం

శిథిలావస్థ

రేపల్లె: గత టీడీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణాలను చేపట్టగా 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కక్షకట్టి ఐదేళ్లుగా వాటిని శిథిలావస్థకు చేర్చింది. రూ.కోట్లతో నిర్మించిన టిట్కో గృహ సముదాయాలు ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలతో అడవులను తలపిస్తున్నాయి. రేపల్లె మండలం అరవపల్లి పంచాయతీ శివారు గుంటూరువారి ఎస్సీ కాలనీ సమీపంలో 11 ఎకరాల్లో టిడ్కో ఇళ్ల పనులు అర్ధాంతరంగా నిలిచిపోయి ఉన్నాయి.



రేపల్లె మండలం రుద్రవరం వద్ద నిలిచిపోయిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం భారీగా పెరిగిన పిచ్చి మొక్కలు

పంపిణీ ఎప్పటికో?

నరసరావుపేట: టీడీపీ హయాంలో 2018లో 1504 గృహాలను నరసరావుపేటలో నిర్మించారు. ఇళ్లు నిర్మించి.. వసతులు కల్పించి ఏళ్లు గడుస్తున్నా లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. గృహాల పంపిణీపై అధికారులకే స్పష్టత లేదు. సొంత ఇంటి కోసం లబ్ధిదారులు ఏళ్లుగా ఎదురు చూస్తున్నా వీరి మొర ఆలకించే వారే కరువయ్యారు. లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు చోటు చేసుకున్నాయని గతంలో 285 లబ్ధిదారుల పేర్లను తొలగించడంతో వారు కోర్టును ఆశ్రయించారు. ఈ పరిస్థితుల్లో పాత వారికే ఇళ్లు కేటాయించాలని కోర్టు మధ్యంతరం ఉత్తర్వులు ఇచ్చింది. అయినా సదరు పేదలకు ఇళ్లను కేటాయించే విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారు. వాటా ధనం చెల్లించిన 580 మంది లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపుపై సందిగ్ధత నెలకొంది. ప్రస్తుతం 82 కుటుంబాలు మాత్రమే నివాసం ఉంటున్నాయి. మిగిలిన ఇళ్లు ఏళ్లుగా పంపిణీ జరగక పోవడంతో పాడుబడే పరిస్థితులు నెలకొనున్నాయి.



నరసరావుపేటలో పంపిణీకి నోచుకోని టిడ్కో గృహాలు

సౌకర్యాలు నాస్తి..

గుంటూరు: ఏళ్లుగా గుంటూరులోని పట్టణ పేదలు సొంత ఇంటి కల నేరవేడంలేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అడవితక్కెళ్లపాడులో 4750 టిడ్కో గృహాలు మంజూరు కాగా అప్పట్లోనే 1100 ఇళ్లను నిర్మించారు. ఇంటి కోసం అప్పు చేసి చెల్లించిన వాటా ధనానికి వడ్డీ ఒకవైపు.. ఉంటున్న ఇళ్లకు అద్దెలు చెల్లించలేక మరోవైపు భారం పడుతుందని లబ్ధిదారులు వాపోతున్నా ఇంతకాలం పాలకులు ఆలకించ లేదు. పార్టీ రంగులు వేయడంలో చూపిన శ్రద్ధ పనులు పూర్తి చేయడంలో, వసతులు కల్పించడంలో జగన్ ప్రభుత్వం చూపలేదు. ఎన్నికలకు ముందు పంపిణీ చేసిన ఇళ్లలో నివాసాలకు సరైన సౌకర్యాలు లేక లబ్ధిదారులు ఇక్కట్లు పడుతున్నారు. కొన్ని ఇళ్లకు కిటికీలు, తలుపులు దెబ్బతినిపో వడం, భూగర్భ విద్యుత్ తీగలు కాలిపోయి, ప్రమాదకరంగా మారడం వంటి ఇబ్బందులతో లబ్ధిదారులు గృహప్రవేశాలకు సాహసం చేయలేదు.



అడవితక్కెళ్లపాడులోని టిడ్కో గృహాలు



- ఏపీకి కలిసిరానున్న చంద్రబాబు అనుభవం, పవన్ ఆవేశం
- కూటమి ప్రభుత్వ ఏర్పాటు రాష్ట్రానికి సువర్ణావకాశం
- నరసరావుపేటలో విజయనిర్మల విగ్రహ ప్రతిష్ఠ నా కల
- కళాకారులను ప్రోత్సహించేందుకు నంది అవార్డులు ఇవ్వాలి
- చిత్రం భళారే విచిత్రం, శ్రీవారికి ప్రేమలేఖ పార్ట్ -2లకు ప్లాన్
- ఆంధ్రజ్యోతితో సినీనటుడు నరేష్

పదేళ్లలో ప్రథమస్థానం

ఆంధ్రజ్యోతితో అతిథి

నరసరావుపేట కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు అనుభవం.. పవన్‌కల్యాణ్ ఆవేశం కలగలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పదేళ్లలో ప్రథమ స్థానానికి చేరుకుంటుంది. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల రాజధాని అమరావతి శిథిలావస్థకు చేరింది. ప్రధాని మోదీ ప్రోత్సాహం, చంద్రబాబు సామర్థ్యంతో అమరావతి పునర్నిర్మాణం జరగడం తథ్యం. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడం రాష్ట్రానికి సువర్ణావకాశం.. అని సినీనటుడు నరేష్ తెలిపారు. స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఓ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన ఆదివారం ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. సినీ ప్రస్థానం నుంచి రాజకీయాల వరకు ఆయన అభిప్రాయాలు ఆయన మాటల్లోనే..

● సినీ ప్రస్థానం

నా పదో ఏట పండంటి కాపురం సినిమాతో అరంగేట్రం చేశాను. అది మొదలు ఇప్పటివరకు నటిస్తూనే ఉన్నాను. నటప్రస్థానం 50 యేళ్లు పూర్తిచేసుకుంది. ఇప్పుడు హీరోగా రెండు మూడు సినిమాలు చేస్తూ హైసక్సెస్ రేట్‌లో ఉన్నాను. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కొన్ని సినిమాలు చేస్తున్నాను. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో యునైటెడ్ నేషన్స్ అంబాసిడర్‌గా ఉన్నాను. గతంలో మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సినీ ఇండస్ట్రీ కోసం, కళాకారులకోసం కృషి చేశాను.

● నరసరావుపేటతో అనుబంధం

నరసరావుపేట మా అమ్మవాళ్ల ఊరు. చిన్నప్పుడు వేసవి సెలవుల్లో ఇక్కడికి వచ్చేవాణ్ని. ఇక్కడ మా బంధువులు చాలామంది ఉన్నారు. కొంతకాలంగా ఈ ఊరితో అనుబంధం తెగిపోయింది. అనుకోకుండా ఈ కార్యక్రమంతో మళ్లీ ఇక్కడికి రావడం సంతోషంగా ఉంది. అమ్మ భారతదేశం గర్వించదగ్గ నటిమణి. 46 సినిమాలకు దర్శకత్వం వహించింది. గిన్నీస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న మహిళా దర్శకురాలు. అమ్మకు పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డులు రాకపోవడం వెలితిగా అన్పిస్తుంది. తను పెరిగిన నరసరావుపేటలో విగ్రహం పెట్టాలి అనగానే స్థానిక ఎమ్మెల్యే సహకరిస్తానని సభాముఖంగా చెప్పడం సంతోషం. కాపు సంఘం ద్వారా త్వరలో మంచి ప్రదేశం చూసి అమ్మ విగ్రహం ఏర్పాటు చేయించడం జరుగుతుంది. ఇక్కడ అమ్మ విగ్రహం ప్రతిష్ఠించడం నా కల. సహకారం ఇస్తానన్నందుకు ఎమ్మెల్యేకి ధన్యవాదాలు.

● రాష్ట్రం ఇక సుభిక్షం

ప్రజలందరూ కోరుకున్న రాజధాని అమరావతి పునర్నిర్మాణం జరుగుతుంది. కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రం సుభీక్షంగా మారుతుంది. కేంద్రంలో ప్రధాని మోదీ సహాయ సహకారాలు, చంద్రబాబు సమర్థతతో రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకెళ్తుంది.

● షూటింగులకి రాయితీలు ఇవ్వాలి

రాష్ట్రంలో సినిమా షూటింగులకు ఎన్నో అనువైన లొకేషన్లు ఉన్నాయి. ఇక్కడ షూటింగులు జరుపుకోవడానికి ప్రభుత్వం రాయితీలు ఇవ్వాలి. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తి కాబట్టి సినిమా పరిశ్రమకు, కళాకారులకు ప్రోత్సాహం లభిస్తుందన్న ఆశాభావం ఉంది. కళాకారులకు ప్రోత్సాహం ఇచ్చేలా నంది అవార్డులు ఇవ్వాలి. నంది అవార్డులు ఇవ్వడం అనేది దశాబ్దాలుగా వస్తున్న ఆనవాయితీ. దీనిని మళ్లీ పునరుద్ధరించాలి. ఓటీటీలు రావడంతో థియేటర్ల మనుగడ ప్రశ్నార్థకమైంది. ఇది బాధ కలిగించే విషయమైనా, టెక్నాలజీతో వచ్చే మార్పులతో నడవాలి. చిత్రం భళారే విచిత్రం పార్ట్ 2 స్క్రిప్ట్ వర్క్ జరుగుతుంది. శ్రీవారికి ప్రేమలేఖ పార్ట్ 2 తీయడానికి ప్లాన్ చేస్తున్నాను.

మెయిన్ కెనాల్‌పై కూలిన సర్‌ప్లస్

రేపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులకు సాగునీరు అందించేందుకు బ్రిటీష్ వారు 1916లో వెల్లటూరు మెయిన్‌చానల్‌పై వెల్లటూరు-భట్టిప్రోలు మధ్య నిర్మించిన సర్‌ప్లస్ లాకులు ఆదివారం కూలిపోయాయి. దీంతో కాల్వలో ఉన్న సాగు నీరంతా వృథాగా పోయింది. భట్టిప్రోలు, చెరుకుపల్లి, నిజాంపట్నం మండలాలకు సాగునీరు నిలిచిపోయింది. 112 సంవత్సరాల క్రితం నిర్మించిన మెయిన్ కెనాల్ ద్వారానే రైతులకు సాగునీరు అందుతుంది. కాలం చెల్లిపోవడంతో సర్‌ప్లస్ లాకులు కూలిపోయినట్లు రైతులు తెలిపారు. 24 కిలోమీటర్లు మేర పొడవు ఉన్న ఈ కాల్వ పరిధిలో 31,670 ఎకరాలకు సాగునీరు అందుతుంది. వెల్లటూరు-భట్టిప్రోలు మధ్య లాకులు కూలడంతో వెల్లటూరులోని మెయిన్ కెనాల్ నుంచి వచ్చే సాగునీటిని కట్టేశారు. సర్‌ప్లస్ లాకులు నిర్మించేంత వరకు నీరు వదిలే పరిస్థితి లేదు. ఖరీఫ్ సీజన్ ముగుస్తుండంతో రైతులు రెండో పంట కింద మినుము, పెసలు, మొక్కజొన్న తదితర పంటలు వేసేందుకు విత్తనాలు చల్లుకుంటున్నారు. సాగునీరు రావాలంటే లాకుల నిర్మాణం చెయ్యాల్సి ఉంది. నీటిపారుదల శాఖాధికారులు దృష్టిసారించి సత్వరమే లాకులు నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

మూడు మండలాలకు నిలిచిన సాగునీరు

1916లో బ్రిటిష్ కాలంలో లాకుల నిర్మాణం





వెల్లటూరు-భట్టిప్రోలు మధ్య మెయిన్‌కెనాల్‌పై కూలిన సర్‌ప్లస్ (ఇన్‌సెట్లో) వృథాగాపోతున్న నీరు

క్వింటాల్‌కు రూ.20 వసూలు

- పత్తి రైతులను పీడిస్తోన్న సిబ్బంది
- ఇవ్వకపోతే వేలిముద్రలు వేయని వైనం
- సీసీఐ కేంద్రాల్లో వసూళ్లపై రైతుల ఆగ్రహం

గుంటూరు సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు.. తేమ శాతం.. రవాణా.. నిరీక్షణలతోనే ఇబ్బంది పడుతున్న పత్తి రైతులు సీసీఐ కేంద్రాల్లో సిబ్బంది తీరుతో దోపిడీకి గురవుతున్నారు. పత్తి పండించి దానిని విక్రయంచడానికి రైతులు నరకం చూస్తున్నారు. ఏదో ఒక రూపంలో పత్తి రైతులకు వేధింపులు ఎదురౌతూనే ఉన్నాయి. కేంద్రాలకు రైతులు తీసుకువచ్చే పత్తికి క్వింటాల్‌కు రూ.20 ముడుపులు రూపేణా చెల్లించాల్సిందేనని కొందరు సిబ్బంది తెగేసి చెబుతున్నారు. అడిగినంత ఇవ్వకపోతే పత్తిని దిగుమతి కాకుండా అడ్డుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. కొనుగోలు వ్యవహారంలో ఉన్నత స్థాయి వ్యక్తులు రంగ ప్రవేశం చేసినా సీసీఐ కేంద్రాల్లో ఎదురౌతున్న అనుభవం చూసి రైతులు ఖంగు తింటున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాల్లో ఎక్కువ భాగం ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లా సీసీఐ కేంద్రాలు కూడా గుంటూరులోనే ఏర్పాటు చేశారు. ఎల్-1, ఎల్-2, ఎల్-3 వారీగా విభజించిన మీదట సుమారు 32 కేంద్రాల వరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్నాయి. రైతులు ఈ-క్రాప్‌లో నమోదు చేసుకున్న పత్తిని అమ్మకం కోసం ఆయా కేంద్రాలకు తీసుకురావాల్సి వస్తుంది. రైతులు ఎంత మొత్తంలో అయితే కేంద్రానికి పత్తి తీసుకువస్తారో ఆ వివరాలు సీఎం యాప్‌లో కూడా నమోదు చేయాలి. అందుకోసం ప్రభుత్వం సీసీఐ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సిబ్బంది, బయ్యర్లు వేలిముద్రలు వేయాలి. ఒక వేళ వేలిముద్ర లు వేయకపోతే సదరు వివరాలు సీఎం యాప్‌లో అప్‌లోడ్ అవ్వవు. వివరాలు అప్‌లోడ్ కాకపోతే పత్తి కొనుగోళ్లు జరగవు. ఈ పరిస్థితుల్లో కేంద్రాల్లో సిబ్బందికి ముందే రైతులు కప్పం కట్టాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని కేంద్రాల్లో క్వింటాల్‌కు రూ.20 నుంచి రూ.30 వరకు డిమాండ్ చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఇవ్వకపోతే వేలి ముద్రలు వేయమని సిబ్బంది ముందే చెబుతున్నట్లు వాపోయారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సిబ్బందికి సీసీఐ బయ్యర్లు కూడా అనధికారికంగా 2 నుంచి 3 శాతం వరకు చెల్లించే పద్ధతి అమల్లో ఉన్నట్లు సమాచారం. అది చాలక రైతుల నుంచి అదనపు వసూళ్లకు పాల్పడటం వివాదాస్పదమవుతుంది. సీసీఐ కేంద్రాల ఏర్పాటు రైతులకు ఏమో గానీ కొందరికి మాత్రం మంచి లాభదాయకంగా ఉంది.



సీసీఐ కేంద్రానికి రైతులు తీసుకువచ్చిన పత్తి నిల్వలు

నాణ్యమైన కరెంటు

సరఫరా చేయాలి

అద్దంకి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన విద్యుత్ సరఫరాకు ఆర్‌డీఎస్‌ఎస్ పథకం ద్వారా చేపట్టిన త్రీఫేస్ లైన్ల ఏర్పాటు, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు వేగవంతం చేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ సమస్యలపై ఆదివారం చిలకలూరిపేటలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తున్నదన్నారు. కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు సంబంధించి రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుని త్వరితగతిన భూసేకరణ పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గంలో విద్యుత్ వినియోగం, అవసరాన్ని బట్టి కొత్త సబ్‌స్టేషన్ల మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. గ్రామాల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తయ్యేలా పర్యవేక్షణ చేయాలన్నారు. అద్దంకి పట్టణం, మేదరమెట్లలో కొత్తలైన్ల ఆధునీకరణ పనులను పూర్తి చేయాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. సమీక్షలో విద్యుత్ ఎస్ఈ అంజనేయులు, ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, మార్టూరు డీఈఈ సురేంద్రబాబు, ఏఈలు పాల్గొన్నారు.

ఎక్కువ మొత్తంలో పింఛన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ

దేశంలో ఎక్కువ మొత్తంలో పింఛన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని మంత్రి తెలిపారు. ఆదివారం అదంకిలో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలో 65 లక్షల మందికి ప్రతినెలా రూ.4 వేలకు పెంచి పింఛన్లు అందిస్తున్నామన్నారు. దివ్యాంగులు, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడే వారికి ఇచ్చే పింఛన్ అత్యధికంగా రూ.30 వేల వరకూ ఉందన్నారు. త్వరలో డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో రూ.5 వేల కోట్లతో 30 వేల పనులు చేపట్టినట్లు తెలిపారు.

- కొత్త సబ్‌స్టేషన్‌ల ఏర్పాటుకు భూసేకరణ
- విద్యుత్ సమీక్షలో మంత్రి రవికుమార్ ఆదేశాలు
- నిర్లక్ష్య వైఖరి వీడి పర్యవేక్షణ చేయాలని సూచన



అధికారులతో చర్చిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

సవాల్‌గా అనధికార లేఅవుట్లు

- పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్న పంచాయతీ సిబ్బంది
- వాటిని పీకేస్తున్న అక్రమార్కులు



అక్కాయిపాలెం పరిధిలో జాతీయ రహదారి పక్కన వేసిన అనధికారిక లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డ్.. బోర్డును పీకేసిన అక్రమార్కులు



చీరాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అనధికార లేఅవుట్లు సంబంధిత అధికారులకు సవాల్‌గా నిలుస్తున్నాయి. అనుమతులు లేని లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసినవారికి చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో ఒకసారి ప్లాట్లు కొనుగోలు చేసిన తరువాత తమకెలాంటి సంబంధం లేదని విక్రయదారులు చెప్తున్నారు. దీంతో కొనుగోలుదారులు నష్టపోతున్నామని, అందుకు సంబంధించి తమకు న్యాయం చేయాలని కొనుగోలుదారులు కోరుతున్నారు. అనధికారిక లేఅవుట్లలో పంచాయతీ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా లేఅవుట్లలో కొనుగోలు చేసిన వారికి కనీసం భవన నిర్మాణాలకు కూడా అనుమతి ఇవ్వమని ఆ హెచ్చరిక బోర్డులలో పొందుపరుస్తున్నారు.

చీరాల నియోజకవర్గంలో అనధికారిక లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఇవి అందరికీ కనిపిస్తాయి. అయితే సంబంధిత అధికారులకు మాత్రం కనిపించవు. అందిన ఫిర్యాదులు, మీడియాలో ప్రచురితమైన కథనాలతో ఆ లేఅవుట్లపై అధికారులు చేపడుతున్న చర్యలు మొక్కుబడిగా ఉంటున్నాయి. చీరాల నియోజకవర్గ పరిధిలో వెలుస్తున్న అనధికారిక లేఅవుట్లు, ఒకరిని చూచి మరొకరు అదే పంథాలో రియల్ దందా సాగిస్తుండడం అందుకు నిదర్శనం. అధికారులు వారికి కొమ్ముకాస్తుండడమే ప్రధాన కారణమనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

కన్వర్షన్ రుసుం చెల్లించకుండానే లేఅవుట్లు

వ్యవసాయ భూమిని వ్యవసాయేతర పనులకు వినియోగించే క్రమంలో కన్వర్షన్ (నాళా రుసుం) ప్రభుత్వానికి చెల్లించాలి. అయితే పుట్టగొడుగుల్లా వెలుస్తున్న లేఅవుట్లలో సింహభాగం కన్వర్షన్ రుసుము చెల్లించకుండా విక్రయాలు జరుగుతున్నాయి. దీంతో కొనుగోలుదారులు నష్టపోతున్నారు. అలాంటి వాటిపై రెవెన్యూ అధికారులు తగిన చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. అలాంటి చోట్ల పంచాయతీ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం గుడ్డిలో మెల్లగా ఉందని చెప్పుకుంటున్నారు.

ఏర్పాటు చేసిన కొద్ది సేపటికే బోర్డులు మాయం

కన్వర్షన్ ఫీజు చెల్లించకుండా వేస్తున్న లేఅవుట్లను ప్రాథమికంగా అడ్డుకోవల్సిన బాధ్యత రెవెన్యూ శాఖది. అయితే వారు ఆ పని చేయడం లేదు. అందుకు పలు రకాల కారణాలు ఉన్నాయని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీ అధికారులు అనధికారిక లేఅవుట్లలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. వేసిన కొద్ది సేపటికే అక్రమార్కులు హెచ్చరిక బోర్డులను తొలగించి పడేస్తున్నారు. దీనిపై కఠిన చర్యలకు ఉన్నతాధికారులు తగిన నిర్ణయం తీసుకోవాల్సిందే.

తీపి కబుర్లు.. చేదు చేష్టలు

ప్రస్తుతం నియోజకవర్గ పరిధిలో సిండికేట్‌గా అనధికారిక లేఅవుట్లు వేస్తున్న వారిలో ఓ వ్యక్తి కీలకపాత్ర పోషిస్తున్నాడు. తీపి కబుర్లు చెప్తూ, చేదు చేష్టలతో అక్రమ ప్లాట్లను విక్రయిస్తున్నాడు. రెవెన్యూ అధికారుల ఆశీర్వచనాలు అతనికి ఉంటున్నాయని పలువురు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పోలేరమ్మకు వెండి కిరీటం బహూకరణ



అమ్మవారికి హుండీ, వెండి కిరీటాన్ని బహూకరించిన దాతలు

యద్దనపూడి (మార్టూరు) నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడిలోని పోలేరమ్మ తల్లి దేవ స్థానానికి ఆదివారం దాతలు వెండి కిరీటాన్ని, హుండీని బహూకరించినట్లు భూషయ్య తెలిపారు. తుర్లపాడు గ్రామానికి చెందిన నల్లపాటి సతీష్, భానుప్రియ దంపతులు రూ.10,500 విలువైన హుండీని బహూకరించారు. అదే విధంగా గొట్టిపాటి శేషగిరిరావుతో పా టు వారి కుమార్తె, అల్లుడు శ్రీనివాసరావు, హనుమంతరావు దంపతులు రూ.76 వేల విలువైన వెండి కిరీటాన్ని అమ్మవారికి బహూకరించగా అర్చకులు అమ్మవారికి అలంకరించారు.

ఘనంగా కార్తీక వన సమారాధనలు

ఉత్సాహంగా పాల్గొన్న ఆయా సామాజిక వర్గాల ప్రముఖులు



బ్రాహ్మణ వన సమారాధనలో భానును సత్కరిస్తున్న ప్రతినిధులు

చీరాలటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలో ఆదివారం పలు చోట్ల నిర్వహించిన వన సమారాధన కార్యక్రమాల్లో ఆయా సామాజిక వర్గాల ప్రముఖులు, కుటుంబాల ప్రముఖులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈక్రమంలో స్వర్ణ రోడ్డులోని దత్త క్షేత్రంలో బ్రాహ్మణ సమారాధన నిర్వహించారు. దీంతో ఈశ్వరునికి, విష్ణుదేవునికి ప్రీతికరమైన ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రాభిషేకం, నందికేశుని నోము ఘనంగా జరిపారు. ఆయా సామాజిక వర్గానికి చెందిన పవని భానుచంద్రమూర్తి, గోనెళ్ల శేషవరలక్ష్మి ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ చేతుల మీదుగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డును అందుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. వారిని ఘనంగా సత్కారించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా గుడ్డ సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ధర్మవరపు వెంకట రమణ, సత్యనారాయణమూర్తి, సీతామహాలక్ష్మీ, వడలి రాధా కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఆకురాతి వారి ఆధ్వర్యంలో

ఈపూరుపాలెం పంచాయతీ సావరపాలెంలోని శ్రీ సైకిత లింగేశ్వర స్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో ఆకురాతి వంశస్థులు ఘనంగా 13వ కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఈక్రమంలో ముందుగా ఈపూరుపాలెం కూరగాయల మార్కెట్ వద్ద ఆకురాతి రంగనాయకులు స్వామి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ఆకురాతి వంశస్థులు పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన అవసరం



చిన్నారులకు బహుమతులను అందజేస్తున్న లక్ష్మీనరసింహశాస్త్రి

పర్చూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యతోపాటు సామాజిక అంశాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని బీజేపీ నియోజకవర్గ నాయకుడు శనగవరపు లక్ష్మీనరసింహశాస్త్రి అన్నారు. స్థానిక శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న యోగా శిక్షణ కార్యక్రమంలో చిన్నారులకు వ్యక్తిత్వ వికాశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వివిధ అంశాలపై చిన్నారులకు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఆరోగ్యవంతమైన జీవితానికి యోగా ఎంతగానో దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో కఠారి సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, అజయ్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్పస్వామి పడి పూజ

బల్లికురవ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దామావారిపాలెంలో కార్తీక సోమవారం సందర్భంగా సోమవారం రాత్రి అయ్యప్ప స్వామి అభిషేకం, పడి పూజ జరుగుతుందని 19వ వార్డు కౌన్సిలర్ ఏజెండ్ల నాగరాజు తెలిపారు.

నేడు బల్లికురవలో అర్జీల స్వీకరణ

బల్లికురవ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం బల్లికురవలోని తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అర్జీలను స్వీకరించనున్నారు. మండలంలోని ప్రజలు అర్జీలను సమర్పించి సమస్యలను పరిష్కరించుకోవాలని మంత్రి కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకిన బాలుడు.. తప్పిన ప్రమాదం

తోటవారిపాలెం(చీరాలటౌన్), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం తోటవారి పాలెం పం చాయతీ ఇందిరా కాలనీలో ఆరేళ్ల బాలుడు ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకున్నాడు. అయితే స్వల్ప గాయాలతో ప్రమా దం తప్పింది. వివరాల్లోకి వెళితే ఈపూరుపాలెం జెండా చెట్టు సమీపానికి చెందిన ఆరేళ్ల బాలుడు ఆదివారం స్కూల్‌కు సెలవు కావడంతో అమ్మమ్మ వద్దకు వెళ్లాడు. ఈక్రమంలో బాబు ఆడుకుంటుండగా అందరూ ఆదమరిచారు. ప్రమాదాన్ని గ్రహించని బాలుడు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆనుకుని ఉన్న రాళ్లపైకి ఎక్కి తీగలను పట్టుకున్నాడు. దీంతో చేతికి ఒక్కసారిగా కరెంట్ సరఫరా జరిగి కింద పడిపోయాడు. వెంటనే స్థానికులు చీరాల్లోని ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్సను అందించారు. కొద్దిసేపటికి స్పృహలోకి రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే విద్యుత్ శాఖ సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆనుకుని వేసిన రాళ్లను తొలగించారు. అలాగే చుట్టూ రక్షణ చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు.

అలరించిన సత్యహరిశ్చంద్ర

- రాత్రంతా కదలకుండా తిలకించిన అభిమానులు
- అద్దంకిలో చెక్కుచెదరని పౌరాణిక నాటక అభిమానం



రీడింగ్ రూం ఆవరణలో ప్రదర్శిస్తున్న సత్యహరిశ్చంద్ర నాటకం



నాటకానికి హాజరైన ప్రేక్షకులు

అద్దంకి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు వినోదానికి పెట్టింది పేరుగా ఉన్న పౌరాణిక నాటకాలు చిత్ర పరిశ్రమ రాకతో క్రమేపీ ప్రాభవం తగ్గుతూ వచ్చాయి. నేటి తరం యువతకు పౌరాణిక నాటకాలు అంటే పుస్తకాలలో మాత్రమే చదువుకునే పరిస్థితి. దీంతో పౌరాణిక కళాకారులు కూడా పూర్తిగా తగ్గిపోయారు. అద్దంకి మాత్రం పౌరాణిక కళాకారులకు పెట్టింది పేరు. నాటి తరం కళాకారులతో పాటు నేటి తరంలో కూడా కొద్దిమంది అప్పుడప్పుడూ పౌరాణిక కళా ప్రదర్శనలు ఇస్తూ ప్రజలను రంజింప చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి అద్దంకి పట్టణంలోని భవానీ సెంటర్‌లో రీడింగ్ రూమ్ ఆవరణలో డోలక్ ఆర్టిస్ట్ కొమరిగిరి హనుమంతరావు సంతాప సభలో భాగంగా అద్దంకి పట్టణ రంగస్థల కళాకారుల ఆధ్వర్యంలో సత్యహరిశ్చంద్ర (వారణాసి సీను), దేవనర్తకి పూర్తి నాటకం ప్రదర్శన జరిగింది. పౌరాణిక నాటకాల ప్రదర్శన ఆదివారం తెల్లవారే వరకు జరిగినా అభిమానులు కదలకుండా ఉండడం విశేషం. దీనిని బట్టి అద్దంకిలో పౌరాణిక నాటకాల పట్ల అభిమానుల ఆదరణ కొనసాగుతూనే ఉందనటానికి నిదర్శనంగా నిలిచింది. అదే సమయంలో ఇటీవల వరకు చెత్తాచెదారంతో నిండి ఉన్న రీడింగ్ రూమ్ ప్రాంగణం పౌరాణిక నాటకాల ప్రదర్శన పుణ్యాన బాగుపడింది. రంగస్థల కళాకారుడు ఆలకుంట శ్రీనివాసరావు, జన చైతన్య వేదిక కన్వీనర్ అన్నమనేని వెంకట రావు, మన్నం త్రిమూర్తులు, పమిడిఘంటం చంద్రశేఖర్, దామా హనుమంతరావు, పీసీహెచ్ కోటయ్య, తన్నీరు నాగేశ్వర రావు, చెన్నుపల్లి నాగేశ్వరరావు, వెలనాటి రామారావు హాజరయ్యారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి



అద్దంకిలోని దత్తపాదుకాక్షేత్రంలో పూజలు చేస్తున్న మంత్రి గొట్టిపాటి

అద్దంకి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనుల వేగవంతానికి కృషి చేస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి పట్టణంలో పలు కార్యక్రమాల్లో మంత్రి ఆదివారం పాల్గొన్నారు. ముందుగా దత్తపాదుకా క్షేత్రంలో ఆదివారం మంత్రి గొట్టిపాటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సూర్య గార్డెన్, ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ప్రా రంభించారు. మండలంలోని శింగరకొండపాలెంలో టీడీపీ నేత మానం వీరాంజనేయులు ఇటీవల మృతి చెందగా రవికుమార్ కుటుం బ సభ్యులను పరామర్శించారు. అనంతరం ప్రజల నుంచి వినతులను స్వీకరించా రు. పట్టణంలో రీడింగ్ రూమ్ (ఎర్రన కళాక్షేత్రం) అభివృద్ధికి చర్యలు చేపట్టాలని రంగస్థల కళాకారులు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని వేలమూరిపాడు రోడ్డులో ఉన్న జగనన్న కాలనీలో వసతులు కల్పించాలని, మున్సిపల్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, చాగంటి రాజేంద్రప్రసాద్, సందిరెడ్డి శ్రీనివాసరావు, సందిరెడ్డి రమేష్, దత్, వైస్ ఛైర్మన్ దేసు పద్మేష్, చిన్ని శ్రీనివాసరావు, కౌన్సిలర్‌లు అత్తులూరి రమేష్, విజయలక్ష్మి, మాధవరావు, లహరి, కుందారపు రామారావు, కాకాని అశోక్, తమ్మన శ్రీనివాసరావు, ధర్మవరపు శ్రావణ్‌కుమార్, మామిడి రాం బాబు, భోజనపల్లి సత్యనారాయణ, చామర్తి మల్లికార్జునరావు, కురిచేటి చిన్ని పాల్గొన్నారు.

అన్నమయ్య ఖ్యాతిని ఊరూరా చాటాలి

విజయ శంకరస్వామి



హిందూ ధర్మం ఆవశ్యకతను వివరిస్తున్న విజయశంకరస్వామి

పర్చూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ప్రియ భక్తుడు, పరమ భాగవతోత్తముడు అన్నమయ్య ఖ్యాతిని ఊరూరాచాటాలని తిరుపతిలోని అన్నమయ్య కళా క్షేత్రం ప్రతినిధి విజయ శంకరస్వామి అన్నారు. పర్చూరులోని శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి కల్యాణ మండప ప్రాంగణంలో అన్నమయ్య సంకీర్తన భజన మండలి సనాతన ధర్మం అవస్యకత, హిందూ ధర్మం అనే అంశంపై కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన విజయ శంకరస్వామి మాట్లాడుతూ హిందూ ధర్మం నిలవాలని, సనాతన ధర్మం గొప్పతనాన్ని గ్రామ గ్రామాన చాటేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవస్యకత ఎంతైనా ఉందన్నారు. హిందూ సంస్కృతి సంప్రదాయాల గొప్పతనాన్ని ఆయన కొనియాడారు. తిరుపతిలో ఏర్పాటు చేసిన అన్నమయ్య కళాక్షేత్రం పనరంకిత ఉత్సవాలకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రామారావు, సామ్రాజ్యం, బీ లత పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డీఆర్వో



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఆర్వో గంగాధర్ గౌడ్

పర్చూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను బాపట్ల డీఆర్వో గంగాధర్ గౌడ్ ఆదివారం పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా ఎంపీపీయూపీ పాఠశాలలోని 140 నుంచి 144 పోలింగ్ బూత్‌లను పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.బ్రహ్మయ్య, ఇన్‌చార్జి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ కుమార్, బిరుదు నాగేశ్వరావు, బీఎల్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

చినగంజాం : మండలంలోని కడవకుదురు, చినగంజాం, సోపిరాల గ్రామాల్లో స్పెషల్ క్యాంపెయిన్ డే సందర్భంగా నిర్వహిస్తున్న పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ జె.ప్రభాకరరావు ఆదివారం పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు నమోదు, తొలగింపులు, సవరణల నిమిత్తం ప్రత్యేక శిబిరాలను నిర్వహించినట్లు తహసీల్దార్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితా అందుబాటులో ఉంచాలని బూత్ లెవల్ అధికారులకు సూచించారు. ఓటరు జాబితాలో ఒకే కుటుంబానికి చెందిన ఓట్లన్నీ ఒకే కేంద్రంలో ఉండేలా చూడాలన్నారు. ఫొటోలు, పేర్లు, చిరునామాలు, వయస్సు సక్రమం గా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చనిపోయిన వారి పేర్ల తొలగింపునకు దరఖాస్తులను స్వీకరించాలన్నారు. 18 ఏళ్లు ఉన్న వారందరికీ ఓటు ఉండేలా కృషి చేయాలని బీఎల్వోలను తహసీల్దార్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల బూత్ లెవ ల్ అధికారులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న జనసేన నాయకులు

సోపిరాలలో అన్నదానం

చినగంజాం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సోపిరాల రైల్వేగేటు సెంటర్‌లోని జనసేన పార్టీ మండల కార్యాలయంలో డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం మండల పార్టీ ఆధ్వర్యంలో నాయకులు నిర్వహించారు. జనసేన పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో పర్చూరుకు చెందిన ఎన్నారై, జనసేన నాయకులు మన్నెం శ్రీకాంత్ పర్చూరు నియోజకవర్గంలో ప్రతివారం డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు నందు శ్రీనివాసరావు తెలిపారు. 11 వారాలగా కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగుతున్నట్లు చెప్పారు. ఇది 12వ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు కట్టిబోయిన సుబ్బారావు, గంటా వెంకటేష్, బీ శ్రీను, కుర్రి వాసు, సాయి, వెంకటేష్, గోపీనాథ్, పవన్, ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రోగ్రామ్స్ కమిటీ కార్యదర్శి సతీష్, బీజేపీ సీనియర్ నాయకుడు కోటయ్య, జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

29న శింగరకొండలో కార్తీక దీపోత్సవం

బల్లికురవ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటలకు కార్తీక దీపోత్సవం జరుగుతుందని ఈవో తిమ్మానాయుడు తెలిపారు. 108 మంది దంపతులు పాల్గొనే అవకాశం ఉందని, పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి ప్రత్యేక పారిశుధ్య పనులు

ఇంకొల్లు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు పంచాయతీ పరిధిలోని ఇంకొల్లు, గొల్లపాలెం, హనుమోజీపాలెం గ్రామాలలో సోమవారం నుంచి వారం రోజులపాటు ప్రత్యేక పారిశుధ్య పనులు చేయనున్నట్లు ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. చెరువు, రోడ్ల వెంబడి ఉన్న వ్యర్థాలను, అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలలో పారిశుధ్య పనులు చేపడతారని తెలిపారు.

నేడు శింగరకొండలో కార్తీక వనభోజనాలు

బల్లికురవ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండలోని కోదండరామాలయం (రామాలయం)లో కార్తీక వనభోజనాలు కార్యక్రమం సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని శ్రీరామవృద్ధుల ఆశ్రమం అధ్యక్షుడు రావూరి రంగయ్య తెలిపారు. ముఖ్యఅతిథిగా కామేపల్లి గ్రానైట్స్ అధినేత కామేపల్లి లక్ష్మీ ప్రసాద్ హాజరవుతారని తెలిపారు.

బైబిల్ పరీక్షకు 40 మంది హాజరు



ప్రశ్నపత్రాలను ఆవిష్కరిస్తున్న కేంద్ర జీఎస్టీ ఇన్‌స్పెక్టర్

చినగంజాం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని అంబేడ్కర్‌నగర్‌లోని పెద్ద చర్చి వద్ద అంబేడ్కర్‌నగర్ పెద్దలు, ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు, యూత్ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి బైబిల్ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 40 మంది విద్యార్థులు హాజరైనట్లు నిర్వాహకులు మేకల మేషక్‌బాబు తెలిపారు. బైబిల్ ప్రశ్న పత్రాలను కేంద్ర జీఎస్టీ ఇన్‌స్పెక్టర్ మేడికొండ సూరిబాబు ఆవిష్కరించినట్లు తెలిపారు. ఇన్విజిలేటర్‌గా గేరా ఆషా వ్యవహరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు, యూత్ సభ్యులు మల్లేశ్వరరావు, బడుగు విజయ్, మార్పు జాకబ్‌రాజు పాల్గొన్నారు

అగ్నిప్రమాదం.. రూ.2లక్షల ఆస్తి నష్టం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

అద్దంకి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదం చోటు చేసకొని సుమారు 2 లక్షల రూపాయల ఆస్తినష్టం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. అద్దంకి పట్టణంలోని శింగరకొండ రోడ్డులో కొత్తదామావారిపాలెం సమీపంలో షేక్ షాజహాన్ పాత సామానుల దుకాణం నిర్వహిస్తున్నారు. దుకాణం వద్ద వెల్డింగ్ మిషన్‌తో కటింగ్ చేస్తుండగా రవ్వలు సమీపంలో ఉన్న అట్టలపై పడడంతో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక యంత్రం ద్వారా మంటలను ఆర్పారు. సుమారు రూ.2లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు.


12 మద్యం సీసాలు పట్టివేత

చీరాలటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మద్యం సీసాలను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అందిన సమాచారం మేరకు మండల పరిధిలోని జాండ్రపేట గ్రామంలో పలు చోట్ల దాడులు నిర్వహించి వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ విక్రయాలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ నాగేశ్వరరావు హెచ్చరించారు.

ప్రసవ వేదనతో తల్లడిల్లిన గోమాత

- పొట్ట ప్లాస్టిక్‌తో నిండి ఉండడంతో అప్పటికే మృతి చెందిన దూడ
- సపర్యలు చేసిన స్థానికులు

చీరాలటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నోరులేని గోమాత ప్రసవ వేదనతో తల్లడిల్లింది. అయితే చుట్టుపక్కల వారు నానా తంటాలు పడి కాన్పు చేయగా పొట్టలోని చిన్న గోమాత అప్పటికే మృతి చెంది ఉండడంతో పలువురి హృదయాలను కలచి వేసింది. ఈ ఘటన చీరాల పరిధిలోని పట్టాభి స్వీట్స్ సమీపంలోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే నెలలు నిండిన గోమాత రోడ్డుపై కుప్పకూలి ప్రసవ నొప్పులు పడుతోంది. దీంతో సమాచారం అందుకున్న గోపరిరక్షణ ప్రతినిధులు సంఘటనా స్థలానికి చేరుకుని కాన్పు చేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో వారు ప్రభుత్వ పశు వైద్యులు డా.చిట్టిబాబుకు సమాచారం చేర వేశారు. దీంతో ఆయన ప్రజల సహకారంతో పొట్టలోనే మృత్యువాత పడిన చిన్న గోమాతకు కాన్పుచేశారు. అంతే కాకుండా పొట్ట నిండా ప్లాస్టిక్‌తో నిండి ఉండడం చూసి ఆశ్చర్యపోయారు. పొట్టను శుభ్ర పరచి వైద్యం అందించారు. ఈసందర్భంగా గో పరిరక్షణ ప్రతినిధులు మాట్లాడుతూ యజమానులు జీవాలను రోడ్డుపైకి వదల రాదని కోరారు. తద్వారా వాటికి ప్రాణాపాయం పొంచి ఉన్నట్లు వివరించారు. మునిసిపల్ అధికారులు ఇటువంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో డా. శబరి, ప్రతినిధులు నాయన రమణారెడ్డి, పులి సాంబశివరావు, పెనుగొండ శ్రీనివాసరావు, పదవ తరగతి విద్యార్థి ప్రవీణ్, రామ మందిరం వెనుక బజార్ మహిళలు పాల్గొన్నారు.



జగన్ లంచాలపై విచారణ జరపాలి

- అదానీ దగ్గర రూ.1750 కోట్లు తీసుకుంటే..
- మరి మిగిలిన వారి నుంచి ఎంత తీసుకున్నారో..?
- ఆక్వా డెవలప్‌మెంట్ బోర్డు కోవైస్ చైర్మన్ ఆనం

నెల్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : 'తొమ్మిది వేల మెగా వాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలుకు అదానీ నుంచి జగన్మోహన్‌రెడ్డి రూ.1750 కోట్లు లంచాలు తీసుకుంటే.. ఇక మిగిలినవారి నుంచి ఎన్ని వేల కోట్లు లంచం తీసుకున్నారో..? బయటకు రావాలి. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరపాలి' అని ఆక్వా డెవలప్‌మెంట్ బోర్డు కో వైస్‌చైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'అంతర్జాతీయ స్థాయి క్రిమినల్‌గా ఎదిగిన జగన్మోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు' అంటూ కేక్ కట్ చేసి వినూత్న రీతిలో వెంకటరమణారెడ్డి నిరసన తెలిపారు.

● టీడీపీ నాడే చెప్పింది..!

'సీఎం హోదాలో చంద్రబాబు అనేకమంది పారిశ్రామిక వేత్తలను కలుస్తున్నారు. ఎవరెవరిని కలిశారు..? ఎందుకు కలిశారు..? అన్న వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తున్నాం. కానీ సీఎంగా ఉన్నప్పుడు జగన్మోహన్‌రెడ్డి, అదానీలు మూడుసార్లు సమావేశమయ్యారు. ఈ సమావేశాల్లో ఏం మాట్లాడుకున్నారన్న విషయాలు ప్రజలకు చెప్పలేదు. మూడోసారి సమావేశం జరిగాక సోలార్ విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందం ఫైల్స్ పరిగెత్తాయి. సోలార్ విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందం మోసమని టీడీపీ మొదటి నుంచీ చెబుతూనే ఉంది. ఇప్పుడు అమెరికా దర్యాప్తు సంస్థలు ఈ విషయాన్ని ధ్రువీకరించాయి.. అని ఆనం వెంకటరమణారెడ్డి వ్యాఖ్యానించారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఆనం వెంకటరమణారెడ్డి

● జగన్ ఎందుకు స్పందించడం లేదు..?

'రూ.1750 కోట్లు ఎక్కడ దాచారు..? భారతీ సిమెంట్, సాక్షి మీడియాలో పెట్టుబడులు పెట్టారా..? లేక డైమండ్లు, కొకైన్ రూపంలో దాచి పెట్టారా..? లేక ఎన్నికల్లో ఖర్చు చేశారా..? అన్నది కూడా బయటకు రావాలి. సెకీతో ఒప్పందాలు చేసుకున్నప్పుడు రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ట్రిబ్యునల్ చైర్మన్‌గా హైకోర్టు రిటైర్డ్ జడ్జి, కడప జిల్లా వాసి నాగార్జునరెడ్డి ఉన్నారు. అధిక ధరకు సోలార్ విద్యుత్ కొనుగోలుకు ఒప్పందం చేసుకుంటుంటుంటే ఆయనెందుకు సంతకం చేశారు..? దీనిపై నాగార్జునరెడ్డి బయటకు వచ్చి సమాధానం చెప్పాలి. ప్రతీ విషయానికి బయటకొచ్చి ప్రెస్‌మీట్ పెట్టే జగన్మోహన్‌రెడ్డి ఈ విషయంలో ఎందుకు బయటకు రావడం లేదు..? నేను తప్పు చేయలేదని ఆయన ఎందుకు చెప్పలేకపోతున్నారు..? ఇకనైనా జగన్‌పై ఉన్న కేసులను వేగవంతం చేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని వెంకటరమణారెడ్డి అభ్యర్థించారు.

నారాయణ దృష్టి... నవయంత్రం సృష్టి !

- రైతులకు ఉపయోగపడేలా ఉపకరణాల తయారీ
- చదివింది తొమ్మిదో తరగతి మాత్రమే..
- ఆటోమొబైల్ ఇంజనీర్‌లా నూతన ఆవిష్కరణలు

ఆ యువకుడు ఆటో మొబైల్ ఇంజనీరేంకాదు.. చదివింది తొమ్మిదో తరగతి మాత్రమే. అయితే, అతని చేతిలో రూపొందిన మినీట్రాక్టర్, టిల్లర్లు, కల్టివేటర్లు చూసి పలువురు అబ్బురపడుతున్నారు. ఆలోచనకు సృజనాత్మకత తోడైతే చక్కని ఆవిష్కరణలు వస్తాయని నిరూపించాడు పొదలకూరు అయ్యప్పనగర్‌కి చెందిన బోడేలు పెంచలయ్య రెండో కుమారుడు పెంచల నారాయణ. ఆ యువకుడికి చదువుపై ఆసక్తి లేకపోవడంతో తండ్రి నిర్వహిస్తున్న వెల్డింగ్ దుకాణంలో చేదోడువాదోడుగా ఉంటున్నాడు.

● ఆటో పరికరాలతో ట్రాక్టర్ తయారీ

పెంచల నారాయణ తండ్రితోపాటు దుకాణంలో వెల్డింగ్ పనులు చేస్తూనే.. రిపేరుకు వచ్చిన యంత్రం ఎలా పని చేస్తోందని నిశితంగా పరీక్షించే వాడు. విక్రయానికి వచ్చే ఆటో, మోటారు సైకిల్ స్పేర్‌పార్ట్స్‌ను తక్కువ ధరకు కొనుగోలు చేసి భద్రపరిచేవాడు. ఖాళీ సమయంలో తన ఆలోచనకు పదును పెడుతూ సైకిల్ స్కూటర్‌ను రూపొందించాడు. మూడు నెలలు శ్రమించి ఆటో పరికరాలతో ట్రాక్టరును తయారు చేశాడు. దానికి అనుకూలంగా ఉండేలా హైడ్రాలిక్ సిస్టంతో పనిచేసే కల్టివేటర్‌ను తయారుచేశాడు. ఆ యువకుడు తయారు చేసిన మినీట్రాక్టర్, కలుపు తీసేందుకు ఉపయోగించే కల్టివేటర్, టిల్లర్ , ఇతర పరికరాలు అంతర్ సేద్యానికి ఉపయోగపడుతున్నట్లు గుర్తించిన రైతులు వాటిని విరివిగా కొనుగోలు చేస్తున్నారు.



మినీ ట్రాక్టర్‌ను నడుపుతున్న పెంచలనారాయణ

\- పొదలకూరు, (ఆంధ్రజ్యోతి)

తక్కువ ధరకు అందించాలని..

వ్యవసాయంలో పెట్టుబడులు ఎక్కువ అవుతుండటాన్ని గుర్తించి, తక్కువ ధరకే అంతర్ సేద్యానికి ఉపయోగపడే యంత్రాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నా. వెడల్పు తక్కువ ఉన్న బొప్పాయి, అరటి, నిమ్మ, మామిడి, జామ తోటల్లో అంతర్ సేద్యానికి ఉపయోగపడేలా మినీ ట్రాక్టర్ తయారుచేశా. దున్నేందుకు ఉపయోగించే కల్టివేటర్, టిల్లర్లను రైతులు తీసుకెళుతున్నారు. వరిలో కలుపు తీసే యంత్రాన్ని తయారు చేశా. రూ.600 ఖర్చుతో మూడు ఎకరాల్లో కలుపు తీసేందుకు ఈ యంత్రం పనికొస్తుంది. మినీ ట్రాక్టరు తయారీకి రూ.25వేల నుంచి రూ.40వేల వరకు ఖర్చు అయింది. మరిన్ని కొత్తకొత్త యంత్రాలను రూపొందించేందుకు ప్రయత్నిస్తున్నా.

\- బోడేలు పెంచల నారాయణ

ఎందుకీ నిర్లక్ష్యం ?

- గుంతలమయంగా పొదలకూరు రోడ్డు
- ఏడాది క్రితం రూ.6 కోట్లతో టెండర్లు
- నేటికీ ప్రారంభం కాని పనులు
- చలనంలేని ఆర్‌అండ్‌బీ అధికారులు
- నగర ప్రజలకు తప్పని అవస్థలు



నెల్లూరులోని పొదలకూరు రోడ్డులో ఏర్పడిన గుంతలు

నెల్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని.. అన్నట్లుగా తయారైంది నెల్లూరు నగరంలో పొదలకూరు రోడ్డు పరిస్థితి. దారుణంగా దెబ్బతిన్న ఈ రోడ్డును బాగు చేసేందుకు ఏడాది క్రితం అనుమతులు లభించాయి. వెంటనే టెండర్లు పూర్తయి అగ్రిమెంట్ కూడా జరిగింది. ఎట్టకేలకు రోడ్డును బాగు చేస్తున్నారని నెల్లూరు నగర ప్రజలంతా సంతోషించారు. కానీ ఏడాదైనా ఇంత వరకూ పనులు మొదలుపెట్టలేదు. ప్రభుత్వం కూడా మారిపోయింది. అయినా అటు కాంట్రాక్టర్‌లోకానీ, ఇటు ఆర్‌అండ్‌బీ అధికారుల్లో కానీ చలనం లేదు. పనులు చేయాల్సిన కాంట్రాక్టర్, చేయించాల్సిన అధికారులు దర్జాగా తిరుగుతుండగా నెల్లూరు నగర ప్రజలు మాత్రం నరకయాతన అనుభవిస్తున్నారు.

నెల్లూరు నగరంలోని పొదలకూరు రోడ్డు అత్యంత రద్దీ రహదారి. సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాల ప్రజలే కాకుండా కడప జిల్లా నుంచి కూడా నిత్యం వేలాదిమంది ఈ రోడ్డు మీదుగానే నెల్లూరు నగరంలోకి ప్రవేశిస్తుంటారు. ఇక నెల్లూరులో కూడా నాలుగో వంతు భాగం ప్రజలు ఈ రోడ్డు మీదనే ప్రయాణిస్తుంటారు. ట్రాఫిక్ పెరిగిపోవడంతో ఆ రోడ్డు గుంతలమయంగా మారింది. గత ప్రభుత్వంలో నిర్వహణ లేకపోవడంతో మరీ దారుణంగా తయారైంది. డీకేడబ్ల్యు కాలేజీ నుంచి డైకస్ రోడ్డు సెంటర్ వరకూ విస్తరించి నాలుగు వరుసల రోడ్డు వేయాలన్న ప్రతిపాదన చాలా కాలం నుంచి ఉంది. అయితే నాలుగేళ్ల క్రితం పశ్చిమ వైపు రోడ్డు బాగు చేసేందుకు మాత్రమే నిధులు మంజూరయ్యాయి. అప్పుడు రోడ్డు వేసినప్పటికీ కొద్ది రోజులకే మళ్లీ దెబ్బతిన్నది. సైడు కాలువలు లేకుండా నిర్మాణం చేస్తున్నారని, దీని మూలంగా రోడ్డుపై నీళ్ల నిలబడి దెబ్బతినే ప్రమాదముందని నాడే 'ఆంధ్రజ్యోతి' హెచ్చరించినా అధికారులు పట్టించుకోలేదు. ఊహించిన విధంగానే వేసిన రోడ్డుతో పాటు తూర్పు వైపున ఉన్న రోడ్డు నీళ్ల నిలబడి మరింత గుంతలమ యంగా మారింది. పశ్చిమ, తూర్పు వైపు రోడ్డు ఎగుడుదిగుడుగా మారిపోవడంతో వాహనాదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● నిధులు మంజూరైనా..

అయితే అనేక విజ్ఞప్తుల తర్వాత ఎట్టకేలకు తూర్పు వైపు రోడ్డును కూడా అభివృద్ధి చేసేందుకు గతేడాది సుమారు రూ.6 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు టెండర్లు పూర్తి చేశారు. పశ్చిమ వైపు రోడ్డు వేసిన కాంట్రాక్టరే తూర్పు వైపు రోడ్డు వర్కును కూడా దక్కించుకున్నారు. అప్పటి నుంచి పనులు మొదలు పెట్టి ఉంటే ఈ పాటికి రోడ్డు పని పూర్తయ్యేది. కానీ ఏడాది గడిచినా పనులు ప్రారంభించలేదు. ఏడాది నుంచి కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టకపోయినా ఆర్‌అండ్‌బీ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చి పనులు మొదలు పెట్టించాల్సిన అధికారులే ఆ కాంట్రాక్టర్‌కు వత్తాసు పలుకుతుండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. మరో వైపు పొదలకూరు రోడ్డుకు సెంట్రల్ డివైడర్ నిర్మాణానికి సంబంధించి సుమారు రూ.1.50 కోట్లతో గత నెలలో టెండర్లు పిలిచిన నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు.. వెంటనే పనులు కూడా ప్రారంభించారు. ప్రస్తుతం పనులు కూడా జరుగుతున్నాయి. కాగా ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ నెల్లూరు ఈఈ మురళీకృష్ణను వివరణ కోరగా కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు మొదలుపెట్టిస్తామని పేర్కొన్నారు.

గుక్కెడు నీళ్లివ్వండి సార్...!



ఉదయగిరి మండలం జీ.చెర్లోపల్లి ప్రాథమిక పాఠశాలలో మరమ్మతులకు గురైన శుద్ధిజల కేంద్రం

- విద్యార్థుల వేడుకోలు
- పాఠశాలల్లో పనిచేయని వాటర్ ప్లాంట్లు
- రూ. కోట్ల నిధులు నీళ్లపాలు
- తాగునీరు దొరక్క స్టూడెంట్ల ఇక్కట్లు
- ప్రస్తుతం పనిచేస్తున్నవి 641
- నిరుపయోగంగా 113 ప్లాంట్లు
- 'నాడు-నేడు' పథకం అపహాస్యం

నెల్లూరు(విద్య), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయలు కల్పించి, కార్పొరేట్లకు దీటుగా తీర్చిదిద్దుతామని చేపట్టిన నాడు-నేడు కార్యక్రమం విమర్శలకు తావిస్తోంది.ముఖ్యంగా తాగేందుకు నీరు లేక విద్యార్థులు పడేపాట్లు వర్ణణాతీతం. జిల్లాలో రూ.కోట్లు వెచ్చించి పాఠశాలల్లో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్‌లు దిష్టిబొమ్మల్లా మిగిలాయి. విద్యార్థులకు తాగునీరు అందని ద్రాక్షలా మారింది. గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌లు నేడు అత్యధిక పాఠశాలల్లో నిరుపయోగంగా మారాయి.

● 1,059 స్కూళ్లల్లో ప్లాంట్లు

గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 1,059 పాఠశాలల్లో తాగునీటి కోసం మినరల్ వాటర్ ప్లాంట్ల ఏర్పాటుకు యంత్రాలు, పరికరాలను సమకూర్చింది. వీటి నిర్వహణకు రూ.40 కోట్లకుపైగా వెచ్చించింది. వీటిల్లో సుమారు 800కిపైగా పాఠశాలల్లో నిర్వహణ లేకపోవడంతో యంత్రాలన్నీ పనిచేయలేదు. మరికొన్ని ప్రాంతాల్లో వీటిని పూర్తిగా మూలన పడేశారు. వీటిలో కొన్ని ప్లాంట్‌లను దాతలు ఏర్పాటు చేయగా, మిగిలినచోట్ల ప్రభుత్వం టెండర్ల ద్వారా సంస్థలను ఆహ్వానించి ఏపీఈడబ్ల్యుఐడీసీ ద్వారా ఏర్పాటుకు అనుమతులిచ్చింది.

● ఏర్పాటుకు నిబంధనలు

విద్యార్థుల సంఖ్య, ఆయా పాఠశాలల్లోని నీటిలో లవణీయత, ఫ్లోరైడ్ శాతాన్ని బట్టి వాటర్‌ప్లాంట్‌లను ఏర్పాటు చేశారు. 200 మందిలోపు పిల్లలున్న బడిలో రూ.లక్ష విలువ చేసే యంత్రాన్ని, 300 మంది విద్యార్థులు కలిగి, నీటిలో టీడీఎస్ శాతం ఎక్కువగా ఉంటే రూ. రెండులక్షల నుంచి రూ. మూడు లక్షల విలువైన యంత్రాలను ఏర్పాటు చేశారు. 800 మందికిపైగా విద్యార్థులుండే పాఠశాలల్లో రూ.నాలుగు నుంచి రూ. ఐదు లక్షల విలువ చేసే ప్లాంట్‌లను సమకూర్చారు. ఇంత ఖర్చుచేసినా ఇవి విద్యార్థులకు ఉపయుక్తం లేకుండా పోయాయి. కాగా మూలన పడిన 800 ప్లాంట్లలోని కొన్నింటిని కూటమి ప్రభుత్వం వచ్చాక మరమ్మతులు చేయించింది. తాజాగా జిల్లాలో 641 ప్లాంట్‌లు పనిచేస్తుండగా, 113 ప్లాంట్‌లు నిరుపయోగంగా ఉన్నాయి.

● తాగునీరు లేక విద్యార్థుల ఇక్కట్లు

జిల్లాలో 2,688 ప్రాథమిక, 361 ప్రాథమికోన్నత, 418 ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 3,467 ప్రభుత్వ బడులున్నాయి. వీటిల్లో సుమారు నాలుగు లక్షల మంది చదువుతున్నారు. నాడు-నేడు పనులు చేపట్టిన పాఠశాలలతో పాటు మిగిలిన బడుల్లో కూడా నీటి సమస్య తీవ్రంగా ఉంది. 90శాతం మంది విద్యార్థులు ఇళ్ల నుంచే సీసాల్లో నీరు తెచ్చుకుంటున్నారు. మిగిలిన చిన్నారులు కుళాయిలు, బోర్లను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ఫ్లోరైడ్ నీటినే విద్యార్థులు తాగుతు న్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ప్రతి ఒక్కరూ కనీసం రోజుకు మూడు లీటర్ల నీటిని తాగాలి. పాఠశాల సమయంలో విద్యార్థులు రెండు లీటర్ల నీటిని తాగాలి. అయితే స్కూళ్లలో నీరు లేకపోవడం, బయట నీరు తెచ్చుకునే అవకాశాలు లేకపోవడంతో వెంట తీసుకెళ్లిన సీసాలోని నీటితోనే రోజంతా సర్దుకోవాల్సి వస్తున్నది. లేదా బయట దొరికే స్వచ్ఛత లేని నీటిని తాగాలి. దీనివల్ల శరీరంలో పలు మార్పులు చోటుచేసుకుని, అనారోగ్యం పాలవుతున్నారు.

ప్లాంట్లను వేగంగా పునరుద్ధరిస్తాం..

జిల్లాలోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లలో మరమ్మతులకు గురైన వాటిని గుర్తించి, వెంటనే వివరాలు పంపాలని హెచ్‌ఎంలను ఆదేశించాం. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే సత్వరమే పరిష్కరించి ప్లాంట్‌లన్నింటినీ వినియోగంలోకి తీసుకువస్తాం. విద్యార్థులను నిత్యం తాగునీరందించేలా చర్యలు తీసుకుంటాం.

\- .ఉషారాణి, సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్

ఐదేళ్లుగా నిర్లక్ష్యంగా వదిలేశారు..

వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి): స్థానిక హైస్కూల్‌లో ప్లాంట్ పనిచేస్తున్నా బోరులో నీళ్ల లేవనే సాకుతో ఆర్వో ప్లాంట్‌ను వినియోగించకుండా మూలపడేశారు. దీంతో సామగ్రి తుప్పుపట్టి పోయాయి. హెచ్‌ఎం నిర్లక్ష్యంతోనే రూ. లక్షలు విలువ చేసే ప్లాంట్ వృథాగా ఉంది. ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకొచ్చి విద్యార్థులకు మినరల్ వాటర్‌ను అందించాలి,



వలేటివారిపాలెం హైస్కూల్‌లో నిరుపయోగంగా ఆర్వో ప్లాంట్

సొగసులే పెట్టుబడిగా...
వలపు వల !

అమ్మ చందమామను చూపించి చిన్నారులకు అన్నం పెట్టేరోజులు పోయాయి. సెల్‌లో రీల్స్ చూపిస్తూ భోజనం తినిపించే రోజులు వచ్చేశాయి. విద్యార్థులను ఫోన్లకు దూరంగా ఉండాలని చెప్పే రోజుల నుంచి ఆన్‌లైన్ క్లాసులకు సెల్‌ఫోన్ తప్పనిసరన్న కాలం వచ్చేసింది. టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ ప్రపంచమంతా సెల్‌ఫోన్ రూపంలో అరచేతిలోకి వచ్చేసింది. సెల్‌వల్ల మంచి కంటే చెడు ఎక్కువ జరుగుతోంది. ప్రస్తుతం 13 ఏళ్లు దాటిన వారి నుంచి 30 ఏళ్లలోపు యువత హనీ ట్రాప్, న్యూడ్ వీడియో కాల్స్ ఉచ్చులో చిక్కుకొని భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు.

\- నెల్లూరు(క్రైం),ఆంధ్రజ్యోతి)

- హనీ ట్రాప్‌లో చిక్కుకుంటున్న యువత
- వాట్సప్‌లో హాయ్.. అంటూ మెసేజ్‌లు
- ఆపై న్యూడ్ వీడియో కాల్స్‌తో ఆకర్షణ
- అనంతరం రికార్డింగ్ చేసి బ్లాక్‌మెయిల్
- అడిగినంత నగదు చెల్లించాలని డిమాండ్
- ఏఎస్పీకి జనసేన ఫిర్యాదు

సెల్ రింగ్ అవుతుంది... ఎత్తి హలో ఎవరు.. అనగానే ఓ మహిళ 'హలో మాట్లాడేది రాముయేనా..' అంటూ తియ్యటి గొంతుతో పలుకరిస్తుంది. కాదని చెప్పడానికి కొందరి మనసులు అంగీకరించక పోయినా, నాపేరు పలానా అంటూ చెబుతారు.... వెంటనే ఆ మహిళా సారీ.. అండీ రాంగ్ కాల్... అంటూ ఫోన్ కట్ చేస్తుంది. ఇక రాత్రి అదే నెంబర్ నుంచి వాట్సప్‌లో సారీ వేరేవారికి ఫోన్ చేయబోయి మీకు చేశా..నంటూ ఓ మెసేజ్ వస్తుంది. యువత రేసుగుర్రాల్లా ఆ.. పర్లేదండీ అంటూ గొంతుకలుపుతారు. ఇంకేముంది రెండు,మూడు రోజులు వాట్సప్‌లో గంటల తరబడి మాటలు... ఫొటోలు పంపుకోవడం చేస్తారు. ఇక నాలుగోరోజు రాత్రి అసలు కథ మొదలవుతుంది. మాటలు దాటి ఇక నేరుగా వీడియో కాల్‌లో మాట్లాడుకుందామా.. అన్న చాటింగ్ ప్రారంభమవుతుంది అందుకు ఆ మహిళ సరేనంటూ మెసేజ్ పెడుతుంది. వీటితోపాటు ఫోన్‌కు ఓ లింక్ రావడం... అవి ఓపెన్ చేస్తుంటే నేరుగా మహిళల ఫోన్ వీడియోకాల్ రింగ్ అవుతుంది. దీంతో ఆ మహిళ మాటలు కలిపి కొంచెం కొంచెం దుస్తులు విప్పుతూ యువకులను ఆకర్షిస్తారు. చివరిగా బ్రా వరకు చూపించి ఇకపై దుస్తులు విప్పాలంటే ఖాతాకు నగదు పంపాలంటూ చెబుతారు. అప్పటికే ఉద్రేకపడిన యువకులు ఖాతాకు నగదు పంపుతూ న్యూడ్ వీడియో కాల్‌లో మాట్లాడారు.

● అసలు అనుమానించరు..

వాట్సప్‌లో మాట్లాడుతున్నది అసలు మహిళా... కాదా అన్న విషయాన్ని కూడా యువకులు అనుమానించరు, ఆలోచించరు. ఇక వీడియో కాల్‌లో మాట్లాడుతూ మాట్లాడుతూ చాలా దూరమే వెళ్లిపోతారు. ఏవేవో వికృత చేష్టలు చేస్తుంటారు. వీటిని అవతల వారు రికార్డ్ చేస్తూ ఉంటారు. ఇలా రెండు,మూడు రోజులు యువకులు మాట్లాడిన బూతు మాటలు, వికృత చేష్టాలు అన్నీ గంటల సమయం రికార్డ్ అవుతాయి. ఇక వారు ఆడుతున్న ఆటకు ముగింపు పలికే సమయం వచ్చేసింది. దీంతోపాటు వారు పంపే లింక్‌లన్నింటికి ఓకే కొడుతూ ఉండటంతో మన ఫోన్‌లోని కాంటాక్ట్ నెంబర్లు, ఫేస్‌బుక్, ట్విట్టర్ ఇలా అనేక సామాజిక మాధ్యమాలన్నింటిలో వారు చొరబడి పోతున్నారు. చివరికి మన గుట్టు మొత్తం వారి చేతుల్లోకి వెళ్లిపోతుంది.



ఏఎస్పీకి జనసేన ఫిర్యాదు

ఇలాంటి వీడియో కాల్స్ రికార్డింగ్‌పై జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ ఇటీవల ఏఎస్పీ సీహెచ్ సౌజన్యకి ఫిర్యాదు చేశారు. ఎంతో మంది యువకులు ఈ ట్రాప్‌లో పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. వెంటనే చర్యలు చేపడతామని ఏఎస్పీ హామీ ఇచ్చారు.

ఫిర్యాదు చేస్తే వివరాలు గోప్యం



ఎవరైనా సైబర్ నేరాల బారినపడి నష్టపోతుంటే..లేక వేధింపులకు గురవుతుంటే... సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి. మీ వివరాలను గోప్యంగా ఉంచి విచారణ చేపడతాం. ఇప్పటికే హనీట్రాప్, న్యూడ్ వీడియో కాల్స్ వంటి సైబర్ నేరాలపై జిల్లాలోని యువతకు పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.

\-జీ కృష్ణకాంత్, జిల్లా ఎస్పీ

● వీడియోలు పంపి బెదిరింపులు

ఇక ఉదయాన్నే వాట్సప్ ఆన్ చేస్తూనే ఓ వీడియో వస్తుంది. ఆ వీడియోను చూస్తూనే మనవారికి గుండె పగిలిపోతుంది. వారు చేసిన వికృత చేష్టలను వారే చూసుకుని ఛా... నేను ఇంతలా చేశానా... అనుకొని బాధపడుతూ వీడియోను డిలేట్ చేయండి.. అని మెసేజ్ పెడతారు. వెంటనే ఓ ఫోన్ వస్తుంది. హలో అనగానే.. ఎలా ఉన్నాయి వీడియోలు... మీరు మంచి రసికులే.. వీడియో కాల్‌లోనే ఎంతలా చేస్తున్నారు...అంటారు. ఎవరుమీరని ప్రశ్నిస్తే అవన్నీ నీకు అనవసరం.. నా అకౌంట్ నెంబరు పెడతాను వెంటనే నగదు వేయాలి.. లేకుంటే వీడియోను మీ ఫోన్ కాంటెక్ట్‌లో ఉన్న నెంబర్ల వాట్సప్‌కు, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో పెడతాను.. అంటూ బెదిరింపులు ప్రారంభమవుతాయి. చేసేది లేక కొందరు డబ్బులు అకౌంట్‌లో డబ్బులు వేస్తే... మరి కొందరు బేరాలు ఆడి కొంత నగదు వేసి తప్పించుకుంటారు.

● నగదు కోసం చోరీలకు పాల్పడుతూ...

బ్లాక్‌మెయిల్ చేసే వారు అడిగినంత నగదు ఇవ్వలేక, న్యూడ్ వీడియో కాల్స్‌కు బానిసలుగా మారిన యువత ఇంట్లోని బంగారు నగలను, నగదును గుట్టుచప్పుడు చోరీ చేసి తీసుకెళుతున్నారు. ఆ నగలను కుదవ వ్యాపారులకు, ప్రైవేటు సంస్థల్లో కుదవ పెడుతున్నారు. నగలు కుదవ పెట్టుకొని నగదు ఇవ్వక పోవడంతో మధ్యవర్తులు యువతకు దగ్గరవుతున్నారు. వారి పేరుపై నగలను కుదవ పెట్టించి నగదు ఇస్తున్నారు. అయితే ఈ విషయాలు కుటుంబసభ్యులకు తెలిసిపోతుండడంతో యువత మానసికంగా చితికిపోతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. జిల్లాలో ఇలాంటి సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. అయితే బాధితులు ఎవరూ కూడా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసేందుకు, కుటుంబసభ్యులకు చెప్పుకునేందుకు ముందుకు రావడం లేదు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు


మాలకొండ ప్రజలతో మాట్లాడుతున్న ఫారెస్టు ఆఫీసర్ సురేష్

వలేటివారిపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఫారెస్టు ఆఫీసర్ సురేష్ హెచ్చరించారు. ఆదివారం మాలకొండలో జాతీయ రహదారి సమీపంలో నిర్మిస్తున్న కట్టడాలను ఆయన పరిశీలించారు అటవీ, దేవదాయ, రెవెన్యూ శాఖల స్థలాలను కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ప్రభుత్వ స్థలంలోని చెట్టు నరికివేసిన వ్యక్తిపై కేసు పెడతామన్నారు. అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాల్లోని చెట్లు నరికినా చర్యలు తప్పవన్నారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు


టీడీపీ సభ్యత్వాలు చేయిస్తున్న నాయకులు

ఆత్మకూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ లోని 19వ వార్డులో దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలతో టీడీపీ సభ్యత్వాలు ఆదివారం ము మ్మరంగా ప్రారంభించారు. ప ట్టణ అధ్యక్షుడు తుమ్మల చం ద్రారెడ్డి, జిల్లా తెలుగు యువత నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, వైస్ చైర్మన్ సర్దార్ ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వాలు చేయించారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు కౌన్సిలర్ గందర్ల వేణు, సయ్యద్ అస్లాం, బీసీ నాయకులు వలిపి వెంకటయ్య, సుబ్బరాయుడు, సుబ్బయ్య, తిరుపాలు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

ఉదయగిరి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని టీడీపీ మండల నాయకులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గంగిరెడ్డిపల్లి గ్రామంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి నివాసంలో వారు విలేఖరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి, సభ్యత్వం తీసుకుంటే కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించి సభ్యత్వాల నమోదు చేపట్టాలన్నారు. సభ్యత్వాల నమోదులో ఉదయగిరి నియోజకవర్గాన్ని రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్బారెడ్డి, ఓబులరెడ్డి, మాబాషా, మట్ల లక్ష్మయ్య, రామయ్య, బాబు, రాజా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు పనుల ప్రారంభం


ముత్తరాశిపాలెంలో చేస్తున్న సిమెంట్ రోడ్డు పనులు

సంగం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముత్తరాశిపాలెంలో ఎన్ఆర్ఈజీయస్ నిధులు రూ. 10 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ఆదివారం ప్రారంభించారు.కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, టీడీపీ నాయకులు కర్నాటి రవీంద్ర రెడ్డి, క్లస్టర్ ఇన్చార్జి బాణా శ్రీనివాసులురెడ్డి, మాఘం గిరిబాబు, చరణ్‌రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులకు రూ.1.25 కోట్లు మంజూరు

కలువాయి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాలుగు రోడ్ల మరమ్మతు పనులకు గాను రూ.1.25 కోట్లు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులకు త్వరలో రోడ్లు, భవనాల శాఖ అధికారులు టెండర్లు పిలవనున్నారు. ఆదూరుపల్లి సెంటర్ నుంచి పెంచలకోన రోడ్డు మరమ్మతులకు రూ.50లక్షలు, పొదలకూరు-సోమశిల రోడ్డు నుంచి చవటపల్లి, వెదనపర్తి మీదుగా వెరుబొట్లపల్లి రోడ్డుకు రూ.30లక్షలు, పొదలకూరు-సోమశిల రోడ్డు నుంచి చింతలాత్మకూరు రింగ్ రోడ్డుకు రూ.25 లక్షలు, పొదలకూరు-సోమశిల రోడ్డు నుంచి సీతారాంపల్లి, రామన్నగారిపల్లె, చింతలపాళెం మీదుగా రోడ్డుకు రూ.20లక్షలు మంజూరయ్యాయి. పొదలకూరు-సోమశిల మెయిన్‌రోడ్డుకు ఇప్పటికే రూ.12లక్షలతో వెంకటరెడ్డిపల్లి, కలువాయి టౌన్‌లో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చొరవతో ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్‌సీసీ దినోత్సవం



సర్టిఫికెట్లను అందజేస్తున్న శానం హరి, కల్లయ్య

కావలి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంగళ రావు నగర్‌లోని పొట్టి శ్రీరాములు మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానో పాధ్యాయులు హయ్యూల్ హయామ్ అధ్యక్షతన జరిగిన కార్య క్రమంలో ముఖ్య అతిథులుగా స్థానిక టీడీపీ వార్డు ఇన్‌చార్జి శానం హరి, పాఠశాల కమిటీ చైర్మన్ కల్లయ్య పాల్గొని కేడెట్లకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ థర్డ్ ఆఫీసర్ తిప్పిరెడ్డి కొండారెడ్డి, వైస్ చైర్మన్ చల్లా శ్రీను పాల్గొన్నారు.

జాతీయ రహదారులపై పశువుల సంచారం

● ప్రమాదాల బారిన వాహనదారులు


చింతలగుంట వద్ద గేదెను తప్పించబోయి బోల్తాపడ్డ మినీ లారీ (ఫైల్)


సోమగలరేగడ వద్ద వాహనం ఢీకొని మృతి చెందిన గేదె (ఫైల్)

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): దుత్తలూరు మండలంలోని 565, 167-బీజీ జాతీయ రహదారులపై పశువుల సంచారంతో ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. ప్రధానంగా రాత్రి సమయాల్లో రహదారులపై సంచరించే పశువులు దీపాల వెలుగులో కనిపించకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇటీవల మండలంలోని చింతలగుంట సమీపంలో 565 జాతీయ రహదారిపై ఓ మినీ లారీ గేదెను తప్పించబోయి బోల్తాపడడంతో డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయి. బ్రహ్మేశ్వరం, సోమగలరేగడ, శ్రీరామ్‌నగర్ వద్ద జరిగిన ప్రమాదాలలో గేదెలు మృత్యువాత పడడమే కాకుండా వాహనాలు దెబ్బతిన్నాయి. ఇలా రేయింబవళ్లు రహదారులపై పశువుల సంచారంతో అవి ప్రమాదానికి గురై అటు పాడి రైతులు, ఇటు వాహనదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పశు యజమానులు వాటిని సంరక్షించుకునేలా చర్యలు చేపట్టి ప్రమాదాలను నివారించాలని పలువురు కోరుతున్నారు.

ధ్యానం దివ్య ఔషధం

వింజమూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : లంకణం పరమ ఔషధం, ధ్యానం దివ్య ఔషధమని ఖమ్మం పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షురాలు గ్రాండ్ మాస్టర్ శైలజ అన్నారు. శ్రీవేదవ్యాసా వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాటాడుతూ ధ్యానంతో వ్యాధులు దూరమవుతాయన్నారు. డిసెంబరు 21వ తేదీ నుంచి 31 వరకు జరుగు పత్రీజీ ధ్యాన మహాయాగానికి అందరూ హాజరుకావాలని కోరారు. అనంతరం శాకాహారం గొప్పతనాన్ని వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారాయణరెడ్డి, హజరత్, చిన్న, రవిచంద్ర, వెంకటేశ్వర్లు ఆచారి, జానకిరామిరెడ్డి, అంకిరెడ్డి, సుప్రజా, ధ్యానులు పాల్గొన్నారు. శివకుమార్ చక్కటి ధ్యాన ప్రసాదం అందించారు.

అన్నదాతల్లో అలజడి

● వరి పైరుకు తెగుళ్లు ● తుఫాన్ హెచ్చరికలు
● పంటను రక్షించుకోవడానికి పాట్లు


వర్షం నుంచి పంటను రక్షించుకునేందుకు కప్పిన పట్టా

ఉదయగిరి రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన వరి పంట ప్రస్తుతం కోత దశకు వచ్చింది. కొన్ని ప్రాంతాల్లో కోతలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఓవైపు పంటపై తెగుళ్లు, మరోవైపు తుపాన్ హెచ్చరికలు అన్నదాతల్లో అలజడి రేపుతున్నాయి. కాండం తొలుచు, గొంగళి, లద్దె పురుగుల బెడద అధికంగా ఉంది. ఇటీవల వర్షాలు కురవడం, గాలిలో అధిక తేమ శాతం ఉండడంతో పొట్ట దశలో ఉన్న పంటకు అధికంగా నష్టం చేకూరుతుందని రైతులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరి పంట నేలకొరగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీనికితోడు తుపాన్ ప్రభావంతో ఈనెల 26, 27వ తేదీల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తుండడంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. ప్రస్తుతం ఉదయగిరి సబ్ డివిజన్‌లోని ఉదయగిరి, సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు, మర్రిపాడు మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి పంట కోత దశకు వచ్చింది. కొన్ని రోజుల్లో పంట కోత కోసి దిగుబడి ఇంటికి చేరుతుంది. కొంతమంది రైతులు కోత కోసి పంటను రక్షించుకొనే ప్రయత్నాలు చేస్తున్నారు. వర్షాలు ఇలానే కురిస్తే కోత దశలో ఉన్న పంట నేలవాలి వరి పంట గింజ మొలకెత్తి తీవ్రంగా నష్టపోయే ప్రమాదముంది. ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలోని సుమారు 500 ఎకరాల్లో జిలకర మసూర, బీపీటీ తదితర రకాల వరి పంట సాగు చేశారు. వారం రోజుల్లో పంట ఇంటికి చేరుతుందనగా తుపాన్ హెచ్చరికలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

మందులు పిచికారీ చేయాలి

కాండం, గొంగళి, లద్దె పురుగుల నివారణకు క్లోరిపైరిఫాస్ మందును 2.5 మిల్లీలీటర్లను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఉదయగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు పీ చెన్నారెడ్డి రైతులకు సూచించారు. తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో వరి కోతలు చేస్తే పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్


ఫాగింగ్‌ను పరిశీలిస్తున్న సర్పంచు నాగలక్ష్మి

ఉలవపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో దోమల బెడద నివారణకు ఆదివారం పంచాయతీ పారిశుధ్య సిబ్బంది ఫాగింగ్ చేపట్టారు. గ్రామ పంచాయతీ, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏరియాలో ఫాగింగ్ చేపట్టామని సర్పంచ్ నాగలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త అల్తాఫ్, పంచాయతీ పారిశుధ్య మేస్త్రీ పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

కలిగిరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రిష్టారెడ్డిపాలెం పంచాయతీ నరసారెడ్డిపాలెంలోని బెల్టుషాపుపై ఆదివారం ఎస్ఐ ఉమాశంకర్ దాడి చేసి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. మండలంలో ఎక్కడ బెల్టు షాపులు నిర్వహిస్తున్నా తమకు సమాచారం అందించాలని కోరారు. ఆయన వెంట కానిస్టేబుల్లు అశోక్, నరసింహ ఉన్నారు.

●కావలి రూరల్ : కొత్తపల్లిలో ఆదివారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి అనధికార మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కొత్తపల్లి చిమ్మిలి వెంకటేశ్వర్లు వద్ద ఉన్న 12మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులో తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ దేవిక, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ‘మంచిమాట’

ఆత్మకూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక తెలుగు భారతి సేవా సమితి సమావేశ మందిరంలో ఆదివారం మంచిమాట కార్యక్రమం నిర్వహించారు. ప్రతినెలా నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా జానపద కళలు అనే అంశంపై తెలుగు భారతి సేవా సమితి సభ్యుడు కొల్లా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జానపద కళలు సామాన్య ప్రజల జీవన పరిస్థితులను ప్రతిబింబిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు భారతి సేవాసమితి అధ్యక్షుడు సోమవరపు సుబ్బరాయుడు, గౌరవాధ్యక్షుడు అంకినపల్లె గోవిందరెడ్డి, సహాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సలహాదారులు ఎస్‌వి రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మర్రిపాడు మండల కమిటీ ఎన్నిక


రిటైర్డ్ ఉపాధ్యాయులను సన్మానించిన యూటీఎఫ్ నాయకులు

మర్రిపాడు, నవంబరు (ఆంధ్రజ్యోతి) 24: యూటీఎఫ్ మండల మహాసభ సందర్భంగా ఆదివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. మండల నూతన అధ్యక్షుడిగా పి విజయ్, ప్రధాన కార్యదర్శిగా కె సుధాకర్‌తో పాటు 15మందితో ఉపాధ్యాయులు కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు మోహన్‌ప్రసాద్, షేక్ నాయబ్ మాట్లాడుతూ పాఠశాలల పరిరక్షణ, ఉపాధ్యాయ సంక్షేమానికి యూటీఎఫ్ కృషిచేస్తోందని తెలిపారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు.

బలిజ కాపులకు అండగా ఉంటా

● ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి


ఎమ్మెల్యే కృష్ణారెడ్డిని సత్కరిస్తున్న బలిజ కాపు నేతలు

కావలి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బలిజకాపులకు తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక పెంకుల ఫ్యాక్టరీ గిరిజనకాలనీ తోట వద్దనున్న మండపంలో బలిజకాపు కార్తీక వనభోజన మహోత్సవం వైభవంగా జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేతో పాటు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటలు, సాంస్కృతిక పోటీల విజేతలకు వారు బహుమతులు అందజేశారు. చిన్నారులు, మహిళల చేసిన నృత్యాలు, కోలాటాలు అలరించాయి. సంఘం సభ్యులు ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, కేశవులనాయుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కార్తీక వనభోజనాలు

బిట్రగుంట, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో ఆదివారం వాసవీక్లబ్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు సంయుక్తంగా కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. పలుగ్రామాలకు చెందిన ఆర్యవైశ్యులు కుటుంబసమేతంగా పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. వనభోజనంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఉలిచి మల్లికార్జునరావు, గునుపూడి నరసింహారావు, ఇమ్మడిశెట్టి శ్రీనివాసులు, వాసవి క్లబ్ సభ్యులు ఉన్నారు.

కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు

● కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు


నాగరాజును శాలువాతో సన్మానించిన నాయకులు, కార్యకర్తలు

కందుకూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు తెలుగుదేశంలో గుర్తింపు ఉంటుందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరక్టర్‌గా నియమితులైన గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షుడు జనిగర్ల నాగరాజుకు ఆదివారం కందుకూరు పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీలో బీసీలకు మంచి గుర్తింపు ఉంటుందని నాగరాజు నియామకంతో రుజువైందన్నారు. అనంతరం యాదవ కార్పొరేషన్ డైరక్టర్ నాగరాజు మాట్లాడారు. తనకు ఈ పదవి రావటానికి కృషిచేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, రాచగర్ల సుబ్బారావు, చిలకపాటి మధుబాబు, చెరుకూరి సూర్యనారాయణ, షేక్ రఫీ, బెజవాడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో విద్యార్థినికి పాముకాటు

బిట్రగుంట, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి): కప్పరాళ్లతిప్పలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని పల్లవిని శనివారం ఉదయం పాఠశాల ఆవరణలో పులిపింజిరి పాము కాటు వేసింది. దీంతో ప్రిన్సిపాల్ పద్మాతి విద్యార్థిని కావలి వైద్యశాలకు తరలించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ప్రస్తుతం పల్లవి ఆరోగ్యంగా ఉందని ప్రమాదం లేదని వైద్యులు తెలిపినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


పొలంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌పార్మర్

ఉదయగిరి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతులకు ఆదివారం ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌ను ఏర్పాటుచేశారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి దినపత్రిలో ‘టాన్స్‌పార్మర్ల కష్టాలు’ అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ట్రాన్స్‌కో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్‌ను నెల రోజులుగా మార్చకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ట్రాన్స్‌పార్మర్‌ను ఆత్మకూరుకు తరలించి మరమ్మతులు చేయించి ఏర్పాటు చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

మరమ్మతులకు నోచుకోని చెరువులు


● సాగునీరందక బీడుగా మారిన ఆయకట్టు భూములు ● కంపచెట్లతో నిండిన కాలువలు


కంపచెట్లతో నిండిన సీతారామపురం ఊర చెరువు


తుమ్మచెట్లతో ఆనవాళ్లు కోల్పోయిన సాగునీటి కాలువ

సీతారామపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏళ్లు గడుస్తున్నా చెరువులు మరమ్మతులకు నోచుకోకపోవడంతో సాగునీరందక పచ్చని పొలాలు బీడు భూములుగా మారిపోతున్నాయని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని శ్రీరంగనాయకుల స్వామి చెరువు, సీతారామపురం ఊర చెరువు కింద కాలువలు ధ్వంసమయ్యాయి. చెరువుల నిండా, కాలువల పొడవునా కంపచెట్లు పెరిగిపోయాయి. ఈ చెరువుల కింద సుమారు 2500 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. గత పదేళ్ల నుంచి స్వామి చెరువు, ఊర చెరువు కింద పంట సాగుచేసిన దాఖలాలు లేవు. దానితో చెరువులో, కాలువ పొడవునా, ఆయకట్టు భూముల్లో కంపచెట్లు పెరిగి అడవిని తలపిస్తోంది. వీటిని తొలగించడానికి ఏటా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. ఈ కాలువలకు మరమ్మతులు చేపట్టాలని గత ప్రభుత్వంలో అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందని, కూటమి ప్రభుత్వమైనా తగు చర్యలు తీసుకుని కాలువలకు మరమ్మతులు చేపట్టాలని, చెరువులలో కంపచెట్లు తొలగించాలని, ఇందుకు ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

పదేళ్లుగా బీడుగానే ఉంచా : సింగాల సుబ్బయ్య, రైతు



మాకు స్వామి చెరువు తూము కింద భూమి ఉంది. పదేళ కిందట పంట సాగు చేసేవాళ్లం. మా భూమి ఆయకట్టుకు కాలువ పొడవునా కంపచెట్లు పెరగడం, కాలువ ధ్వంసం కావడంతో నీరు రావడం లేదు. దీంతో భూమిని బీడుపెట్టేశాం.

ఎమ్మెల్యే చొరవ చూపాలి
- తమ్మిశెట్టి వెంకటసుబ్బమ్మ, ఎంపీటీసీ



చెరువు కింద తూముల కాలువలకు వెంటనే మరమ్మతులు చేయాలి. అపుడే అన్నీ కాలువల ద్వారా ఆయకట్టుకు నీరు చేరుతుంది. లేకపోతే కాలువ మొదటి భూముల్లోనే వృథాగా పోతుంది. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చొరవచూపి మరమ్మతులు చేపట్టాలి.

సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎస్ శశిధర్, పశుసంవర్ధ శాఖ సహాయ సంచాలకులు, ఉదయగిరి

ముఖాముఖి



ఉదయగిరి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉదయగిరి పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు శశిధర్ సూచించారు.

? పశుగ్రాసం పెంపకంపై ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందా.

! బహువార్షిక పశుగ్రాసాల సాగుకు సన్న, చిన్నకారు రైతులకు ఉపాధి హామీ పథకం కింద 10-50 సెంట్ల భూమిలో పశుగ్రాసం పెంచేందుకు ఉచితంగా విత్తనాలు పంపిణీ చేయడంతోపాటు పెట్టుబడిని సైతం అందజేస్తాం.

? పశుగణనతో ఉపయోగాలు ఏమిటి.

! ఐదేళ్లకోసారి చేపట్టే పశుగణనతో పశువుల సంఖ్యను బట్టి ప్రభుత్వం మందుల పంపిణీ, సబ్సిడీలను అందించేందుకు వీలు కలుగుతుంది.

? ఎన్ని గోకులం షెడ్లు మంజూరయ్యాయి.

! ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలో 48 గోకులం షెడ్లు మంజూరయ్యాయి. షెడ్ నిర్మాణానికి ప్రభుత్వం లబ్ధిదారునికి రూ. 2.30 లక్షలు అందజేస్తుంది. ఇప్పటికే ఎనిమిది గోకులం షెడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

న్యూస్ బాక్స్

నాగారపమ్మకు పూజలు


నాగారపమ్మను దర్శించుకున్న భక్తులు

సంగం, నవంబరు 24 (నవంబరు): మండలంలోని కోలగట్లలో ఉన్న నాగారపమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి పూలంకరణ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా అంకమ్మ తిరునాళ్ల


ఆలయం వద్దకు వెళ్తున్న మహిళలు

అనంతసాగరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సోమశిల రోడ్డులో ఉన్న గ్రామదేవత అంకమ్మతల్లి తిరునాళ్ల ఆదివారం ఘనంగా ముగిశాయి. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దఎత్తున మహిళలు ఆలయానికి చేరుకొని పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు మాకిరెడ్డి జనార్దన్‌రెడ్డి, వెంకటరెడ్డి సోదరులు ఉభయకర్తలుగా వ్యవహరించి అన్నదానం నిర్వహించారు.

కార్తీకమాసం ప్రాధాన్యతపై అవగాహన



మాట్లాడుతున్న కమిటీ అధ్యక్షుడు

లింగసముద్రం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): యర్రారెడ్డిపాలెం, వెంగళాపురంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక దుత్తలూరు కమిటీ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్ ఆదివారం కార్తీక మాసం, సోమవారాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, పెంచలరత్నం, నరసింహులు, నాగమ్మ, మధు, ప్రేమ్‌కుమార్, మాలకొండారెడ్డి, పెదకొండారెడ్డి, మధుసూదనరావు ఉన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

కావలిటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముసునూరు రాఘవేంద్ర కాలనీ ట్రంకురోడ్డుని అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం అయ్యప్ప పడిపూజ వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో దర్శకర్తలు గురుస్వాములు, అయ్యప్పలు పాల్గొని భజనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ గావించారు.

సభాస్థలం పరిశీలన

వింజమూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ స్థాయి కార్యకర్తల అభినందన సభ డిసెంబరు 3వ తేదీన నిర్వహించేందుకు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు అందుబాటులో ఉన్న ఎస్‌వీఎస్ కల్యాణ మండపం పక్కనే ఉన్న స్థలాన్ని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు.